కిషన్‌చందర్ రచనలు–1
రూ॥ 200/-
పేజీలు: 220



ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



సింధూ నదీ జలాల నిలిపివేతతో పాకిస్థాన్‌కు అస్తిత్వ ప్రమాదం?

లాస్ ఏంజిల్స్‌లో సంక్షోభం : మీడియా భిన్న దృక్పథం

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 191 | బుధవారం | 11-06-2025 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00




05

భారత వ్యోమగామి తొలి ఐఎస్ఎస్ యాత్ర నేడే



05

లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించండి

ప్రధాని మోడీకి ఖర్గే లేఖ

ఎన్‌సిపి చీలుతుందని ఎప్పుడూ అనుకోలేదు 05

# 2 బహిరంగ సభలు



- రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణ, బిసి కులగణనపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో సభలు
- ఎఐసిసి చీఫ్ ఖర్గేతో భేటీలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన
- సానుకూలంగా స్పందించిన కాంగ్రెస్ అధిష్టానం
- మంత్రులకు శాఖల కేటాయింపుపై చర్చోపచర్చలు
- అధిష్ఠానం పిలుపుతో ఢిల్లీకి భట్టి, ఉత్తమ్
- నేడో రేపో శాఖల కేటాయింపు : మంత్రి వివేక్ వెంకట్‌స్వామి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఢిల్లీలో తెలంగాణ సిఎం ఎ.రేవంత్‌రెడ్డి పర్యటన బిజీ బిజీగా కొనసాగుతున్నది. సోమవారం ఢిల్లీకి వెళ్ళిన సిఎం మంగళవారం ఎఐసిసి అగ్ర నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో పాటు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగిన నేపథ్యంలో కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుపై అంశంపై వారితో సిఎం చర్చించారు. పలువురు మంత్రుల శాఖల్లో మార్పు, ఇతర అంశాలపై చర్చించినట్లు సమాచారం. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుపై కాంగ్రెస్ అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతున్నది. మరోవైపు టిపిసిసి నూతన కార్యవర్గాన్ని సోమవారం రాత్రి ప్రకటించిన నేపథ్యంలో గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ కార్పోరేషన్ల చైర్మన్ పదవులను కూడా భర్తీ చేయాలని అధిష్ఠానాన్ని సిఎం కోరినట్లు తెలిసింది. ఇప్పటికే రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణ, బిసి కులగణనపై రెండు బహిరంగ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ సభల తేదీలను ఖరారు చేయాలని, వీటికి హాజరుకావాలని మల్లిఖార్జున్ ఖర్గేను, రాహుల్ గాంధీని రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సిఎంకు వారు దిశానిర్దేశం చేశారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పరిపాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, తద్వారా వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్‌కు మరింత ప్రజాదరణను సాధించాలని సిఎంకు అధిష్ఠానం నాయకులు సిఎంకు సూచించారు.ఈ క్రమంలో ఈ అంశాలన్నింటిపైన చర్చించేందుకు ఢిల్లీకి రావాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిలకు ఎఐసిసి అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. దీంతో మంగళవారం సాయంత్రం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఢిల్లీకి వెళ్ళగా,డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క కూడా రాష్ట్రంలో బుధవారం నాటి తన కార్యక్రమాలను తరువాయి 2లో

## 'కగార్' చట్టవిరుద్ధ హత్యలు తక్షణం ఆపండి

- కస్టడీలో ఉన్న మావోయిస్టు నాయకులను కోర్టులో హాజరుపర్చండి
- ప్రధాని మోదీకి ఐదు వామపక్ష పార్టీల విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ 'కగార్' పేరుతో ఛత్తీస్‌గఢ్,ఆ పరిసర ప్రాంతాలలో జరుగుతున్న చట్టవిరుద్ధమైన ప్రభుత్వ హత్యలను తక్షణం నిలిపివేయాలని, ఎలాంటి వివక్షకు తావులేని న్యాయ విచారణకు ఉత్తర్వులు జారీ చేయాలని ఐదు వామపక్షాలు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లిఖితపూర్వకంగా డిమాండ్ చేశాయి. గాలింపు చర్యలు చేపట్టిన భద్రతాబలగాల కస్టడీలో ఉన్న మావోయిస్టులందరినీ న్యాయస్థానం ఎదుట హాజరుపరచి, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వామపక్షాలు కోరాయి. భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, సిపిఐ(మార్క్సిస్ట్–లెనినిస్ట్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, రివల్యూషనరీ సోషలిస్ట్‌పార్టీ (ఆర్‌ఎస్‌పి)ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, అఖిలభారత ఫార్వర్డ్‌బ్లాక్ (ఎఐఎఫ్‌బి) ప్రధానకార్యదర్శి జి.దేవరాజన్ సంయుక్తంగా ప్రధానమంత్రికి లిఖితపూర్వక విజ్ఞప్తి చేశారు. మంగళవారం నాడు మీడియాకు ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. "అనేకమంది సీనియర్ మావోయిస్టు నాయకులు భద్రతా బలగాల అదుపులో ఉన్నట్లు నివేదికలు వెలువడుతున్నాయి. వారిని తక్షణం న్యాయస్థానంలో హాజరుపరచాలని, చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఛత్తీస్‌గఢ్, ఆ పరిసర ప్రాంతాలన్నీ పూర్తిగా సైనికులతో నిండిపోయాయని, సాధారణ జన జీవితం పూర్తిగా తరువాయి 2లో

## ప్రభుత్వాసుపత్రిలో బాలుడు కిడ్నాప్

- నల్లగొండ జిల్లా కేంద్రంలో కలకలం
- బాలుడిని పట్టుకొని గోడదూకి పారిపోయిన గుర్తుతెలియని మహిళ
- భువనగిరి బస్సు ఎక్కినట్లు సిసి కెమెరా పుటేజీలో గుర్తింపు

ప్రజాపక్షం/నల్లగొండ



నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుని కిడ్నాప్ మంగళవారం కలకలం రేపింది. వివరాల్లోకెళ్తే మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి అనే గర్భిణీ తన రెండవ డెలివరీ కోసం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. భాగ్యలక్ష్మి తనకు సహాయకురాలుగా వరసకు చిన్నమ్మ అయిన వృద్ధురాలిని వెంట తీసుకొని రావడం జరిగింది. అయితే ఆమె ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటుండగా వృద్ధురాలు బాలుని తీసుకొని బయట ఆసుపత్రి ఆవరణలో ఆడిపిస్తుండగా మధ్యాహ్నం మూడు గంటల తరువాయి 2లో

## అమెరికాలో అమానుషం

భారతీయ విద్యార్థిని నేలపై పడుకోబెట్టి సంకెళ్లు

ఘటనపై భగ్గుమన్న భారత్
ట్రంప్‌తో మోదీ మాట్లాడాలని కాంగ్రెస్ డిమాండ్



**న్యూఢిల్లీ :** అమెరికాలోని న్యూవార్క్ విమానాశ్రయంలో భారతీయ విద్యార్థి చేతికి సంకెళ్ళు వేసి, నేలపై పడుకోబెట్టిన ఘటనపై భారతదేశం భగ్గుమంటోంది. ఈ అమానుష ఘటనను నెటిజన్‌లు తీవ్రంగా ఖండించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. భారతీయ విద్యార్థిని నేలపై పడుకోబెట్టి, చేతులకు సంకెళ్లు వేసి అరెస్ట్ చేసి, ఆ తర్వాత దేశం నుంచి బహిష్కరించారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్‌లు, ఫోటోలు పెద్ద ఎత్తున వైరల్ తరువాయి 2లో

## బహుళ అంతస్తులో భారీ అగ్నిప్రమాదం

ప్రాణాలు రక్షించుకునే క్రమంలో ఇద్దరు చిన్నారులు సహా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి




**న్యూఢిల్లీ :** ఢిల్లీ ద్వారక ప్రాంతంలోని ఎనిమిదవ, తొమ్మిదవ అంతస్తుల డూప్లెక్స్ ఫ్లాట్‌లో మంగళవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రాణాలు కాపాడుకునే క్రమంలో ఇద్దరు చిన్నారులు సహా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు భవనం నుంచి దూకే ప్రయత్నం చేయగా, వారు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భవనం ఎనిమిదవ అంతస్తులో ఉన్న ఆలయం నుండి మంటలు ప్రారంభమై అతి వేగంగా ప్లాస్టిక్ ప్యానెల్‌ల ద్వారా వ్యాపించాయని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ప్రమాదంలో మరణించిన మృతులను యశ్ యాదవ్ (35), 12 ఏళ్ల కుమార్తె (12), 11 ఏళ్ల మేనల్లుడుగా గుర్తించారు. వీరు ఎనిమిదవ అంతస్తు బాల్కనీ నుండి దూకే ప్రయత్నం చేశారు. ఈ కుటుంబం భవనంపై రెండు అంతస్తులలోని డూప్లెక్స్‌లో నివసిస్తుంది. అయితే మంటలు చెలరేగినప్పుడు కుటుంబం మెట్ల ద్వారా తొమ్మిదవ అంతస్తుకు వెళ్లి ప్రాణాలు రక్షించుకునే ప్రయత్నం చేసిందని, తరువాయి 2లో

## నేడు జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ముందుకు కెసిఆర్

భారీ జనసమీకరణతో వెళ్ళేందుకు బిఆర్ఎస్ ప్లాన్

ప్రజాపక్షం/హైదరాబాద్



'కాళేశ్వరం కమిషన్' విచారణలో భాగంగా బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బుధవారం కమిషన్ ముందు హాజరుకానున్నారు. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ అడిగే ప్రశ్నలకు ఒక వైపు కెసిఆర్ సన్నద్ధమవ్వగా, మరోవైపు భారీ జనసమీకరణ చేపట్టేందుకు బిఆర్ఎస్ సిద్ధమైనట్టు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముఖ్యనాయకులతో పాటు, నాయకులను కూడా హైదారబాద్‌కు చేరుకోవాలని ఇప్పటికే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు పిలుపునిచ్చినట్టు సమాచారం. 'కాళేశ్వరం ప్రాజెక్ట్'లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో విచారణ కమిషన్ ఇప్పటికే అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను,పలువురు ఇంజనీర్లను విచారించిన విషయం తెలిసిందే. ఇటీవల మాజీ మంత్రులు తన్నీరు హరీశ్ రావు, ఈటల రాజేందర్‌లను కూడా కమిషన్ విచారించింది. బుధవారం ఉదయం కెసిఆర్‌ను విచారించనుంది. కాగా మాజీ సిఎం హోదాలో విచారణకు హాజరుకానున్న నేపథ్యంలో బహిరంగ విచారణ కాకుండా ఇన్ కెమెరా విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎర్రవెల్లి నుంచి బిఆర్‌కె భవన్ వరకు కెసిఆర్ వెంట సుమారు 15 నుంచి 20కి పైగా వాహనాల కాన్వాయ్ ఉండేలా బిఆర్ఎస్ తరువాయి 2లో

## 51వేల విద్యుత్ ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా

- బ్యాంకర్లతో ప్రభుత్వం ఒప్పందం
- రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే కార్యక్రమం
- విద్యుత్ సిబ్బందిలో నమ్మకం, ధైర్యాన్ని ఇవ్వడం కోసమే పథకం
- డిప్యూటీ సిఎం భట్టి




ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్ర, దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న 50,868 మంది విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా పథకం కోసం బ్యాంకర్లతో ఒప్పందం చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్‌లో మంగళవారం విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమాకు బ్యాంకర్లతో ఒప్పందం అనంతరం ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సిఎం ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల కోసం పనిచేసే సంస్థల్లో విద్యుత్ సంస్థ ప్రధానమైనదని, ఆ సంస్థలో పనిచేసే సిబ్బంది కుటుంబాల గురించి వారి యోగ క్షేమాల గురించి ఆలోచించి తీసుకున్న ఈ ప్రమాద బీమా పథకం బాగా తృప్తిని ఇచ్చిందని తెలిపారు. విద్యుత్ శాఖలో పనిచేసే తరువాయి 2లో

## రూ.2125 కోట్ల పెట్టుబడులు 5020 మందికి ఉపాధి

- రాష్ట్రానికి చెందిన ఐదు కంపెనీలతో యుఎఇ కంపెనీల అవగాహనా ఒప్పందం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో యుఎఇకి చెందిన శైవ గ్రూప్, టారనిస్ కేపిటల్ సంయుక్తంగా రూ.2125 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చినట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇందుకు రాష్ట్రానికి చెందిన ఐదు స్థానిక కంపెనీలతో.. ఈ రెండు సంస్థలు మంగళవారం సచివాలయంలో అవగాహన ఒప్పందం చేసుకున్నాయన్నారు. తద్వారా కొత్తగా మరో 5020 మంది తెలంగాణ యువతకు ఉపాధి లభిస్తుందని వివరించారు. 'రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి... తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నదే సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పం' అని ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో పేర్కొన్నారు. 18 నెలల్లో 60వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. ఏడాదిన్నర కాలంలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణకు తీసుకొచ్చాం. ఫలితంగా ప్రైవేట్ రంగంలో లక్ష మందికి పైగా తెలంగాణ యువతకు ఉద్యోగాలు లభించాయి. ఈ ప్రయాణంలో ఈరోజు మరో గొప్ప అడుగు ముందుకేశాం అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. 'అటు సంక్షేమం.. ఇటు అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు ధీటుగా దూసుకెళ్తున్న తెలంగాణ పురోగతిలో భాగస్వామ్యయ్యేందుకు ముందుకొచ్చిన యూఏఈకి చెందిన ప్రముఖ కంపెనీలు శైవ గ్రూప్, టారనిస్ కేపిటల్‌ను ప్రభుత్వం తరఫున తరువాయి 2లో

## కర్నాటకలో మళ్లీ కులగణన

రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ హైకమాండ్ సూచన



**న్యూఢిల్లీ :** కర్ణాటకలో మరోసారి కులగణన చేపట్టే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ అధిష్ఠానం కీలక సూచన చేసింది. నిర్ణీత కాలపరిమితి లోగా తిరిగి కులగణన చేపట్టాలని సిఎం సిద్ధరామయ్యకు సూచించింది. ఈ మేరకు ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులతో కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సిఎం డికె శివకుమార్ సహా పలువురు నేతలు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మీడియాతో తరువాయి 12లో

## బస్‌పాస్ చార్జీల పెంపు పేదలపై పెను భారం

- తక్షణమే పెంపును ఉపసంహరించుకోవాలి : సిపిఐ
- బస్‌భవన్ వద్ద ఎమ్మెల్సీ కవిత ధర్నా
- విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ : ఎఐఎస్ఎఫ్ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసి బస్సు చార్జీల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని పాలు పార్టీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. చార్జీల పెంపు పేద ప్రజలు బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు పెను భారం కానుందని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి బస్ పాస్ చార్జీలు పెంచి ఒక్కో ప్రయాణికుడు పై ప్రతి నెల రూ. 200 నుంచి రూ.300 భారం మోపడం సరైంది కాదని, దీనిని సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఆర్‌టిసి బస్సుల్లో పేద, మధ్య తరగతి ప్రజలు మాత్రమే ప్రయాణిస్తారని... వారికి రాయితీలను ఇవ్వాల్సింది పోయి చార్జీలు పెంచి వారిపై మోయలేని భారం మోపారని ఆయన తరువాయి 12లో

## వామ్మో 'జూన్'



- ఈ మాసంలో అన్నింటికీ అదనపు భారం
- ఒక వైపు పంటలకు పెట్టుబడులు
- మరో వైపు పిల్లల చదువులు
- పేద, మధ్యతరగతి కుటుంబాల్లో గుబులు



జూన్ మాసం వస్తుందంటే మధ్యతరగతి కుటుంబాల్లో గుండెలు గుబేల్‌మంటున్నాయి. ఈ మాసంలో ప్రతి ఒక్కరికి అదనపు భారం ఉంటుంది. ఒక వైపు పిల్లల చదువుల ఫీజులు, మరో వైపు రైతులకు పెట్టుబడులు, దుక్కులు దున్నడం, విత్తనాల కొనుగోలు ఇలా అన్నింటికి వేలల్లో ఖర్చులు చుట్టు ముడతాయి. అప్పుల కోసం పరుగులు తీయడం ఆ అప్పులు తీర్చేందుకు ఏడాదంతా కష్టపడటం ఇలా సామాన్యులకు జూన్ మాసం ఒక సవాల్‌గా మారింది.

ప్రజాపక్షం/ఖమ్మం టౌన్

మరికొన్ని రోజుల్లో బడి గంట మోగనుంది. ఇన్నాళ్లు ఆటపాటల్లో మునిగిన విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. జూన్ 12న పాఠశాలలు తెరుచుకోనుండటంతో తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలవుతోంది. పిల్లలను బడిలో చేర్పించటం, ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్స్, రవాణా ఛార్జీలు, ఇతర సామాగ్రి కొనుగోలు వంటివి ఉంటాయి. వీటికి వేలాది రూపాయలు చెల్లించాలి. మరో వైపు ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల్లో అడ్డు అదుపు లేకుండా తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## కీవ్‌పై రష్యాదాడి : ముగ్గురు మృతి

**కీవ్ :** ఉక్రేన్ రాజధాని కీవ్‌పై మరోసారి రష్యా దాడి చేసింది. ఈ దాడిలో ముగ్గురు పౌరులు మరణించారు. మరో 13 మంది గాయపడ్డారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆన్‌లైన్‌లో ఒక ప్రకటన చేస్తూ, 315 డ్రోన్లతో రష్యా దాడి చేసిందని పేర్కొన్నారు. మూడేళ్ళ యుద్ధంలో జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇదికూడా ఒక దాడి అని పేర్కొన్నారు. రాత్రికి రాత్రే డ్రోన్లతోపాటు ఏడు క్షిపణులను కూడా ప్రయోగించారని ఆయన చెప్పారు. కీవ్ నగరంలో ఇద్దరు మరణించారు. తొమ్మిదిమంది గాయపడ్డారు. అదేవిధంగా రష్యా రక్షణ మంత్రిత్వశాఖ ఒక ప్రకటన చేస్తూ తమ భూభాగంలోకి ప్రవేశించిన 102 ఉక్రేన్ డ్రోన్లను ధ్వంసం చేసినట్లు పేర్కొంది.

### ఆ మూడూ తోలుబొమ్మ దేశాలే

లాత్వియా, ఎస్తోనియా, లిథుయేనియా దేశాలు మూడూ యూరోపియన్ యూనియన్ చేతిలో తోలుబొమ్మలుగా మారాయని రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్ విమర్శించారు. ఈ మూడు దేశాలకు ఎంతమాత్రం నిజమైన, హేతుబద్ధమైన రాజకీయ స్వాతంత్ర్యం, రాజకీయ స్వేచ్ఛ లేకుండాపోయాయని, రాజకీయ స్వయంప్రతిపత్తి లేకుండాపోయిందని విమర్శించారు.

# ట్రంప్ వర్సెస్ కాలిఫోర్నియా గవర్నర్

### ఫుడ్డూ–బెడ్డూ లేని నేషనల్ గార్డ్స్





**శాక్రమెంటో :** కాలిఫోర్నియాలో వలస ప్రజల ''ఐ సి ఇ'' నిరసనలు (ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులపట్ల వ్యతిరేకత) అర్థరాత్రి దాటేసరికి దాదాపు సద్దుమణిగాయి. మంగళవారంనాటికి దాదాపు ప్రశాంతత ఏర్పడిందని డిస్ట్రిక్ట్ అటార్నీ చెప్పారు. కానీ రాజకీయస్థాయిలో మాత్రం కాలిఫోర్నియా–వైట్‌హౌస్ మధ్య వివాదం ముదిరి పాకాన పడింది.

వలస ప్రజల నిరసనను అణచివేయడానికి సైన్యాన్ని తరలించిన ట్రంప్ చర్యను కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ తప్పుపట్టారు. నేషనల్ గార్డ్స్ అవసరంలేదంటూ వారిని అడ్డుకునేందుకు గవర్నర్ ఇచ్చిన ఆదేశాన్ని అధిగమించారనీ, అందుకు అతీతంగా ప్రవర్తించడం కాలిఫోర్నియా రాష్ట్ర సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీకి చెందిన న్యూసమ్ కోర్టులో సవాలు చేశారు. ఈ చర్యతో ట్రంప్ అగ్గిమీద గుగ్గిలమయ్యారు. ఫెడరల్ అథారిటీని న్యూసమ్ ఉల్లంఘించారని, అందువల్ల కాలిఫోర్నియా గవర్నర్‌ను అరెస్టు చేయాల్సిందే అంటూ భీష్మించారు. ''చట్టబద్ధంగా సంక్రమించే కార్యనిర్వాహక అధికారాల పరిధిని అతిక్రమించడానికి ట్రంప్ పదే పదే తన అధికారాన్ని దుర్వినియోగం చేశారు, ఈ చర్య రాజ్యాంగ విరుద్ధం'' అని గవర్నర్ తరపున అటార్నీ జనరల్ తన కోర్టు దావాలో స్పష్టంగా తెలియజేశారు. దీంతో ఈ సమస్య ట్రంప్ వెర్సస్ గవిన్ న్యూసమ్‌గా మారింది. దేశాధ్యక్షుడు ట్రంప్ నేషనల్ గార్డ్స్‌ను కాలిఫోర్నియాలో మోహరించడాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ ఆయన కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ట్రంప్ చర్య రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని ఆయన పిటిషన్‌లో కోరారు. సైనికులను మోహరించిన ట్రంప్ కాలిఫోర్నియా ప్రభుత్వాన్ని బెదిరిస్తున్నారని, రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. 2000 మంది నేషనల్ గార్డ్స్ సైనికులకు తినడానికి ఆహారం, తాగునీరు నిద్రపోవడానికి సరైన ప్రదేశం చూపించకుండా వారిని కాలిఫోర్నియాకు తరలించారని, సైనికులంతా రోడ్లపై అడ్డదిడ్డంగా పడుకుని జనాన్ని భయపెడుతున్నారని విమర్శించారు.

మొదట కాలిఫోర్నియాకు తరలించిన రెండువేల మంది నేషనల్ గార్డ్స్‌లో సగంమందిపైగా పనీపాటా లేకుండా ఖాళీగా కూర్చున్నారని, వారికి తిండి పెట్టేవారు లేరని, నిద్రపోయేందుకు తగిన సౌకర్యాలు లేవని, ఇప్పుడు కొత్తగా మరో 2000 మంది నేషనల్ గార్డ్స్‌ను పంపించి ఏం చేస్తారని, వారికి ఎలాంటి సౌకర్యాలు, తగిన పని ఇవ్వకుండా పస్తులు పెడతారా? అని గవిన్ న్యూస్‌మన్ ప్రశ్నించారు.

సైనికులను చాలా అమర్యాదగా ట్రంప్ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. సైనికులు ఒక ప్రభుత్వ భవనంలో ఎలాంటి సదుపాయాలు లేకుండా నిద్రపోతున్న దృశ్యాలను ఆయన ఎక్స్ వేదికగా, సోషల్ మీడియాలో షేర్ చేశారు.

# లాస్ ఏంజెల్స్‌కు బలగాల రెట్టింపు

**వాషింగ్టన్ :** ట్రంప్ యంత్రాంగం లాస్‌ఏంజెల్స్‌కు రెట్టింపు బలగాలను తరలించింది. గడచిన నాలుగు రోజులుగా తీవ్ర నిరసనలమధ్య 2000 మంది నేషనల్ గార్డ్స్ వలస ప్రజల నిరసనను అణచివేసేందుకు ప్రయత్నిస్తుండగా మరో 2,000 మంది నేషనల్ గార్డ్స్‌ను లాస్‌ఏంజెల్స్‌కు తరలించినట్లు వాషింగ్టన్‌లో వైట్‌హౌస్ ప్రభుత్వ యంత్రాంగం మంగళవారంనాడు ధృవీకరించింది. అమెరికా రక్షణశాఖ పెంటగాన్ ఉన్నతాధికారులు 700 మంది మెరైన్ బలగాలను తరలించారు. ఐతే ఈ బలగాలు రాత్రికి ఆలస్యంగా శాక్రిమెంటో చేరుకుంటాయి. దీంతో మొత్తం సైనిక బలగాల సంఖ్య 4,700కు చేరుకుంది. ఐతే రెండో బృందం కాలిఫోర్నియా చేరుకున్నట్లు ధృవీకరణ లేదు.

కాలిఫోర్నియాలో ఆస్తులను సంరక్షించేందుకే ఈ దళాలు వెళుతున్నాయని ఉత్తర కమాండ్‌కు చెందిన అధికారి ఒకరు చెప్పారు. దేశానికి వ్యతిరేకంగా జరిగే యుద్ధంలో ఉపయోగించాల్సిన నేషనల్ గార్డ్స్ సైన్యాన్ని సొంతదేశంలోని ప్రజల నిరసనను అణచివేసేందుకు తరలించడాన్ని కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ మాత్రమేకాకుండా బాహ్య ప్రపంచం కూడా తప్పుపడుతున్నది. కానీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాత్రం తన చర్యను, నేషనల్ గార్డ్స్ పనితీరును సమర్థించుకున్నారు. నిరసనలు ప్రారంభమైన తర్వాత 800 మంది లాస్‌ఏంజెల్స్ పోలీసులు ''టాక్టికల్ ఎలర్ట్'' కార్యక్రమంలో నిమగ్నమయ్యారు.

### గొప్ప నిర్ణయం తీసుకున్నా : ట్రంప్

కాలిఫోర్నియాకు నేషనల్ గార్డ్స్‌ను పంపించి తాను గొప్ప నిర్ణయం తీసుకున్నానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన భుజాలను తానే చరుచుకుని అభినందనలు చెప్పుకున్నారు. మరో వైపు లాస్‌ఏంజల్స్ డిస్ట్రిక్ట్ అటార్నీ నాథన్ హోచ్‌మన్ మాట్లాడుతూ, రాజకీయ ప్రకటనలు, రాజకీయస్థాయిలో చేసే సంభాషణలవల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, చట్టబద్ధ హక్కుల ప్రకారం వలస ప్రజలు అభద్రతతో తమ వాదన వినిపించేందుకు వేలాదిమంది వీధుల్లోకి వచ్చారని, పరిస్థితిని తాము సమీక్షించి పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. నేషనల్ గార్డ్స్‌ను పంపాల్సినంత అవసరంలేదని, స్థానికంగానే పరిష్కరించేస్థాయిలో పరిస్థితి ఉందని అన్నారు. గడచిన నాలుగు రోజుల్లో పోలీసులు, ప్రదర్శకులమధ్య ఘర్షణలు జరిగాయి. నలుగురు జర్నలిస్టులు కూడా గాయపడ్డారు.

ఇదిలా ఉండగా, ట్రంప్ నియమించిన బోర్డర్ జార్ టామ్ హోమన్ ఒక ప్రకటన చేస్తూ అక్రమ వలస ప్రజల ఏరివేత చర్యలకు ఎవరు అడ్డువచ్చినాసరే అరెస్టులు తప్పవని హెచ్చరించారు. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్‌కు కూడా ఇది వర్తిస్తుందన్నారు. రోజుకు 6000 మంది వలస ప్రజలను గుర్తించాలని బోర్డర్ జార్ కార్యాలయం లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో ఈ లక్షిత సంఖ్యను రోజుకు 660గా నిర్దేశించారు.

### మెక్సికన్ వలస ప్రజలు క్రిమినల్స్ కాదు



**మెక్సికోసిటీ :** వలస ప్రజలు క్రిమినల్స్ కాదనీ, వారికి గౌరవ మర్యాదలు ఇవ్వాలని మెక్సికో దేశాధ్యక్షురాలు షీన్‌బామ్ కోరారు. మెక్సికో నుండి అమెరికా వెళ్ళిన పురుషులు, స్త్రీలు ఎంతో మంచివారనీ, తమ జీవితాలను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకునేందుకే అమెరికా వెళ్లారని, వారందరూ మర్యాదస్తులు, క్రిమినల్స్ కాదనీ షీన్‌బామ్ క్లీన్‌చిట్ ఇచ్చారు. ఇమ్మిగ్రేషన్ అధికారుల దాడుల కారణంగా కాలిఫోర్నియాలో వలస ప్రజలు నిరసనకు దిగారు. ఇమ్మిగ్రేషన్ అధికారులు 35 మందిని అక్రమంగా అరెస్టు చేశారని, ఈ ప్రభావం తమ దేశంలో కూడా ఉద్రిక్తతలకు ఆజ్యం పోసిందని షీన్‌బామ్ అన్నారు. వలస ప్రజలకు తగిన గౌరవ మర్యాదలు ఇవ్వాలని కోరారు.

# ఆస్ట్రియా సెకండరీ స్కూలలో కాల్పులు

### పది మంది మృతి



**వియన్నా :** ఆస్ట్రియా ఆగ్నేయప్రాంత నగరం గ్రాజ్‌లోని ఒక స్కూలులో జరిగిన కాల్పుల్లో తొమ్మిదిమంది విద్యార్థులు సహా పదిమంది మరణించినట్లు స్థానిక మేయర్ ఎల్కే కహర్ మీడియాకు తెలియజేశారు. కాల్పుల్లో అనేకమంది గాయపడ్డారు. మృతులు చాలామంది ఉంటారని, అనేకమంది గాయపడ్డారన్నది ప్రాథమిక సమాచారం. కానీ తర్వాత మృతుల సంఖ్యను ధృవీకరించారు. డ్రీయర్ షుట్జంగాస్సే సెంకడరీ పాఠశాలలో మంగళవారం ఉదయం పది గంటలకు కాల్పుల సంఘటన జరిగిందని మేయర్ చెప్పారు. కాల్పులు జరిపింది కూడా ఒక విద్యార్థే. కాల్పులకు పాల్పడిన విద్యార్థి తర్వాత టాయిలెట్‌లోకి వెళ్ళి తన ప్రాణం తానే తీసుకున్నాడు. రెండు తరగతి గదుల్లోకి ఈ విద్యార్థి ప్రవేశించి గుండ్రంగా తిరుగుతూ కాల్పులు జరిపాడు. ఇతర వివరాలను సేకరిస్తున్నారు. ఘటన వివరాలు తెలియగానే పెద్దసంఖ్యలో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఆ పరిసర ప్రాంతాల భద్రత కట్టుదిట్టం చేశారు. ఎలాంటి కిడ్నాప్ ఘటనలు జరగకుండా ప్రత్యేక కోబ్రా దళాలను స్కూలు దగ్గర మోహరించినట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఛాన్సలర్ క్రిస్టియన్ స్టోల్‌కర్ సహా ఇతర ఉన్నతాధికారులు కూడా పనులన్నీ స్తంభింపజేసి స్కూలువద్దకు చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించారు. ఆస్ట్రియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వాన్డర్ బెల్లెన్ తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. తనకు మాటలు రావడంలేదన్నారు. సెకండరీ స్కూల్లో కాల్పులు, విద్యార్థుల మరణాలపట్ల యూరోపియన్ కమిషన్ చైర్మన్ ఉర్సులా ఓండర్ లేయన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

# పలు అమెరికా నగరాలకు నిరసనల జ్వాల



**వాషింగ్టన్ :** వలస ప్రజలపై అధికారులు దాడులు చేయడాన్ని నిరసిస్తూ కాలిఫోర్నియాలో ఉధృతంగా మొదలైన నిరసన ప్రదర్శనలు అమెరికాలోని పలు నగరాలకు విస్తరించాయి. న్యూయార్క్, బోస్టన్, చికాగో, డల్లాస్, తంపా, శాన్‌ఫ్రాన్సిస్కో నగరాలలో పెద్దసంఖ్యలో ప్రదర్శకులు వీధుల్లోకి వచ్చి నిరసన తెలియజేశారు. వలస ప్రజలకు రక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వలస ప్రజలపట్ల ట్రంప్ అనుసరిస్తున్న విధానాలను అమెరికా ప్రజలు కొద్దికాలంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వారిని ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకుని యుద్ధఖైదీల తరహాలో తరలించడాన్ని అమెరికన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వలస ప్రజలవల్లే అమెరికాలో నేరాలసంఖ్య గణనీయంగా పెరిగిందని ట్రంప్ చాలా గట్టిగా విశ్వసిస్తున్నారు. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) నినాదాన్ని అమలు చేయడంలో భాగంగా వలస ప్రజలను దేశంలోకి రాకుండా అడ్డుకోవాలనే నినాదంతో ట్రంప్ చర్యలు తీసుకోవడం ప్రారంభించి దేశంలో అనేక దశాబ్దాలుగా ఉన్న వలస ప్రజలను కూడా నిర్దాక్షిణ్యంగా తరలిస్తూ ఉండటంతో నిరసనలు పెల్లుబుకుతున్నాయి. ఐతే పలువురు ప్రదర్శకులను అన్ని నగరాలలోనూ పోలీసులు అరెస్టు చేశారు.

## 5020 మందికి ఉపాధి

(మొదటి పేజీ తరువాయి)

సాదరంగా ఆహ్వానిస్తున్నాం' అని చెప్పారు. 'శైవ గ్రూప్, టారనిస్ కేపిటల్ సంయుక్తంగా రివలేషన్స్ బయోటెక్ లో రూ.1360 కోట్లు, మనాకిన్ బయోలో రూ.340కోట్లు, స్వబోధ ఇన్ఫినిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజర్స్‌లో రూ.80 కోట్లు, ఎగ్జిగెంట్ డ్రిల్లింగ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.90 కోట్లు, యంత్ర టెక్ కంట్రోల్స్‌లో రూ.255 కోట్లు పెట్టుబడులు పెడుతున్నాయి' అని చెప్పారు. 'ఇది తొలి అడుగు మాత్రమే. రాబోయే మూడేళ్లలో బయోటెక్, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్, ఎనర్జీ, ఫిన్ టెక్, పబ్లిక్ సెక్టార్స్ తదితర రంగాల్లో మరో రూ.24వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు శైవ గ్రూప్, టారనిస్ కేపిటల్ సంసిద్ధత వ్యక్తం చేశాయి' అంటూ హర్షం వ్యక్తం చేశారు. 'ఈ రెండు కంపెనీలు రాబోయే మూడేళ్లలో బయోటెక్ రంగంలో తినుబండారాల్లో చక్కెర శాతాన్ని తగ్గించడం, యాంటీ డయాబెటిక్, ఫుడ్ మేనేజ్‌మెంట్ ఉత్పత్తులు, పబ్లిక్ సెక్టార్‌లో ఫోర్త్ సిటీ, ఏఐ సిటీలో పెట్టుబడులు పెట్టనున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వంపై నమ్మకం ఉంచి... 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకొచ్చిన వీరికి ప్రత్యేక ధన్యవాదాలు' అని చెప్పారు. 'కొందరు రాష్ట్రానికి పెట్టుబడులు రావడం లేదు... పరిశ్రమలు తరలి వెళ్లిపోతున్నాయంటూ మా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి వారికి మేం తీసుకొస్తున్న పెట్టుబడులు, కల్పిస్తున్న ఉద్యోగాలు కనిపించడం లేదా..? ఒక్కసారి తెలంగాణ ప్రజలు ఆలోచించాలి' అని కోరారు. 'ఇక్కడి యువత ప్రతిభే మాకున్న పెద్ద ఆస్తి. డిగ్రీ, ఇంజినీరింగ్ పట్టా తీసుకుని బయటికొచ్చే విద్యార్థుల్లో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఉండటం లేదనే ఫిర్యాదు పారిశ్రామికవేత్తల నుంచి తరచూ వస్తోంది.

కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏ రాయ్ డిన్ రోచ్, శైవ గ్రూప్ చైర్మన్, సిఇఒ అమిత్ జగన్నాథ్ వర్మ, టారనిస్ కేపిటల్ సిఇఒ నికోలస్ ఎస్.బింగ్ హామ్, రివలేషన్స్ బయోటెక్ ఎండి రవిచంద్ర బీరం, మనాకిన్ బయో డైరెక్టర్ జశ్వంత్ ప్రణవ్ యతిరాజాం, స్వబోధ ఇన్ఫినిటీ ఇన్వెస్ట్ మెంట్స్ అడ్వైజర్స్ సిఇఒ సంకర్ష్ చందా, ఎగ్జిగెంట్ డ్రిల్లింగ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పాండురంగా రావు తమ్మినేని, యంత్ర టెక్ కంట్రోల్స్ సిఇఒ సమీర్ కాంత్ పాల్గొన్నారు.

## కోటి ప్రమాద బీమా

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులు రాత్రి, పగలు అని తేడా లేకుండా శ్రమిస్తారని, ప్రకృతి వైపరీత్యాలకు ప్రాణాలు అడ్డంపెట్టి విధుల్లో నిమగ్నమవుతారని, వారి కుటుంబాల యోగక్షేమాల కోసం ఈ ప్రమాద బీమా పథకాన్ని తీసుకువచ్చామన్నారు. విద్యుత్ శాఖ రాష్ట్ర జిడిపి పెరుగుదలకు ఇంధనంగా ఉపయోగపడే ప్రధాన శాఖ అని తెలిపారు. లైన్‌మెన్ మొదలు సిఎండి స్థాయి వరకు పనిచేసే ఉద్యోగులందరికీ కుటుంబాలు ఉంటాయని, హోదాలు వేరైనా కుటుంబం విషయానికి వచ్చేసరికి ఒకే రకమైన బంధం అనుబంధం, బాధ్యత ఉంటుందని తెలిపారు. ఇంటి పెద్దకు ఊహించని ప్రమాదం ఏదైనా ఎదురైతే ఆ కుటుంబం తలకిందులవుతుందని, గందరగోళ పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ఆ పరిస్థితులు ఏర్పడవద్దని కోరుకుంటున్నానని, అనుకోకుండా అలా జరిగితే ఆ కుటుంబాలు తలకిందులయ్యే పరిస్థితులు రాకుండా ఉండడానికే ఈ ప్రమాద బీమా పథకానికి శ్రీకారం చుట్టామని డిప్యూటీ సిఎం తెలిపారు. విద్యుత్తు సిబ్బందిలో నమ్మకం, ధైర్యాన్ని ఇవ్వడం కోసం ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేకుండా ఈ పథకాన్ని తీసుకువచ్చామని, దీని ద్వారా ఉద్యోగుల్లో మనోధైర్యం పెరుగుతుందని, ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుందన్నారు. ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం బాధ్యతగా భావిస్తున్నానని డిప్యూటీ సిఎం తెలిపారు. ఎస్‌బిఐలో ఖాతా తెరిచిన విద్యుత్ ఉద్యోగులకు కేవలం ప్రమాద బీమా నే కాకుండా పెళ్లి, విద్యాపరమైన ఆర్థిక సహాయం లోను రుణాలు అందించి చేయూతను ఇవ్వనున్నారని తెలిపారు. శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి 80 లక్షల పరిహారం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇంధన శాఖ సిఎండి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభలు

(మొదటి పేజీ తరువాయి)

రద్దు చేసుకుని మంగళవారం రాత్రి ఢిల్లీకి వెళ్ళారు. ఈ విషయాలపై కూడా భట్టివిక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు రాష్ట్రంలోని సీనియర్, ముఖ్యమైన నాయకులతో అధిష్టానం చర్చించే అవకాశం ఉంది. బుధవారం ఉదయం కూడా మరి కొంత మంది నాయకులకు అధిష్టానం నుంచి పిలుపు వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నారు. మరోవైపు మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కకపోవడంతో అసంతృప్తితో ఉన్న పి.సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులను ఇప్పటికే మంత్రులు బుజ్జగిస్తుండగా, అసంతృప్తితో ఉన్న నాయకుల విషయంలో ఎలా వ్యవహరించాలని కూడా అధిష్టానం ఆలోచిస్తున్నది.

ఈ విషయాలన్నింటిపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలపై ఢిల్లీలో హాట్ హాట్‌గా చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. శాఖల కేటాయింపు నేడు లేదా రేపు ఖరారవుతాయని ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.

# అనుమతి లేని విద్యా సంస్థలకు నోటీసులు




### జులై మొదటి వారంలో ఇంజినీరింగ్ కౌన్సిలింగ్
### రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజినీరింగ్ కౌన్సిలింగ్‌ను జులై మొదటి వారంలో నిర్వహించనున్నామని, ఆగస్టు 14లోపు ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తవుతుందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఆగస్టు 14 నుంచి ఇంజినీరింగ్ తరగతులు ప్రారంభిస్తామన్నారు. అనుమతి లేకుండా కొనసాగుతున్న విద్యా సంస్థలకు నోటీసులు జారీచేసినట్టు వెల్లడించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్‌తో కలిసి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ అనుమతి లేకుండా విద్యాసంస్థలను నడుపుతున్నారని, ఇలాంటి సంస్థలైన నెక్స్ట్‌వేవ్, బైట్ ఎక్స్‌ఎల్ టెక్ ఎడ్, లీప్ స్టార్ట్, ఇంటెల్లిపాత్ సంస్థలకు నోటీసులు జారీ చేశామని, వివరణ కోసం ఈనెల 13 వరకు ఆ విద్యాసంస్థలకు గడువు ఇచ్చామని తెలిపారు. ఈ సంస్థలలో విద్యార్థులు చేరుతున్నారన్నారు. డీమ్డ్ వర్సిటీలతో ఒప్పందం చేసుకున్నట్లు ఆ విద్యాసంస్థలు తెలుపుతున్నాయని, డీమ్డ్ యూనివర్సిటీల అంశం కోర్టు పరిధిలో ఉందని బాలకిష్టారెడ్డి వివరించారు. ఉన్నత విద్యామండలిలో సంస్కరణల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని, సిలబస్ మార్పుపై కసరత్తు చేస్తున్నామని బాలకిష్టారెడ్డి తెలిపారు. సిలబస్ మార్పుపై కసరత్తు చేస్తున్నామని, కోర్సుల ఎంపికపై విద్యార్థులకు హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. జెఇఇ కౌన్సెలింగ్ కాకుండా రాష్ట్రంలో కౌన్సెలింగ్ చేపట్టలేమని, విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌కు సమయం ఉండటంతో కళాశాలల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. బి కేటగిరీ సీట్లలపై ఇంకా స్పష్టత రాలేదని, ఈ అంశం ప్రభుత్వం వద్ద ఉన్నదని ఆయన చెప్పారు. తల్లిదండ్రులు అనవసరంగా బి కేటగిరీ సీట్ల కోసం డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. బి కేటగిరీ సీట్ల అంశంపై ప్రభుత్వానికి లేఖ రాసినట్టు బాలకిష్టారెడ్డి స్పష్టం చేశారు.

## భారీ అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు చిన్న పిల్లలు వెనుకబడిపగా, వారిని రక్షించడానికి యశ్ తిరిగి వెనక్కి వచ్చాడు. అప్పటికే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించగా, వారిని రక్షించలేకపోయాడని అధికారి తెలిపారు. కుటుంబంలోని మరో ఇద్దరు వ్యక్తులు, యష్ భార్య, అతని పెద్ద కుమారుడు (18) గాయపడ్డారు. కాగా, ఉదయం 10.01 గంటలకు అగ్నిప్రమాదం గురించి డిపార్ట్‌మెంట్‌కు కాల్ వచ్చినట్లు ఢిల్లీ ఫైర్ సర్వీస్ వెల్లడించింది. మొదట ఎనిమిది అగ్నిమాపక దళాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి, కానీ మంటల పరిమాణం స్పష్టంగా కనిపించడంతో మరిన్ని శకటాలను మోహరించారు. కొంత దూరం వరకు మంటలు కనిపించగా, పై పై అంతస్తుల నుండి నల్లటి పొగలు వెలువడినట్లు ఘటన స్థలంలో ఉన్న అగ్నిమాపక అధికారి ఒకరు తెలిపారు. ఘటనకు సంబంధించిన వీడియోలు ఆన్‌లైన్‌లో వైరల్ అయ్యాయి. దేవుడు వారిని రక్షించు!' అని పక్కనే ఉన్న భవనం నుండి ఒక మహిళ రికార్డ్ చేసిన వీడియోలో ఒక గొంతు వినిపించింది. భవనం నిర్మాణ స్థిరత్వాన్ని అంచనా వేయడానికి డిడిఎ, ఎంసిడికి సమాచారం అందించినట్లు పోలీస్ అధికారి చెప్పారు.

## కమిషన్ ముందుకు కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి)

సన్నద్ధమైంది.అలాగే తెలంగాణ భవన్, బిఆర్‌కెభవన్ కార్యాలయం సమీపం వరకు బిఆర్‌ఎస్ శ్రేణులను పెద్ద సంఖ్యలో చేరుకోవాలని పిలుపునిచ్చారు. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హైదరాబాద్‌లోని తన నివాసంలో కొందరు ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. విచారణకు కెసిఆర్ హాజరవుతున్న నేపథ్యంలో భారీ జన సమీకరణకు బిఆర్‌ఎస్ సన్నద్ధమైనట్టు సమాచారం.

**కాళేశ్వరం విచారణ ముగిసినట్టేనా..!**'కాళేశ్వరం ప్రాజెక్ట్' విచారణ తుదిదశకు చేరుకుంది. కెసిఆర్ విచారణతో ఇక 'జస్టిస్ పి.సి.ఘోష్ విచారణ' ప్రక్రియ కూడా మొత్తం ముగిసినట్టే. దీంతో ఇక కాళేశ్వరం కమిషన్ విచారణకు సంబంధించి సమగ్ర నివేదిక రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించే అవకాశాలు ఉన్నాయి. ఈనివేదికలో ప్రాజెక్ట్ నిర్మాణ అనుమతుల నుంచి నిర్మాణ పనులు, పిల్లర్ కృంగిపోవడం వరకు అన్ని అంశాలను క్రోడీకరిస్తూ పలు సిఫార్సులు కూడా చేయనున్నట్టు తెలుస్తోంది.

## బాలుడు కిడ్నాప్ (మొదటి పేజీ తరువాయి)

సమయంలో పరిచయం లేని పక్కన కూర్చున్న ఓ మహిళ వృద్ధురాలితో మాట్లాడుతూ నమ్మించి బాలున్ని తీసుకుంది. ఆమె మాటలను నమ్మిన వృద్ధురాలు బాలుని ఆమె దగ్గర ఉంచి భోజనం తెచ్చుకోవడానికి హోటల్ కి వెళ్లడంతో అదే సమయంలో మహిళ బాలుని ఎత్తుకొని ఆసుపత్రి ప్రహరీ గోడ దూకి పారిపోయిది అక్కడ నుంచిఆటోలో నేరుగా ఆర్టిసి బస్టాండ్‌కు వచ్చి భువనగిరికి వెళ్లే బస్సు ఎక్కి పరారైనట్లు ఆస్పత్రి ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలు ఆధారంగా పోలీసులు గుర్తించారు.

## అమెరికాలో అమానుషం

(మొదటి పేజీ తరువాయి)

అయ్యాయి. కునాల్ జైన్ అనే సామాజిక కార్యకర్త ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ వైరల్ అవుతోంది. ఇలాంటి ఘటనలు తరచుగా జరుగుతున్నాయని.. భారతీయ విద్యార్థులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని జైన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఘటనను చూసినప్పుడు చాలా బాధ కలిగిందని విద్యార్థి తన కలల కోసం అమెరికాకు వచ్చాడు.. అతడిని నేరస్థుడిలా ట్రీట్ చేశారని ఆవేదన కలిగించదన్నారు. దీనిపై భారతీయ నెటిజన్‌లు తీవ్రంగా స్పందించారు. వీసా నిబంధనలు, ప్రయాణికులతో వ్యవహరించే తీరుపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. ఈ ఘటన తర్వాత భారత్‌లోని యుఎస్ ఎంబసి ప్రకటన విద్యార్థుల్లో మరింత భయాందోళన పెంచుతోంది. ఈ ఘటనపై స్పందించిన భారత్‌లోని యుఎస్ ఎంబసీ.. తమ దేశానికి చట్టబద్ధంగా వచ్చే ప్రయాణికులను ఎల్లప్పుడూ స్వాగతిస్తుందని చెబుతూనే అమెరికా చట్టాలను ఉల్లంఘించడం, వీసాలను దుర్వినియోగం, అక్రమంగా చొరబడితే ఇదిగో ఇలా ఉంటుందని హెచ్చరిక స్వరంతో పేర్కొంది. అమెరికా సందర్శించడానికి ఎవరికీ హక్కు లేదు అని కూడా యూఎస్ ఎంబసీ తీవ్రంగా హెచ్చరించింది. భారతీయ విద్యార్థుల పట్ల అమెరికా తీరును సోషల్ మీడియాలో తీవ్ర ఆందోళన వ్యక్తం అయింది. అమెరికా తీరుపట్ల నెటిజన్లు మండిపడుతున్నారు. న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ దీనిపై స్పందిస్తూ.. విద్యార్థిని అమానుషంగా బంధించిన ఘటనపై సామాజిక మాధ్యమాల్లో వైరలవుతున్న వీడియోపై వివరాలను సేకరించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపింది.

## తక్షణం ఆపండి

(మొదటి పేజీ తరువాయి)

విచ్ఛిన్నమైపోయిందని అక్కడ నివసిస్తున్న ఆదివాసీలు దీర్ఘకాలంగా ఫిర్యాదులు చేస్తున్నారు.రాజ్యాంగంలోని ఐదో షెడ్యూలులో పేర్కొన్న ఆదివాసీ ప్రజల హక్కులన్నింటినీ ఒక క్రమపద్ధతిలో ఉల్లంఘిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాలలోని అడవులను, అక్కడ ఉన్న ఖనిజ వనరులన్నీ ఇష్టానుసారంగా కార్పొరేట్ శక్తుల దోపిడీకి గురవుతున్నాయి. ఈ దోపిడీవల్ల పర్యావరణ స్థిరత్వానికీ, స్థానిక ప్రజల జీవనానికీ వినాశకరమైన ఆటంకాలు కలుగుతున్నాయి. ఈ ప్రాంతాలలో ఆదివాసీలపట్ల పూర్తిస్థాయి విద్వేష శత్రుత్వ బెదిరింపు చర్యలకు దారితీసే భద్రతా బలగాల మోహరింపు చర్యలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. చివరకు మరణించిన తర్వాత కూడా వారి మృతదేహాలను కుటుంబాలకు స్వాధీనం చేయకుండా శత్రుత్వవైఖరి అనుసరిస్తున్నారు. దీనివల్ల కుటుంబసభ్యులు కడసారి మృతులకు సగౌరవంగా వీడ్కోలు పలికే హక్కులను కూడా భద్రతాబలగాలు తిరస్కరిస్తున్నాయి. చర్చలకు ఆహ్వానించాలన్న తమ విజ్ఞప్తిని పరిశీలించాలని మావోయిస్టులు పదే పదే ప్రభుత్వాన్ని కోరారు. కానీ దురదృష్టవశాత్తూ, కేంద్ర ప్రభుత్వం, బిజెపి సారథ్యంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా చర్చలద్వారా సమస్యను పరిష్కరించే మార్గాన్ని ఎన్నుకునేందుకు తిరస్కరించాయి. చర్చలకు బదులుగా వారిని హత్యచేసి, పూర్తిగా నిర్మూలించాలనే అమానవీయ విధానాన్ని కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించాయి. మావోయిస్టుల నిర్మూలనకు తుదిగడువును కేంద్ర హోంశాఖామంత్రి పదే పదే ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి కూడా మావోయిస్టులతో చర్చల అవసరం లేదని పదే పదే ఉద్ఘాటించారు. ప్రభుత్వం నిష్కపటంగా వ్యవహరించకుండా, భారతదేశ చట్టాల స్ఫూర్తికి, ప్రజాస్వామ్య పరిపాలనా సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ మనుషుల ప్రాణాలు బలితీసుకోవడాన్ని ఉత్సవం చేసుకుంటున్నది. సమస్యలన్నీ చర్చల ద్వారా పరిష్కరించడానికి సంభాషణలు ప్రారంభించేందుకు చొరవ తీసుకోవాలని కోరుతూ అందుకు వీలుగా కాల్పుల విరమిస్తున్నట్లు మావోయిస్టులు చేసిన ఏకపక్ష ప్రకటనకు ప్రభుత్వం తగినరీతిలో స్పందించాలంటూ విభిన్నమైన ఆలోచనలు, వైఖరులు కలిగి ఉన్నప్పటికీ కూడా అనేక మంది సంబంధిత పౌరులు, రాజకీయ పార్టీలు ప్రభుత్వానికి ఇప్పటికే అనేక విజ్ఞప్తులు చేశాయి. అదే విజ్ఞప్తిని ఇప్పుడు మేం కూడా మీకు ఈ లేఖ ద్వారా పునరుద్ఘాటిస్తున్నాం. చట్టవిరుద్ధమైన హత్యలను,హింసాకాండను తక్షణం నిలిపివేయండి, నిష్పక్షపాతమైన న్యాయ విచారణకు ఉత్తర్వులు జారీ చేయండి'' అని ఐదు వామపక్షాలు ప్రధానమంత్రికి ఉమ్మడి విజ్ఞప్తి చేశాయి.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రానున్న మూడు రోజులూ... భారీ వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. మంగళవారం మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిపిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జనగాం సిద్దిపేట యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వికారాబాద్ మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందన్నారు.

## ప్రశ్నించే కమ్యూనిస్టులపై మోదీ, అమిత్‌షా కక్ష

ఆపరేషన్ కగార్ నియంత పాలనకు పరాకాష్ట : కూనంనేని



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రశ్నించే కమ్యూనిస్టులపై నరేంద్రమోదీ, అమిత్ షాలు కక్ష కట్టి బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు విమర్శించారు. మంగళవారం పాల్వంచ మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామంలో సిపిఐ పాల్వంచ మండల 19 మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా హాజరైన కూనంనేని తొలుత అమరవీరుల స్థూపం వద్ద నివాళ్ళర్పించి మహాసభ ప్రాంగణంలో మహాసభ ప్రారంభ సూచిగా అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాళ్ళ కేశవరావు, పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకుంటే సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. ఘటనపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరం అన్నారు. ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్‌కౌంటర్ చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. దీనిని శాంతి భద్రతల విఘాతం కలిగించే చర్యగా చూడాలన్నారు. 2026 మార్చి 31 నాటికి నక్సలైట్లను అంతమొందించడమే లక్ష్యంగా పెట్టుకుని ఏకపక్ష ఎన్‌కౌంటర్లు చేస్తుందని, తాము శాంతి చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టులు ప్రకటిస్తున్నప్పటికీ పట్టించుకోకుండా ఉద్దేశపూర్వకంగానే ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఇది ప్రజాస్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమని, వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని సుప్రీం కోర్టు న్యాయ విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పేద ప్రజలకు ఎర్రజెండా భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయితీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. విషయ అవగాహన,పరిపక్వత లేని అనర్హతపిటీషన్ వేసి కోర్టు సమయాన్ని వృథా చేశారని, ప్రజాతీర్పును సగౌరవంగా స్వీకరించాలని హితవు పలికారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా మాట్లాడుతూ దోపిడీ, అణిచివేతకు గురవుతున్న ఏజెన్సీ పల్లెల ప్రజల జీవన ప్రమాణాల మార్పుకు నాంది పలికి ఆధునికత వైపు నడిపించింది ఎర్రజెండానే అన్నారు. గుండాల నాగరాజు, నిమ్మల రాంబాబు, కొంగర అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాలవిశ్వనాథంతో పాటు నాయకులు నరాటి ప్రసాద్, వీసంశెట్టి పూర్ణ చంద్రరావు, అడుసుమల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, వీ పద్మజ, ప్రజా సంఘాల నాయకులు చెన్నయ్య, కొండలరావు, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### ఐటిడిఎ పరిధిలో ఉన్న 26 శాఖలను తిరిగి ఐటిడిఎ గొడుగు కిందికి తీసుకొస్తాం : మంత్రి సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్: గతంలో ఐటిడిఎ పరిధిలో ఉన్న 26 శాఖలను తిరిగి ఐటిడిఎ గోడుగు కిందికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. అంబేడ్కర్ ఓవర్‌సిస్ స్కాలర్ షిస్‌లో గిరిజన విద్య సంస్థల్లో చదువుకున్న విద్యార్థులకు 40 నుంచి 50 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. మంత్రి సీతక్క అధ్యక్షతన మాసబ్ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో గిరిజన, ఆదివాసుల ఎంఎల్‌ఎల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రాంచంద్రు నాయక్, ఎంఎల్‌ఎలు పాయం వెంకటేశ్వర్లు, వెడ్మ బొజ్జు పటేల్, కోవ లక్ష్మీ ,అనిల్ జాదవ్, ఆదినారాయణ, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, జిసిసి చైర్మన్ కోట్నాక్ తిరుపతి, గిరిజన కార్యదర్శి శరత్, ఎస్‌టి గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మీ , అదనపు డైరక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, జిసిసి, గిరిజన శాఖకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు. గ్రామసభ అనుమతి లేకుండా గిరిజన గ్రామల్లో, పొలాల్లో అటవీ శాఖ అధికారులు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఎంఎల్‌ఎలు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో రూ.1000 కోట్లతో రాజీవ్ యువ వికాసం, రూ.12600 కోట్లతో ఇందిర సౌరజల గిరి వికా సం, రూ.17168 కోట్లతో ఎస్‌టి ఎస్‌డిఎఫ్ నిధులతో గిరిజనుల విద్య, ఆరోగ్యం, వసతి, ఉపాధి, మౌలిక వసతుల కల్పన వంటి ప్రజా ప్రయోజన పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కు సమావేశం ధన్యవాదాలు తెలిపింది. ఏజెన్సీ ప్రాంత్రాల్లో అటవీ శాఖ అధికారుల నుంచి ఎదురవుతున్న పలు ఇబ్బందులను ఎంఎల్‌ఎలు మంత్రి సీతక్క దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ సభల అనుమతులు లేకుండా, 'పెసా చట్టాలను' ఉల్లంఘిస్తు అటవీ అధికారులు ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'తడోబా టైగ ర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వు' మధ్యలో ఉన్న ప్రాంతాన్ని కొమురం భీం కన్జర్వేషన్ రిజర్వుగా ప్రకటిస్తూ జారీ చేసిన జిఒ నం.49ను ఉప సంహరించుకోవాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్‌నుమంత్రి సీతక్క, ఎంఎల్‌ఎలు శాలువాతో సత్కరించారు. అనంతరం మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉద్యోగాలు స్థానికులకే దక్కెలాగా జిఒ నం.3ను పునరుద్ధరించాలన్న ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఇందిరా సౌరజల గిరి వికాసం ద్వారా గిరిజన రైతుల భూముల్లో సిరులు పండించబోతున్నామన్నారు. వెనుకబడిన ఉట్నూరు, ఏటూరునాగారం ఐడిడిఎల అభివృద్ధి నిమ్మితం రూ.12 కోట్లు ప్రత్యేకంగా కేటాయించామన్నారు. గిరిజన అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రికరిస్తేనే వారి ఆర్థికాభివృద్ధి పుంజుకుంటుందని చెప్పారు. 'పెసా' చట్టం నిబంధనలకు విరుద్ధంగా అటవీ శాఖ తీసుకొచ్చిన జిఒ 49ని ఉప సంహరించుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్‌ఎలు కోరుతున్నారని, వారి అభిప్రాయాలను సిఎం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పెండింగ్ బిల్లుల అంశాన్ని సిఎం, డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకెళ్లి బిల్లులు విడుదలయ్యేలా చూస్తామని హామీనిచ్చారు. మన సంస్కృతితోనే మన అస్థిత్వం కపాడబడుతుందని, అందుకే మన సంస్కృతిని, కళలను కపాడుకునేలా చర్యలు తీసుకుంటామని సీతక్క అన్నారు. భద్రాచలం తరహా ఇతర ఐటిడిఎలో గిరిజన మ్యూజియలు, లైబ్రరీలను ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీఏరియాలో ప్రత్యేక జాబ్ మేళాలను ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి మార్గాలు కల్పిస్తామన్నారు. గిరిజన ఎంఎల్‌ఎల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సిఎం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,అందుకు తగిన నిర్ణయాలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క హామీనిచ్చారు. ఇదిలా ఉండ గా అంతకు ముందు సంక్షేమ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్రైబల్ కెఫటేరియాను మంత్రి సీతక్క ప్రారంభించారు. కొమురం భీం పోరాటం, అమరత్వం ఇతివృతంగా రూపొందించిన కొమ రం భీమ్ డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శనను గిరిజన ఆదివాసి ఎంఎల్‌ఎలతో కలిసి మంత్రి సీతక్క గిరిజన ఆడిటోరియంలో వీక్షించారు.

## సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా బెజవాడ వెంకటేశ్వర్లు

### 17మందితో జిల్లా కార్యవర్గం ఎన్నిక



ప్రజాపక్షం/సూర్యాపేట : సిపిఐ జిల్లా కార్యదర్శిగా బెజవాడ వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా మూడోసారి ఎన్నికయ్యారు. ఇతనితో పాటు మరో 17 మంది కార్యవర్గ సభ్యులు, 42మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా యల్లావుల రాములు, దూళిపాళ ధనుంజయ నాయుడు, మేకల శ్రీనివాసరావు, ఉస్తేల నారాయణరెడ్డి, యల్లెంల యాదగిరి, మండవ వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, పోకల వెంకటేశ్వర్లు, బద్దం కృష్ణారెడ్డి, ఎస్‌కె లతీఫ్, దేవరం మల్లేశ్వరి, బత్తినేని హనుమంతరావు, బూర వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు ఎన్నికైన వారిలో ఉన్నారు. అలాగే ప్రత్యేక ఆహ్వానితులుగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా గన్నా చంద్రశేఖర్, ఆహ్వానితులుగా ఎస్‌కె సాయిబెల్లి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శిగా తిరిగి ఎన్నికైన బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన జిల్లా నాయకులకు, కార్యకర్తలకు కృ తజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు.

## ఖమ్మం జిల్లా మతికేపల్లిలో నూతన మార్కెట్ యార్డు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఖమ్మం జిల్లాలో మతికేపల్లిలో నూతన మార్కెట్ యార్డు ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, నేలకొండపల్లి మార్కెట్ యార్డులు విభజించి చింతకాని, ముదిగొండ మండలాలతో మతికేపల్లి మార్కెట్ యార్డును ఏర్పాటు చేయనున్నారు. మార్కెట్ ఏర్పాటుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈప్రాంతంలో మార్కెట్ యార్డు సదుపాయం లేకపోవడంతో మొక్కజొన్న, పత్తి, ఇతర పంటలను రైతులు ప్రైవేట్ దళారులకు అమ్ముకునే వారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. కాని ఇప్పుడు మతికేపల్లి మార్కెట్ యార్డును ఏర్పాటు చేయడం ద్వారా రైతులు తమ పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకునే అవకాశం కలుగుతుందని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే ఖమ్మం, నేలకొండపల్లికి పోయే అవసరం తప్పుతుందని, దూరం తగ్గిపోవడం వలన రైతులు తమ ఉత్పత్తులు అమ్ముకోవడానికి దళారుల వద్దకు వెళ్లడం తగ్గడమే కాకుండా రవాణా ఖర్చులు కూడా ఆదా కానున్నాయన్నారు. ఈ మార్కెట్ యార్డు ఏర్పాటు ద్వారా రైతులు మద్దతు ధరకు అమ్ముకునే వీలు కలగడంతో పాటు, రైతులు మంచి ఆదాయం పొందే అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు. మార్కెట్ యార్డులో రైతులకు కావాల్సిన అన్ని మౌళిక సదుపాయాలను యుద్ధ ప్రతిపాదికన కల్పించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

## బోనాల ఏర్పాట్లకు రూ.20 కోట్లు




### ఆషాడ మాస బోనాల నిర్వహణపై మంత్రుల సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్‌లోని మొత్తం 28 దేవాలయాల్లో ఆషాఢ బోనాల జాతర ఘనంగా జరపాలని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ పని చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. బోనాల నిర్వహణకు బడ్జెట్ లోటు కూడా లేదని, ప్రభుత్వం ఇప్పటికే రూ. 20 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. మరిన్ని నిధులు అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయిస్తామని, ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని వెల్లడించారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ గారే ఇబ్బంది పడ్డారని, ఈసారి అలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా అధికారులు ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని పద్భందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

#### జూన్ 26న తొలి బోనం..

ఇక ఆషాఢ మాస బోనాలు సందర్భంగా అమ్మవారి ఆశీర్వాదం అందరి మీద ఉండాలి. జూన్ 26న తొలి బోనం గోల్కొండలో ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత బల్కంపేట, ఉజ్జయిని మహంకాళీ, లాల్ దర్వాజ బోనాలు ఉంటాయి. రంగం, తొట్టెల ఊరేగింపు కూడా ఉంటుంది. అందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.

#### పండుగలకు ముందు అన్ని చెక్స్ క్లియర్

దేవాలయాలకు ఇచ్చే చెక్స్ రెవెన్యూ ఎండోమెంట్ కోఆర్డినేట్ చేసుకొని పండుగలకు ముందే పూర్తి చేయాలని, అధికారులు ఉద్యోగం లాగ కాకుండా సేవ చేస్తున్నామనే దృక్పథంతో పని చేయాలని మంత్రులు సూచించారు. శాంతి, భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలని, అధికారులు ఎక్కడా లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులు ఆదేశించారు. ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో జరిగిన ఈ ఆషాడమాస బోనాల రివ్యూ మీటింగ్‌లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీల చైర్మ న్లు, సభ్యులతోనూ సమావేశం కొనసాగింది.




## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి :నర్సింహ్మా

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర సమితి సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కె.రవిచంద్రన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని, వర్షాకాలం దృష్టిలో వుంచుకొని పనిము ట్లు, కిట్లు, 15 రోజులు క్యాజువల్ లీవులు తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జూలై 9న జరుగు దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను ఉపసంహరించేంతవరకు పోరా టం కొనసాగించాలన్నారు. ఇప్పటికే 3 నెలలుగా వేతనాలు రాని మున్సిపాల్టీల్లో తక్షణమే కార్మికులకు వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, కార్యనిర్వాహక అధ్యక్షులు పి.వెంకటయ్య, కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, రంగారెడ్డి జిల్లా నాయకులు మద్దిలేటి, మేడ్చెల్ జిల్లా నాయకులు బి.ఐ.శ్రీను, జె.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## బిసి,ఎస్‌సి,ఎస్‌టి,మైనార్టీ విద్యార్థులకు తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల

బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్ : గత 4ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.4వేల కోట్లు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం తక్ష ణమే విడుదలచేసి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ విద్యార్థులను ఆదుకోవాలని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబా ద్‌లోని బిసి హక్కుల సాధన సమితి కార్యాలయంలో బిసి హక్కుల సాధన సమితి నాయకులు పి.కనకయ్య, చిలకరాజు శ్రీనుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ధనంజయ నాయుడు మాట్లాడుతూ మరో రెండు, మూడు రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో పాసైన విద్యార్థులు ఫీజులను చెల్లిస్తే తప్ప ప్రైవేట్ కళాశాలలు సరిఫికెట్లు ఇచ్చే పరిస్థితి లేదని, దీం తో పేద విద్యార్థుల ఉన్నత చదువులకు దూరమైయ్యే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో తక్ష ణ మే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు దాటినప్పటి కీ తెలంగాణ ఏర్పడి 10ఏండ్లు దాటినప్పటికీ ఇప్పటికీ అనేక హాస్టళ్లు అద్దె భవనాలోనే కొనసాగడం సిగ్గుచేటు విషయమన్నారు. ఇప్పటికే అనేక బాలిక హాస్టళ్లలో కనీసమరుగుదొ డ్ల సౌకర్యం లేదని, అనేక ప్రభుత్వ బాలికల పాఠశాలలో 500 మంది విద్యార్థినులకు కేవలం ఒకే ఒక మరుగుదొడ్డి ఉన్న బాధాకరమైన పాఠశాలలు తెలంగాణలో కోకొల్లుగా ఉన్నాయన్నారు. ప్రభు త్వం తక్ష ణమే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మౌళిక సదుపాయాలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. మహాత్మ జ్యోతిరావు పూలే విదేశీ విద్య ఓవర్సీస్ మంజూరు సంఖ్య పెంచాలని, ఇందుకు తగిన న్ని నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు ఫీజు రీయింబర్స్ బకాయిలతో పాటు పదివేల ర్యాంకు నిబంధనలు ఎత్తివేస్తామని, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు, స్కాలర్ షిపులు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి మూడు నెలలకు ఒకసారి చెల్లిస్తామని పెరిగిన ధరల ప్రకారం ప్రతి ఏటా ఉపకారవేతనాలు, మెస్ ఛార్జీలు పెంచుతామని ప్రైవేటు యూనివర్సిటీలలో సామాజిక రిజర్వేషన్లు అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆయన కోరారు.

## సైన్స్ అండ్ టెక్నాలజీ సహా ఎకనామీలో భారత్ అగ్రగామి : కేంద్ర మంత్రి



ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి : సైన్స్ ,టెక్నాలజీతో పాటు ఎకనామిలో భారత్ అగ్రగామి అని కేంద్ర విద్యాశాఖ మంత్రి అన్నారు. ప్రధాన మంత్రి మోదీ ఇచ్చిన వసుధైక కుటుంబకం అనే నినాదంతో అన్ని రంగాల్లో భారతదేశం ముందుకు సాగుతుందని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. కంది ఐఐటి హైదరాబాద్ దేశంలోనే మొదటి సారిగా గ్లోబల్ యంగ్ ఆకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ యువ శాస్త్రవేత్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి 60 దేశాలకు చెందిన యువ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్ నినాదంతో భారత దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీని అభివృద్ధి పరుస్తున్నామన్నారు. భారత దేశం కల్చరల్ పవర్ హౌస్ మాత్రమే కాదని ఎకానమిలో కూడా అగ్రగామిలో నిలిచిందన్నారు. ప్రస్తుతం ఏఐ టెక్నాలజీ అందుబాటులో ఉన్న తరుణంలో అది మానవాళికి ఎంత వరకు పని చేస్తుందని సందేహం కలగడంలో తప్పేమీ లేదన్నారు. అయితే ఓడిస్సాకు చెందిన ఓ యువతి డిజినల్ భోదనలో ఇబ్బంది పడుతుంటే ఏఐతో తమ సొంత భాషలో ఆ భోదన నేర్చుకోవడం గొప్ప విషయమని ఓ సంఘటనను ఆయన గుర్తు చేశారు. టెక్నాలజీని అభివృద్ధి పరచడం కోసం అనుసందాన్ అనే కార్యక్రమం కోసం 500 బిలియన్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఐపీ ఫిలింగ్స్‌లో గ్లోబల్ ర్యాంకిగింగ్లో భారత దేశం ఆరోస్థానంలో నిలవగా ఎకో సిస్టం స్థాపనలో ప్రపంచంలోనే భారత దేశం మూడవ స్థానంలో నిలవడం గర్వకారణం అన్నా రు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్, సైన్స్ ఆకాడమీ ప్రెసిడెంట్ ప్రొఫెస ర్ అశితోష్, శర్మ, ఐఐటి బోర్డు ఆప్ గవర్నర్ బీవీ మోహన్ రెడ్డి డైరెక్టర్ బిఎస్. మూర్తి ఆయా దేశాల సైంటిస్టులు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## దేశ ప్రజల పట్ల కేంద్రం బాధ్యతారాహిత్యం

### తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



ప్రజాపక్షం/షాద్‌నగర్: పాకిస్థాన్‌తో చేసిన యుద్ధంలో భారతదేశం ఏమి కొల్పోయింది.. ఏమి సాధించిందో చెప్పాలిన బాధ్యత దేశ ప్రధాని నరేంద్రమోదీపై ఉందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ అధ్వర్యంలో నిర్వహించిన జై బాపు..బై భీమ్..జై సంవిధాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిసిసి అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహ్మారెడ్డి లు హాజరయ్యారు. మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్ సారథ్యంలో నందిగామలో భారీ గజమాలతో స్వాగతం పలకడంతోపాటు భారీ కాన్వాయ్‌తో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా వెళ్ళి ముఖ్యకూడలిలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించి సభా స్థలికి వెళ్ళారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆమెరికా అధ్యక్షుడు చెప్పిన మాటలకు తలొగ్గి ప్రధాని నరేంద్రమోదీ తొక ముడిచి యుద్ధాన్ని నిలిపివేశారని, దాంతో భారత్ ఏమి సాధించింది..ఏమి కొల్పోయిందో చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఇందిరాగాంధీ హయాంలో పాకిస్థాన్‌కు చెందిన 92వేల మంది సైనికుల ముక్కు నేలకు రాయించిన ఘన చరిత్ర కాంగ్రెస్‌దేనన్నారు. దేశ ప్రజల పట్ల కేంద్రం బాధ్యత రహితంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దేశ సమాగ్రతకు తుట్లు పొడిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. దేశ సంపద గుజరాత్ ఆర్థిక నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తుంటే కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని, పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తుందని మండిపడ్డారు. తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌లు కేంద్ర మంత్రులుగా ఉండి ఏమి సాధించారని, రాష్ట్రానికి ఒక్కపైసా తీసుకురాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న షాద్‌నగర్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అనంతరం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డిసిసి అధ్యక్షుడు, కార్పొరేషన్ చైర్మెన్ చల్లా నర్సింహ్మారెడ్డిలు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, దాన్ని తిప్పికొట్టేందుకు ప్రజలందరు సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. గ్రామ గ్రామాన ప్రజలను చైతన్యం చేసేందుకు జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. రాజ్యాంగం ద్వారానే నేడు సమాజంలో సమాన ఫలాలను అందుకుంటున్నామని, అలాంటి రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా కేంద్ర ప్రభుత్వం యత్నిస్తుందన్నారు. రాజ్యాంగమే లేకపోతే ఎన్నో దుష్పరిణామాలు జరిగేవని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేశారని, వారు చూపించిన మార్గంలోనే నేడు గ్రామాల్లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు కృషి, పట్టుదలతో పని చేయాలిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, ఇన్‌చార్జిలు తారాసింగ్, జైపాల్, మార్కెట్ కమిటి చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు జంగ నర్సింహ్మా, హరినాథ్‌రెడ్డి, వీరేష్, చల్లా శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

NIT No. 01/EE-III(H)/GHMC/2025-26 ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన) తేదీ: 10.06.2025

పని పేరు: మరమ్మతు పనులు, మొత్తం: 01 పని, అంచనా విలువ: రూ.15.00 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: ప్రారంభ తేది: 11.06.2025న సా.04.00గం.లకు, ఆఖరి తేది: 20.06.2025న మ.03.30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-III (హౌసింగ్), జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 9963551524. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telengana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-III (హౌసింగ్), జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 3379-PP/CL/ADVT/1/2025-26, Date: 10-06-2025

దేవాదాయ ధర్మాదాయ శాఖ

**శ్రీ వీరభద్రస్వామి దేవస్థానము, కొత్తకొండ.**

మం|| భీమదేవరపల్లి, జి|| హనుమకొండ - 505471, Email: sriveerabhadraswamydevastanam@gmail.com

లేఖ నెం. SVBST/66/2025, తేది: 09.06.2025

నోటిఫికేషన్ మెమో నెం. ఎఫ్5/1471/2025, ది:04.06.2025

శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్ వారి ఉత్తర్యుల ప్రకారము.

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, శ్రీ వీరభద్రస్వామి దేవస్థానము, భీమదేవరపల్లి మండలం, హనుమకొండ జిల్లాకు దేవాదాయ చట్టము 30/1987 (సవరించబడిన చట్టము 33/2007, తెలంగాణ ఆర్డినెన్స్ నెం. 3/2016 ననుసరించి) సెక్షన్ 15 ఉపసెక్షన్-1కి లోబడి వంశపారంపర్యం కాని ధర్మకర్తల మండలి నియమింపబడును. కావున ఆసక్తి గల అభ్యర్థులు ధర్మకర్తలుగా నియామకం కొరకు వారి ధరఖాస్తులను సెక్షన్ 17నందలి ఉప సెక్షన్ - 3 ననుసరించి నిర్ణీత ప్రొఫార్మా (ఫారము - II)లో ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 20 రోజుల లోపు శ్రీయుత డైరెక్టర్ మరియు అదనపు కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్/శ్రీయుత ఉప కమీషనర్/ శ్రీయుత సహాయ కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, వరంగల్ వారికి పంపవచ్చును.

శైలజా రామయ్యర్, ప్రిన్సిపల్ సెక్రటరీ టు గవర్నమెంట్

సం/- కార్యనిర్వహణాధికారి, శ్రీ వీరభద్రస్వామి దేవస్థానము, గ్రా|| కొత్తకొండ, మం|| భీమదేవరపల్లి, జి|| హనుమకొండ-505471.

DIPR R.O. No. : 3378-PP/CL/ADVT/1/2025-26, Date: 10-06-2025

**పురపాలక సంఘ కార్యాలయం, హాలియా, జిల్లా: నల్లగొండ**

లేఖ సం.యం.ఇ/38/యం.హా/2025, ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ తేది: 10.06.2025

పురపాలక సంఘం, హాలియా - Engaging of JCB, Dozer, Tractor, Man power for various sanitation activities, Supply and delivery of plants for avenue plantation and Supply and delivery of supporting sticks, tree guards and pitting ..etc for avenue plantation, Supply and Fixing of New Street lights accessories (Wires, Clamps, Holders etc..) and Supply and Delivery of New Street lights, under 15th FC / MGF / PP Grants - 2025-26 నిధుల నుండి చేయుటకు అర్హత కలిగిన రిజిస్టర్ కాంట్రాక్టర్స్ నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

| | |
|---|---|
| 1. యస్.ఐ.టి.నెం. | : యం.ఇ/ /యం.హా/2025, తేది: 10.06.2025 |
| 2. పనుల సంఖ్య | : 7 |
| 3. పనుల విలువ | : 35 లక్షలు |
| 4. బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ మొదలు తేది | : తేది: 12.06.2025 ఉదయం గం.11:00 ని.ల నుండి |
| 5. బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ చివరి తేది | : తేది: 19.06.2025.2025 సాయంత్రం గం.03:00ని.ల వరకు |
| 6. టెండర్లు స్వీకరించు చివరి తేది | : తేది: 19.06.2025 సాయంత్రం గం.03:30ని.ల వరకు |
| 7. బిడ్ ఓపెనింగ్ తేది | : తేది: 19.06.2025 సాయంత్రం గం.05:00 ని.లకు |

టెండర్ నోటీస్ వివరములకు వెబ్ సైట్ www.eprocurement.gov.in ద్వారా తెలుసుకోగలరు. మరియు ఇతర వివరములకు కార్యాలయము పని వేళలో ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- మునిసిపల్ కమీషనర్, పురపాలక సంఘం, హాలియా

DIPR R.O. No. : 3348-PP/CL/ADVT/1/2025-26, Date: 10-06-2025

ప్రజాపక్షం
బుధవారం, 11 జూన్

# వృద్ధ భారతీయులకు దిక్కెవరు?

'భారతదేశానికి యువతరమే పెద్ద ఆస్తి. దాన్ని ఉపయోగించుకుని అభివృద్ధిలో దూసుకుపోతాం. ప్రపంచ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా, ప్రపంచ గురువుగా ఎదుగుతాం'– రాజకీయ గణం నుంచి తరచూ ఇటువంటి మాటలు వింటూ ఉంటాం. అయితే ఇటీవల కాలంలో సన్న గొంతుకతోనైనా మరో ఆందోళనకరమైన మాట వింటున్నాం. అదేమంటే మన దేశం జనాభాలో చైనాను మించి ప్రపంచంలో నెం.1 స్థానానికి చేరుకుంది. అది మంచో చెడు వివరణ ఉండదు. కానీ దేశంలో వృద్ధుల జనాభా పెరుగుతోంది. ఆర్థిక అభివృద్ధి నిరాటంకంగా సాగాలంటే యువ జనాభా అవసరం కాబట్టి సంతాన ఉత్పత్తిని పెంచండి అంటున్నారు. నాయకుల ఇష్టాఇష్టాల ప్రకారం జనాభా ఉత్పత్తి తగ్గుదల లేదా పెరుగుదల సాధించడానికి మనుషులేమన్నా యాంత్రికమైన బొమ్మలా? ఉత్తరాది రాష్ట్రాల జనాభా నియంత్రణను పాటించనందున లోక్‌సభలో వారి సీట్లు పెరుగుతాయి, జనాభాను నియంత్రించాలన్న జాతీయ విధానాన్ని విజయవంతంగా అమలు పరచడం దక్షిణాది రాష్ట్రాలు తప్పా– మా సీట్లు తగ్గకూడదు అనే రాజకీయ ఆందోళన ప్రారంభించిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, మరికొందరు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల మద్దతు పొందుతున్నారు. కాగా కుటుంబ నియంత్రణను తమ కుటుంబంలో, సమాజంలో గట్టిగా అమలు చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2024 ఎన్నికల తదుపరి కొత్త బాణీ మొదలుపెట్టారు. 'ముఖ్యంగా పట్టణ కుటుంబాలు ఇద్దరు లేక ఒకరు సంతానంతో సరిపెట్టుకుంటున్నారు. దాంతో సమాజంలో క్రమంగా వృద్ధుల సంఖ్య పెరుగుతూ యువత తగ్గుతోంది. ఇది భవిష్యత్‌కు ప్రమాదం. అందువల్ల ముగ్గురు –నలుగురు పిల్లల్ని కనండి' అంటున్నారు. అంతేనా? ఇద్దరి కన్నా మించి సంతానమున్న తల్లిదండ్రులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని నిషేధిస్తూ చట్టం చేసిన పెద్దమనిషి ఇప్పుడు నిషేధాన్ని ఎత్తివేస్తూ చట్ట సవరణ చేశారు. ఎంత యాంత్రిక ఆలోచన. నయా ఉదార విధానాలు ఛాంపియన్‌గా ప్రైవేటికరణను అభివృద్ధి మార్గంగా ప్రవచిస్తున్న విద్యను, వైద్యాన్ని సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా చేసిన ఈ 'ఆధునిక రాజకీయవేత్త' ఇప్పుడు హితబోధలు చేస్తున్నారు. కుటుంబాలు ఒకరిద్దరు సంతానానికే ఎందుకు పరిమితమవుతున్నారో తెలియని అమాయకుడా? కుటుంబాలు చిన్నవి అవుతున్నాయి. ఆర్థికంగా గౌరవప్రదంగా జీవించే పరిస్థితులు తరిగిపోతున్నాయి. విద్య, వైద్య ఖర్చులు మోయలేని భారమైనాయి. పిల్లలు ఇంటికి వెలుగే గానీ వారి పోషణ తలకు మించిన భారమైంది.

మరోవైపున ఐదారు దశాబ్దాలుగా క్యాంపులు పెట్టి, టార్గెట్లు పెట్టీ ప్రోత్సాహకాలు ఇచ్చి గర్భనిరోధక ఆపరేషన్లు చేబట్టిన ప్రభుత్వాల వైఖరి తోడైంది. దాంతో 'చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం' అని అత్యధిక మెజారిటీ ప్రజలు తమ జీవితానుభవం నుంచి నేర్చుకున్నారు. దాన్ని తిరగగొట్టటం సాధ్యం కాదు. జపాన్ లాంటి బాగా అభివృద్ధి చెందిన దేశమే సంతానోత్పత్తి తరిగిపోయి వృద్ధులు పెరిగి భవిష్యత్తు గూర్చి బాధపడుతోంది. జనాభా నియంత్రణ కోసం చైనా 'ఒకే ఒక్క సంతానం' సూత్రాన్ని దీర్ఘకాలం అమలు చేసి యువత కన్నా వృద్ధులు పెరుగుతున్నారన్న భయంతో కొద్ది సంవత్సరాల క్రితం ఈ నియమం ఎత్తివేసి అధిక సంతానానికి ప్రోత్సాహకాలు ప్రకటించినా సంతానోత్పత్తి రేటు పెరగలేదు.

నిజమే–జనాభాలో యువత (శ్రామిక శక్తి) దామాషా తగ్గుతూ వృద్ధుల సంఖ్య పెరగడం సమాజానికి భారమే. వెనుకటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఛిద్రమైన పరిస్థితుల్లో చిన్న కుటుంబాలకు వృద్ధులు మోయలేని భారమే. వృద్ధులకు పోషణ, వసతి, ఆరోగ్యం వ్యయాలను భరించడం ప్రభుత్వాలకూ భారమే. జీవితమంతా చెమటోడ్చిన జీవులకు గౌరవప్రదమైన చరమఘడియలు ప్రాప్తింపజేయడం కుటుంబంతోపాటు సమాజం, ప్రభుత్వం బాధ్యత. ఎలా, ఏంటి అన్నది సర్వదా చర్చనీయాంశం.

'గివ్ గ్రాంట్ ఇండియా' అనే సంస్థ 'ఇండియాస్ ఏజింగ్ సొసైటీ : ది లాండ్‌స్కేప్ టుడే' పేరుతో ప్రచురించిన నివేదిక ప్రకారం భారతదేశంలో జనాభా పొందిక నిశ్శబ్దంగా, గాఢంగా మార్పు చెందుతున్నది. వృద్ధుల జనాభా (60 ఏళ్లు పైబడిన వారు) ప్రస్తుతం జనాభాలో 10 శాతం. ఈ సంఖ్య 2050 నాటికి దాదాపు 20 శాతానికి అనగా 34.7 కోట్లకు చేరుతుంది. ఆర్థిక అభద్రత, కుటుంబం తోడ్పాటు వ్యవస్థ ఛిద్రం, ఆరోగ్య సంరక్షణ అరకొరగా ఉన్న నేపథ్యంలో ఈ స్థితిని చూడాలని ఆ నివేదిక కోరింది. ఇండియా ఏజింగ్ రిపోర్ట్, 2023 ఈ నివేదికకు ఆధారం. ఆ రిపోర్టును యుఎన్ఎఫ్‌పిఎ ఇండియా, జనాభా శాస్త్రాల అంతర్జాతీయ సంస్థ, నీతి ఆయోగ్ సంయుక్తంగా తయారు చేశాయి.

వృద్ధుల్లో 29 శాతానికే పెన్షన్లు అందుతున్నాయి. వృద్ధుల ఆరోగ్య అవసరాలు తీర్చే విధంగా వైద్య వసతులు లేవు. వృద్ధుల్లో సగం మంది రక్తపోటు, 43శాతం షుగర్, మూడవ వంతుకు పైగా కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. పిఎంజెఎవై వంటి ప్రభుత్వ బీమా పథకాలు సీనియర్ సిటిజనులలో 25 శాతానికే అందుతున్నాయి. భారతదేశంలో 1000 వృద్ధాశ్రమాలు మాత్రమే ఉన్నాయి. జనాభాలో వృద్ధులు ఆంధ్రప్రదేశ్‌లో 19 శాతం, తెలంగాణలో 17.1శాతం. కాబట్టి రానున్న కాలంలో వృద్ధుల సంరక్షణ ఒక బృహత్ సమస్య కానుంది. అందుకని ఇప్పటినుంచి ముందు చూపుతో ప్రణాళికలు, కార్యాచరణ అవసరం.

## పేదరికం తగ్గుదల.. ప్రచారం మాత్రమేనా!?

భారతదేశంలో గత పదకొండేళ్లలో తీవ్ర పేదరికం 27.1 శాతం నుంచి 5.3 శాతానికి తగ్గిందని ప్రపంచ బ్యాంక్ ఒక నివేదికను విడుదల చేసింది. 26.9 కోట్ల మంది అత్యంత పేదిరకం నుంచి బయటకు వచ్చారని పేర్కొంది. 2011–12లో 34.4 కోట్ల మంది తీవ్ర పేదరికంలో ఉండగా, 2022–23 నాటికి ఈ సంఖ్య 7.5 కోట్లు మాత్రమే అని పేర్కొంది. ఇదే విషయాన్ని బిజెపి.. మీడియా, సోషల్ మీడియా లో జోరుగా ప్రచారం చేస్తున్నది. ప్రధాని మోదీ సైతం తన ప్రసంగాల్లో ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెబుతున్నారు. అయితే అసలు పేదరికం నిర్వచనంపైనే అనేక విమర్శలు ఉన్నాయి. పేదరికం తగ్గితే మరి 80 కోట్ల మందికి ఉచిత రేషన్, ఉపాధి హామీ వంటి పనులు ఇంకా ఎందుకు కొనసాగుతున్నాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**రోజుకు రూ.200 లోపే..**

ప్రపంచ బ్యాంక్ డేటాలో అత్యంత పేదరికానికి రోజుకు రూ.2.15 డాలర్లు (2022–23 ధరల ప్రకారం) అంటే రూ.200 లోపు వ్యయం చేసే వారిని పరిగణనలోకి తీసుకున్నది. అంటే నెలకు సుమారు రూ.5200 వ్యయం చేసే శక్తి ఉండడం. ఈ కేటగిరిలో 2011–12లో 16.2 శాతం మంది ఉండగా, ఇది 2.3 శాతానికి తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ రేటు 18.4 నుండి 2.8 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 10.7 నుంచి 1.1 శాతానికి తగ్గింది. దీంతో రూరల్ అర్బన్ పేదరిక వ్యత్యాసం 7.7 నుంచి 1.7 శాతానికి తగ్గింది. లోయర్ మిడిల్ ఇన్‌కమ్ పేదరికం.. అంటే రోజు వ్యయం 3.65 డాలర్లు (సుమారు రూ.300) కంటే తక్కువ నుంచి 37 కోట్ల మందికి పైగా బయటపడ్డారని పేర్కొంది. అంటే నెలకు రూ.8,800 ఖర్చు చేసే శక్తి ఉన్న వారు. అయితే ఇక్కడ పేదరికం నిర్వచనమే తప్పుగా తీసుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రోజుకు అన్ని రకాల ధరలు పెరుగుతుండగా.. పేదరికాన్ని లెక్క వేయడానికి తీసుకునే ప్రామాణికాలే తప్పుగా ఉన్నాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ ప్రకారమే తీసుకున్నా.. 2011–12లో 60.18 శాతం మంది ప్రజలు రోజుకు 3.65 డాలర్లు (రూ.300 వరకు) సంపాదనతో జీవించేవారు. 2022–23 నాటికి ఈ సంఖ్య 28.1 శాతానికి తగ్గింది. అంటే ఆ నివేదిక ప్రకారమే చూసుకున్నా ఇప్పటికీ 35 కోట్ల మందికిపైగా ప్రజలు పేదరికంలో ఉన్నట్టే. పేదరికం తగ్గిందని ఓ వైపు ప్రగల్భాలు పలుకుతూనే.. మరోవైపు 80 కోట్ల మందికి (దేశ జనాభాలో 55 శాతం) ఉచిత రేషన్ పంపిణీ చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. ఒక వేళ పేదరికం తగ్గితే ఇంత మందికి ఉచిత రేషన్ పంపిణీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా 30 శాతం కుటుంబాలు ఉపాధి హామీ పథకం పనులపై ఆధారపడి జీవిస్తున్నాయి.

**గత, ప్రస్తుత శాంపిలింగ్‌లో వ్యత్యాసం..**

2011–12లో చేసిన సర్వేలతో పోల్చుకుంటే 2022–23 చేసిన హౌస్ హోల్డ్ కన్స్యూమర్ ఎక్స్ పెండిచర్ సర్వేలో శాంపిలింగ్ డిజైన్, డేటా సేకరణ, రీకాల్ పీరియడ్‌లలో తీవ్ర వ్యత్యాసమున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మరోవైపు 2017–18 సర్వే డేటాను ప్రభుత్వం 'డేటా క్వాలిటీ' కారణాలతో విడుదల చేయలేదు, ఇది డేటా పారదర్శకతపై సందేహాలను లేవనెత్తుతున్నది. పేదరికాన్ని ఆదాయం ఆధారంగా కాకుండా వినియోగ వ్యయం ఆధారంగా లెక్కించడం ద్వారా ఇది ఇది రోజువారీ కూలీలు, స్వయం ఉపాధి వారి ఆర్థిక అస్థిరతను దాచిపెడుతుందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా వినియోగ ఆధారిత జినీ కోఎఫిషియంట్ (వినియోగ వ్యయంలో ఆర్థిక అసమానతలు) 2011–12లో 28.8 శాతం ఉండగా, ఇది 2022–23కి వచ్చే సరికి 25.5కి తగ్గిందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. అదే సమయంలో ఆదాయ ఆధారిత జినీ కోఎఫిషియంట్ (ఆదాయ అసమానతలు) 2004లో 52 శాతం ఉండగా, 2023లో ఇది 62 శాతానికి పెరిగింది. అంటే ఆదాయ, వ్యయాల్లో పూర్తి వ్యతిరేక దృశ్యం మనకు కనిపిస్తుంది. మరోవైపు 40 శాతానికి పైగా సంపదను దేశంలోని ఒక శాతం జనాభా మాత్రమే కలిగి ఉండగా, 6.4 శాతం సంపదను దిగువన ఉన్న 50 శాతం మంది జనాభా కలిగి ఉన్నారు.

**ఎన్నికల కోసమే 'పేదరికం తగ్గుదల'!**

రానున్న ఏడాది కాలంలో జరిగే ఆరు రాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పేదరికం తగ్గుదల అనే అంశాన్ని ఒక ప్రొపగండాలా బిజెపి ప్రచారం చేస్తున్నట్టు కనిపిస్తున్నది. ముఖ్యంగా బిహార్‌లో వచ్చే నవంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఇక్కడ పేదరికం అనేది ప్రధాన సమస్య. పేదరికం తగ్గించామనే అంశం ద్వారా ఇక్కడ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నది. మరోవైపు 2026 మే నుంచి ఆగస్ట్ మధ్యలో అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడా ఈ అంశాన్ని లేవనెత్తి ప్రజలను తమవైపు తిప్పుకోవాలని భావిస్తున్నట్లు కనిపిస్తున్నది.

– ఫిరోజ్ ఖాన్,
9640466464

# సింధూ నదీజలాల నిలిపివేతతో పాకిస్థాన్‌కు అస్థిత్వ ప్రమాదం?

సంత్ కుమార్ శర్మ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన 2025 ఏప్రిల్ 23న జరిగిన భద్రత వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఎస్) సింధు నదీ జలాల ఒడంబడిక (ఐడబ్ల్యుటి)ని నిలిపివేయాలని నిర్ణయించింది. అయితే ఆ ఒడంబడిక పాఠంలో ఎక్కడా 'అబేయెన్స్' (నిలుపుదల) అనే పదాన్ని ఉపయోగించలేదని ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. అందుకే భారత్ నిర్ణయానికి చట్టపరమైన మద్దతు లేదని పాకిస్తాన్ నాయకులు వాదించడం సరైనదే. అయితే, చట్టపరమైనదా కాదా అనేది పక్కన పెడితే, ఇప్పుడు వారు ఈ నిర్ణయంతో వ్యవహరించాల్సి రావడంతో పాటు దాని పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది.



చాలా మంది పాకిస్తానీయులు ఈ నిర్ణయాన్ని అస్తిత్వపు ముప్పుగా పేర్కొంటున్నారు. ఎందుకంటే వ్యవసాయ సమాజం సాగునీటిపై ఆధారపడటం చాలా ప్రాథమికమైన విషయం. భారతదేశం చేసిన ప్రకటనతో తలెత్తే పర్యవసానాలు పాకిస్తాన్‌ను తీవ్రంగా కలవరపరుస్తున్నాయి. ఎందుకంటే ఇది వారికి ముందెన్నడూ ఎదురుకాని పరిస్థితి. పాకిస్తాన్‌లోని సైనిక శిబిరాలు లేదా ఉగ్రవాద శిబిరాల లక్ష్యాలపై బాంబు దాడులను భారతదేశం అప్పుడే నిలిపివేసింది. కానీ ఐడబ్ల్యుటిపై తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడానికి నిరాకరించింది.

ఈ నిర్ణయం పాకిస్తాన్‌లో చూపిన మొదటి ప్రభావం ఏమిటంటే, ఏప్రిల్ 29న ప్రధాని షెహబాజ్ షరీఫ్ కొత్త సింధు కాలువ పనులన్నింటినీ నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం ద్వారా బిలావల్ జర్దారీ భుట్టో ముందు ఓటమిని అంగీకరించారు. 2025 ఫిబ్రవరి 15న పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్‌తో కలిసి ఈ ప్రాజెక్టును ప్రారంభించిన పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్‌కు ఇది గట్టి దెబ్బ. విజ్ఞానవంతులు, న్యాయవాదులు లేదా రాజకీయ నాయకులు సహా పాకిస్తానీలందరూ ఒడంబడికను ఏకపక్షంగా నిలిపివేయడానికి ఎటువంటి నిబంధన లేదని వాదిస్తున్నారు. ఈ ఆధారంగా, వారందరూ దీనికి సంబంధించి భారతదేశం తీసుకున్న చర్యను చట్టవిరుద్ధమని, చట్టబద్ధత లేనిదని అభివర్ణించారు.

ఒడంబడికలోని 12 ఆర్టికల్స్, ఎనిమిది అనుబంధాలలో దేనిలోనూ దానిని నిలుపుదలలో ఉంచటానికి ఎటువంటి నిబంధన లేదని ఇక్కడ పేర్కొనడం ముఖ్యం. తుది నిబంధనలు అనబడే ఆర్టికల్ XII ప్రకారం, ఒప్పందాన్ని 'ఎప్పటికప్పుడు' సవరించవచ్చు. ఆర్టికల్ XII తుది నిబంధనలు పూర్తిగా ఇక్కడ ఇస్తున్నాను. అందులో ఏమి ఉందంటే : (1) ఈ ఒప్పందానికి పీఠిక, సంబంధిత ఆర్టికల్స్ , ఎ నుండి హెచ్ వరకు అనుబంధాలు ఉన్నాయి. దీనినే 'సింధు జలాల ఒడంబడిక 1960'గా ఉదహరించవచ్చు. (2) ఈ ఒడంబడికను రెండు ప్రభుత్వాలు ఆమోదించాలి. ఆ ఆమోదాలను న్యూఢిల్లీలో ఇచ్చిపుచ్చుకోవాలి. ఆమోదాల మార్పిడి తరువాత ఇది అమలులోకి వస్తుంది. అప్పుడు 1960 ఏప్రిల్ 1నుండి పూర్వ ప్రభావంతో అమలులోకి వస్తుంది. (3) ఈ ఒడంబడిక నిబంధన రెండు ప్రభుత్వాల మధ్య అంగీకారం, ఆమోదం మేరకు ఎప్పటికప్పుడు సవరించవచ్చు. (4) ఈ ఒడంబడికలోని నిబంధనలు, లేదా, పేరా (3) నిబంధనల ప్రకారం సవరించబడిన నిబంధనలు, రెండు ప్రభుత్వాల మధ్య ఆ ప్రయోజనం కోసం కుదుర్చుకున్న, అధికారయుతంగా ఆమోదించబడిన ఒప్పందం ద్వారా రద్దు చేయబడే వరకు అమలులో ఉంటాయి. ఈ ఆర్టికల్ XIIని భారతదేశం 2023 జనవరి 25న మొదటిసారిగా ఉపయోగించింది. భారతదేశం ఆశించిన లేదా కోరుకున్న విధంగా పాకిస్తాన్ స్పందించలేదు. ఈ నిబంధన కింద ఒప్పందాన్ని సవరించడానికి కొత్తగా చర్చలను ప్రారంభించడానికి అది నిరాకరించింది.

అయితే, ఒడంబడికలోని ఆర్టికల్ XIIని పాకిస్తాన్ 'ఏకపక్షంగా' వమ్ము చేస్తోందని చెప్పవచ్చునా? 2024 ఆగస్టు 30న ఆర్టికల్ XII కింద భారతదేశం ఇచ్చిన రెండవ నోటీసుపై కూడా చర్చలను ప్రారంభించడానికి నిరాకరించినందున పాకిస్తాన్ ఇప్పటికే రెండుసార్లు ఆ పని చేసింది. ఈ మధ్యకాలంలో పాకిస్తాన్‌కు మరి కొన్ని నోటీసులు కూడా ఇవ్వబడి ఉండవచ్చు. అయితే చాలా వరకు ప్రజాబాహుళ్యంలో అందుబాటులో లేవు.

ఒడంబడికలోని ఆర్టికల్ XIIకి కట్టుబడి ఉండటానికి నిరాకరించడం దాని సారాంశానికి కట్టుబడి ఉన్నట్లు అవుతుందా? లేదా ఇది ఒడంబడిక స్ఫూర్తికి విరుద్ధమా?

ఐడబ్ల్యుటిపై కరాచీలో ప్రపంచ బ్యాంకు అధికారుల సమక్షంలో 1960సెప్టెంబర్ 19న భారత ప్రధాని పండిట్ జవహరాలాల్ నెహ్రూ, పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ సంతకాలు చేశారు. ఇది దాదాపు 65 సంవత్సరాలు కొనసాగింది. యుద్ధాలు కూడా దీనిని కదిలించలేకపోయాయని పాకిస్తాన్ ఒక కథనాన్ని నిర్మించింది. తప్పుగా అవగాహన చేసుకోబడిన మంచి మనసు గల భారతీయులు కూడా దీనిని సమర్థించారు. రెండు పొరుగు దేశాల మధ్య, తరచుగా తీవ్ర ప్రత్యర్థులు, శత్రువుల మధ్య సహకారానికి ఇది చెదరని తాయెత్తు అని ఆకాశానికి ఎత్తారు. అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని భారత ప్రభుత్వం 2001 డిసెంబర్ 13న లష్కరే తోయిబా (ఎల్ఇటి) ఉగ్రవాదులు పార్లమెంటుపై దాడి చేసిన తర్వాత ఒడంబడికను రద్దు చేసే అవకాశం గురించి మాట్లాడింది. అయితే, ఆ హెచ్చరిక అమలు చేయబడలేదు. దానికి రెండు సంవత్సరాల ముందు కార్గిల్ యుద్ధం సమయంలో చర్చల ఎజెండాలో కూడా ఇది లేదు. దాదాపు 65 సంవత్సరాల తర్వాత, పహల్గామ్ ఉగ్రవాద హత్యల తర్వాత 2025 ఏప్రిల్ 23న ఐడబ్ల్యుటికి యుద్ధాలు చేయలేనిది ప్రధాని మోదీ చేశారు. ఐడబ్ల్యుటిని నిలిపివేయడం మోదీ ప్రభుత్వం పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా ప్రారంభించిన ఐదు ప్రధాన శిక్షలలో మొదటిది. భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సిసిఎస్ నిర్ణయాలను ప్రకటించారు. ప్రతీకారం త్వరితగతిన, తీవ్రంగా శిక్షించే విధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఐడబ్ల్యుటిని నిలిపివేయడం మోదీ మన పశ్చిమ ప్రత్యర్థికి అందించిన నిజమైన నాకౌట్ పంచ్ (ఒక్క దెబ్బకు ప్రత్యర్థిని కుప్పకూల్చడం).

విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించిన మొదటి అడుగు సింధు జలాల ఒడంబడికకు సంబంధించినది. ఆయన ఇలా వివరించారు: ఈ ఉగ్రవాద దాడి తీవ్రతను గుర్తించి, భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ (సిసిఎస్) కింది చర్యలను నిర్ణయించింది. తదుపరి వాక్యం ఇలా ఉంది: పాకిస్తాన్ నమ్మకం కలిగించేలా, వెనక్కి తీసుకోలేని విధంగా సీమాంతర ఉగ్రవాదానికి తన మద్దతును వదులుకునేంత వరకు సింధు జలాల ఒడంబడిక (ఐడబ్ల్యుటి) తక్షణమే నిలుపుదలలో ఉంచబడుతుంది.

ఐడబ్ల్యుటిని తక్షణమే నిలిపివేయడంతో పాకిస్తాన్‌లో ఏదైనా మారుతుందా? అయితే, పాకిస్తాన్ ధైర్యంగా ఉన్నట్లు ముఖం పెట్టినప్పటికీ ఈ ప్రకటన భారీ మానసిక దిగ్భ్రాంతిని కలిగించింది. ఆ దేశ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఐడబ్ల్యుటి పునరుద్ధరించబడని పరిస్థితి గురించి తాము ఆలోచించలేమని స్పష్టంగా పేర్కొన్నారు. కొంతమంది పాకిస్తాన్ రాజకీయ, సైనిక నాయకులు తమ దేశానికి నదీ ప్రవాహాలను నిలిపివేయడం యుద్ధ చర్యగా పరిగణించబడుతుందని అన్నారు. ఈ బెదిరింపు మాటలు లేదా వైఖరులు భారతదేశంలో ఎవరినీ భయపెట్టలేదు. ఢిల్లీలో ఎవరినీ మాటలను తగ్గించుకోవడానికి లేదా ఒడంబడికను నిలిపివేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడానికి అవి ప్రభావితం చేసినట్లు కనిపించడం లేదు. నదీ ప్రవాహాలకు సంబంధించిన అన్ని రకాల సమాచారాన్ని పాకిస్తాన్‌తో పంచుకోవడాన్ని భారతదేశం తక్షణమే నిలిపివేసింది. 280 స్టేషన్ల నుండి వచ్చే ఈ సమాచారం దానికి అత్యంత విలువైనది. ఒడంబడిక నిలుపుదలలో ఉంచిన తరువాత అనేక ఇతర విషయాలు వరుసకడతాయి.

(ఐపిఎ సర్వీస్)

# లాస్ ఏంజిల్స్‌లో సంక్షోభం: మీడియా భిన్న దృక్పథం

లాస్ ఏంజిల్స్, హాలీవుడ్ గ్లామర్‌కు, సాంస్కృతిక శోభకు పేరుగాంచిన మహానగరం. 2025 జూన్‌లో చెలరేగిన అడవి మంటలు, సామాజిక అశాంతి, రాజకీయ ఉద్రిక్తతలతో సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ వ్యాసం లాస్ ఏంజిల్స్‌లోని ప్రస్తుత పరిస్థితిని, దాని కారణాలను, అమెరికాలోనూ, అలాగే ప్రపంచ మీడియా భిన్న దృక్పథాలను విమర్శనాత్మకంగా పరిశీలన చేస్తుంది.

ప్రస్తుతం లాస్ ఏంజిల్స్‌ను వణికిస్తున్న ప్రధాన సమస్య 2025 ప్రారంభంలో సంభవించిన పాలిసేడ్స్, ఈటన్ అడవి మంటలు. ఈ మంటలు 12,000కి పైగా నిర్మాణాలను ధ్వంసం చేసింది. కనీసం 29 మంది ప్రాణాలు పోయాయి. దీర్ఘకాలంగా కొనసాగిన పొడి వాతావరణం, వాతావరణ మార్పులు ఈ మంటలకు ఆజ్యం పోశాయి. జనవరి చివరి వరకు గణనీయమైన వర్షం లేకపోవడం, గాలులతో కూడిన ఎరుపు జెండా హెచ్చరికలు మంటల వ్యాప్తికి దోహదపడ్డాయి. శాస్త్రవేత్తలు దీనిని 'వాతావరణ ఊగిసలాటం'గా అభివర్ణించారు. ఇది వేడెక్కుతున్న వాతావరణంలో తడి నుండి పొడి పరిస్థితులకు వేగంగా మారడం. ఈ విపత్తు బీమా నష్టాలు బిలియన్ల డాలర్లకు చేరవచ్చని అంచనా, కాలిఫోర్నియా ఆస్తి బీమా మార్కెట్‌ను మరింత ఒత్తిడిలోకి నెట్టింది.




ఈ పర్యావరణ విపత్తుతో పాటు, ట్రంప్ రెండో సారి అమెరికా అధ్యక్షుడుగా వచ్చిన తర్వాత ఫెడరల్ ప్రభుత్వ చర్యల వల్ల ఈ ప్రాంతంలో సామాజిక, రాజకీయ అశాంతి తలెత్తింది. 2025 జూన్‌లో, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆధ్వర్యంలో 'నీడలో ఉన్న వలసదారులను' లక్ష్యంగా చేసికొని కఠినమైన వరుస దాడులు జరిగాయి. అందుకు వ్యతిరేకంగా శాంతి యుతంగా నిరసనలు పెరిగాయి. ఈ ఆందోళనాకారులను అణచివేసేందుకు 2,000 నేషనల్ గార్డ్ సైనికులు, 700 మెరైన్స్‌ను లాస్ ఏంజిల్స్‌కు పంపారు. ఈ దాడుల్లో డజన్ల మంది అరెస్టయ్యారు. ఫలితంగా నిరసనలు మరింతగా ఉద్ధృతమయ్యాయి. నిరసనకారులు హైవేలను అడ్డుకున్నారు. ఆటోనమస్ వాహనాలను తగలబెట్టారు. రక్షణ అధికారుల నుండి భాష్పవాయువు, మిరియాల స్ప్రేతో ఎదుర్కొన్నారు. కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ ఈ జాతీయ సైనిక దళాల మోహరింపును 'చట్టవిరుద్ధం, అనైతికం' అని ఖండించారు. ఫెడరల్ ప్రభుత్వంపై దావా వేయనున్నట్లు ప్రతిఘటించారు. ఇది రాష్ట్ర ఫెడరల్ మధ్య విభేదాలను బయటపెట్టింది. ఈ అశాంతి వలస విధానాలు, అసమానత, సంస్థలపై అపనమ్మకం వంటి సమస్యలను ప్రతిబింబిస్తోంది. రాష్ట్ర గవర్నర్ నిర్ణయం లేకుండా ఫెడరల్ సైనిక దళాలు రాష్ట్రంలోకి ప్రవేశించి నేరుగా సైనిక చర్యలు తీసుకోవటం అమెరికా సంయుక్త రాష్ట్రాల హక్కులకు భంగకరం, రాజ్యాంగ ఉల్లంఘనగా భావిస్తున్నారు. ఇది అరుదైన సంఘటన.

**రాజకీయంగా దుమారం..**

వలసదారుల అరెస్టు నేపథ్యంలో అధ్యక్షుడు ట్రంప్, లాస్ ఏంజెల్స్ స్థానిక నాయకత్వం మధ్య ఘర్షణ కూడా కూడా పెరుగుతోంది. శాంతియుతంగా ఆందోళనలు జరుతున్న వారిని అరెస్టు చేయడం, టియర్ గ్యాస్ బుల్లెట్స్ ఉపయోగించించటం, గవర్నర్ అనుమతి లేకుండా ఫెడరల్ రిజర్వ్ సైనిక బలగాలు దించటం... మొదలైన ట్రంప్ వ్యవహారశైలిని తప్పుబడుతున్నట్టు లాస్ ఏంజెల్స్ నగర మేయర్ కరెన్ బాస్ పేర్కొన్నారు. కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ కూడా ట్రంప్ చర్యలను ఖండించారు. ఇది ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే చర్యగా అభివర్ణించారు.

> **ట్రంప్ ఆదేశాలు...**
> మాస్కుల్లో ఉన్న ఆందోళనకారులను అరెస్ట్ చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం జరిగిన ఆందోళనల్లో మాస్క్ వినియోగాన్ని ఆయన నిషేధించారు. గత కొన్నాళ్లుగా ట్రంప్‌ను బద్ధవిరోధిలా ప్రవర్తిస్తున్న మస్క్ తాజాగా లాస్ ఏంజెల్స్ నేషనల్ గార్డులను రంగంలోకి దింపాలనే ట్రంప్ నిర్ణయాన్ని సమర్థించడం విశేషం. గత కొద్ది రోజులుగా ఎలాన్ మస్క్, డోనాల్డ్ ట్రంప్ పరస్పరం దూషించుకున్న వార్తలు దుమారం రేపాయి.

**ఆందోళనా ఉధృతి ఎందుకంటే?**


ఈ ఆందోళనలకు ప్రధాన కారణం ఫెడరల్ రక్షణ దళాలు చేస్తున్న అరెస్టులు. రోజుకు దాదాపు 2వేల మందిని అరెస్టు చేస్తున్నారు. అయితే వారి లక్ష్యం రోజుకు 3వేల మందిని అరెస్టు చేయడమే కారణమని తెలుస్తోంది. ఈ అరెస్టులకు వ్యతిరేకంగా చాలా మంది ప్రజలు మెక్సికన్ జెండాలు పట్టుకొని, నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆందోళన చేస్తున్నారు.

ఈ సంక్షోభం వెనుక కారణాలు బహుముఖం. అడవి మంటలకు దీర్ఘకాల కరవు, భూమి నిర్వహణ లోపాలు, మంటలను అరికట్టడానికి తక్కువ నీటి ఒత్తిడి వంటి సాంఘిక, మానవ కారణాలు ఉన్నాయి. సామాజిక అశాంతికి ఫెడరల్ దురాక్రమణ, ఆదాయాల అసమానత, గృహ సంక్షోభం కారణం. లాస్ ఏంజిల్స్‌లో నిరాశ్రయుల సమస్య, పోలీసింగ్‌పై చర్చలు ఈ అసంతృప్తిని మరింత రాజుకొనేలా చేస్తున్నాయి. మీడియా కవరేజ్‌లో భిన్న దృక్పథాలు కనిపిస్తాయి. లాస్ ఏంజిల్స్ టైమ్స్, ఏబీసీ న్యూస్ మీడియా వంటి సంస్థలు అమెరికా అగ్ని మంటల ప్రభావాల స్థాయి, మానవ నష్టాలను వివరంగా చూపాయి. లాస్ ఏంజిల్స్ టైమ్స్, భద్రత కారణంగా నిర్వాసితులను తిరిగి గ్రామాలకు అనుమతించని విషయాన్ని గుర్తించింది. ఏబీసీ న్యూస్ 'సో–కాల్డ్ స్ట్రాంగ్' (బాధితుల సహాయ) నిధి సేకరణల ఆరోపణలుపై సమాజ స్పందనగా చూపింది. అయినా, 'ది నేషన్' ప్రకారం, కొన్ని కవరేజ్‌లలో వాతావరణ సంక్షోభంతో మంటల సంబంధాన్ని సరిగ్గా చూపలేదు. లాస్ ఏంజిల్స్, టైమ్స్‌లు రాసిన 'ఫాసిల ఇంధన కంపెనీలు మంటలకు బీజం వేశాయి' అనే వ్యాఖ్య గుర్తింపు పొందింది.

అంతర్జాతీయంగా, గార్డియన్, రాయిటర్స్ మీడియా సంస్థలు మంటలు, నిరసనలను కవర్ చేశాయి. గార్డియన్ నేషనల్ గార్డ్ మోహరింపను సర్వాధికార (నియంతృత్వ) ధోరణిగా, రాయిటర్స్ హింసాత్మక ఘర్షణలను వివరించాయి. అయితే, బిలీ క్రిస్టల్, పారిస్ హిల్టన్‌ల గృహ నష్టాలపై సంచలన కవరేజ్ సేవ కార్మికుల, అణగారిన వర్గాల సమస్యలను కప్పిపుచ్చిందని న్యూయార్క్ టైమ్స్ గుర్తించింది. ఎలన్ మస్క్ లాంటి వారి తప్పుడు ప్రచారాలు కూడా గందరగోళం సృష్టించాయని పేర్కొంది. దీనిని బీబీసీ, గార్డియన్ ఖండించాయి.

విమర్శనాత్మక విశ్లేషణలో, కొన్ని మీడియా సంస్థలు లోతైన కవరేజ్ ఇచ్చినా, వాతావరణ నాశనం, సామాజిక అసమానత వంటి మూల కారణాలను తక్కువగా చూపించాయి. సెలబ్రిటీ కష్టాలు, రాజకీయ వివాదాలపై దృష్టి సమస్యల తీవ్రతను తగ్గిస్తోంది. నిరసనలను ధర్మ పోరాటం లేదా గందరగోళంగా చిత్రీకరించడం రాజకీయ విభజనను ప్రతిబింబిస్తోంది.

చివరిగా, 2025 జూన్‌లో లాస్ ఏంజిల్స్ పర్యావరణ విపత్తు, సామాజిక అశాంతితో అల్లాడుతోంది. అమెరికా, అంతర్జాతీయ మీడియా దీని స్థాయిని చూపినప్పటికీ, మూల కారణాలు, అణగారిన గొంతులపై తక్కువ దృష్టి పెడుతున్నాయి. వాతావరణ నరమేధం, సామాజిక న్యాయం, రాజకీయ వేర్పాటును పరిష్కరించే విశ్లేషణాత్మక చర్చ అవసరం, తద్వారా లాస్ ఏంజిల్స్ కష్టాలు కేవలం తాత్కాలిక వార్తలకే పరిమితం కాకుండా నిజమైన మార్పును తీసుకురాగలవు.



– డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.
9849328496



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

**టెక్నాలజీ 'ఇరువైపులా పదునున్న కత్తి' స్వభావమైనా..**

## నిర్ణయం తీసుకునే ప్రక్రియను భర్తీ చేయకూడదు

భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ ఉద్ఘోధ

**న్యూఢిల్లీ:** సాంకేతిక పరిజ్ఞానం రెండువైపులా పదును ఉన్న కత్తి స్వభావం అని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ నొక్కిచెప్పారు. అయినప్పటికీ, ఆ తరహా నవకల్పనలు జ్యుడీషియల్ విధులను మెరుగుపర్చాలే కానీ, నిర్ణయం తీసుకునే ప్రక్రియను భర్తీ చేయకూడదన్నారు. కేంబ్రిడ్జి వర్సిటీలో జూన్ 9న 'న్యాయం అందుబాటులో రావడానికి సాంకేతికత పాత్ర'పై అంతర్జాతీయ సింపోజియాన్ని ఉద్దేశించి బిఆర్.గవాయ్ మాట్లాడుతూ వైవిధ్యమైన దేశంలో న్యాయం, సాంకేతిక పరివర్తనశక్తి ఆవశ్యకత ఎంతమేరకు దానిపై విశదీకరించారు. 'సాంకేతికపరిజ్ఞానం రెండువైపులా పదును ఉన్న కత్తిలా పనిచేస్తుందని, అసమానమైన విభజనలకు దారితీసే అవకాశం ఉంది. డిజిటల్ అంతరం, డిజిటల్ అక్షరాస్యతకు అసమాన ప్రాప్యత ఇప్పటికే న్యాయంకోసం అడ్డంకులను ఎదుర్కొంటున్న అట్టడుగు వర్గాలను మినహాయించడానికి దోహదపడుతోంది. జోక్యాలు లేకుండా న్యాయం అందించే యంత్రాంగంలో ఎలాంటి విప్లవం సాధించలేమన్నారు.



మనవళ్ళతో కలిసి

## వందేభారత్‌లో పయనించిన ఫరూఖ్ అబ్దుల్లా

**న్యూఢిల్లీ :** ఇటీవల కశ్మీర్ నుంచి కాట్రా టౌన్‌షిప్ వరకు సాగే వందే భారత్ రైలులో నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా , తన మనవళ్ళతో కలిసి మంగళవారం ప్రయాణం చేశారు. ఎట్టకేలకు భారతదేశ రైల్వే నెట్‌వర్క్‌తో కశ్మీర్ అనుసంధానమైందని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తన హృదయం సంతోషంతో ఉబ్బితబ్బిబ్బు అయిందని, కళ్ళు నీళ్ళతో నిండిపోయాయని చెప్పారు.దీనిని పూర్తి చేసిన ఇంజనీర్లు, కార్మికులకు అభినందనలు తెలియజేశారు. అమర్‌నాథ్ యాత్రికులకు ఈ రైలు ఉపయోగపడుతుందని, వారు దీనిని ఉపయోగించుకుంటారని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈరైలు కశ్మీర్‌లో ఉద్యానవన రంగానికి ఉపయోపడుతుందని, మార్కెట్‌కు పంటను త్వరగా తీసుకువెళ్ళేందుకు ఉపకరిస్తుందని ఆయన అన్నారు. ఫరూఖ్ అబ్దుల్లాతో పాటు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కుమారులు జమీర్, జహీర్‌లు కూడా వందే భారత్‌లో ప్రయాణం చేశారు.

మరోసారి ఉగ్రదాడి జరిగితే

## భారత్ దీటుగా సమాధానం

పాకిస్థాన్‌ను హెచ్చరించిన విదేశాంగ మంత్రి జైశంకర్..!

**న్యూఢిల్లీ:** దాయాది దేశం పాకిస్తాన్‌ను విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ మరోసారి హెచ్చరించారు. మరోసారి ఉగ్రదాడి జరిగితే భారత్ తిరిగి సమాధానం ఇచ్చేందుకు వెనుకాడదన్నారు. ఆయన బ్రస్సెల్స్‌లో పర్యటిస్తున్న ఆయన.. ఈ సందర్భంగా మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. పాకిస్తాన్‌లో ఉగ్రవాద స్థావరాలు ఉంటే.. తాము పాక్‌లోకి వెళ్లి దాడి చేస్తామని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇంకాముగియలేదని.. పాక్ నుంచి మరో ఉగ్రదాడి జరిగితే.. భారత్ మళ్లీ సైనిక చర్య తీసుకునేందుకు వెనుకాడదన్నారు. 'ఉగ్రవాదం ఈ దేశం (పాక్) జాతీయ విధానంలో భాగం' అన్నారు. భారత్‌లోని జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడి జరిగిందని.. 26 మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆ తర్వాత పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడి చేసిందని.. అయితే, దీనికి స్పందనగా పాకిస్తాన్ భారత్‌పై దాడికి చేసేందుకు ప్రయత్నించిందన్నారు. పాకిస్తాన్‌లోని పలు వైమానిక స్థావరాలపై భారత్ భారీ దాడులు చేసిందని.. ఆ తర్వాత పాకిస్తాన్ దాడులుఆపాలని విజ్ఞప్తిచేసిందని.. దానికి భారత్ అంగీకరించిందన్నారు. భారత్‌కు చెందిన 4 యుద్ధవిమానాలు కూల్చివేసినట్లుగా పాకిస్తాన్ చేసిన వ్యాఖ్యలపై విదేశాంగ మంత్రిని ప్రశ్నించగా.. స్పందించేందుకు ఆయన నిరాకరించారు. దానిపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని.. కానీ, త్వరలోనే సంబంధిత అధికారులు సరైన సమయంలో పూర్తిస్థాయి సమాచారాన్ని అందిస్తారన్నారు. భారత్ చేసిన దాడిలో పాక్ చాలా నష్టపోయిందని.. భారత యుద్ధ విమానాలు, ఇతర ఆయుధాలతో ఖచ్చితత్వంతో దాడి చేసిందని పేర్కొంది. పాక్ వైమానిక స్థావరాలు ధ్వంసమైన ఫొటోలు గూగుల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. పాక్ నిరంతరం ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూనే.. శిక్షణ ఇస్తుందన్నారు. వేలాది మంది ఉగ్రవాదులు దక్షిణ సరిహద్దుల్లో ఉన్నారన్నారు. ఇకపై తాము ఉగ్రవాదాన్ని సహించలేమని.. భవిష్యత్‌లో మళ్లీ ఏప్రిల్ తరహా దాడులు కొనసాగితే ప్రతీకారం తీర్చుకుంటామని.. ఉగ్రవాద సంస్థలు, ఉగ్ర నాయకత్వానికి వ్యతిరేకంగా తమ సందేశం స్పష్టంగా ఉందని జైశంకర్ హెచ్చరించారు.

## ముడా కేసులో రూ.100కోట్ల విలువైన ఆస్తులను అటాచ్‌చేసిన ఇడి

**న్యూఢిల్లీ:** మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) స్థలాల కేటాయింపులో జరిగిన భారీ కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) రూ.100 కోట్ల మార్కెట్ విలువైన 92 ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేసింది. ఇప్పటి వరకు రూ.400కోట్ల విలువైన ఆస్తులు ఈ కేసులో జప్తు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తులు సహకార సంఘాల పేరుతో నమోదయ్యాయని.. ఇప్పటివరకు తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ మార్కెట్ ప్రకారంగా రూ.400 కోట్లుగా ఉంటుందని పేర్కొంది. ప్రస్తుత కర్ణాటక సియం, ఇతరులపై 1860 నాటి ఐపిసి, 1988 నాటి అవినీతి నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల కింద మైసూర్‌లోని లోకాయుక్త పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి దర్యాప్తు చేస్తున్నది. ముడాకి చెందిన 3.2 ఎకరాల భూమి విషయంలో కుంభకోణానికి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, వాస్తవానికి సతీమణి పార్వతికి 2010లో ఆమె సోదరుడు మల్లికార్జునస్వామి కేసరే గ్రామంలోని 3.2 ఎకరాల భూమిని గిఫ్ట్‌గా ఇచ్చారు. ఈ భూమిని ముడా సేకరించింది. ఆ భూమికి పరిహారం ఇవ్వాలని పార్వతి డిమాండ్ చేయడంతో ముడా ఆమెకు దక్షిణ మైసూర్‌లోని విజయానగర్‌లో 14ప్లాట్లను కేటాయించింది. ఈ ప్లాట్ల ధర.. ఆమె ఇచ్చిన భూమి విలువైందని ప్రతిపక్షాలు ఆరోపిస్తు న్నాయి.

# భారతవ్యోమగామి తొలి ఐఎస్ఎస్ యాత్ర నేడే

**న్యూఢిల్లీ :** భారత వ్యోమగామి శుంభాషు శుక్లా సహా నలుగురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) నిర్ణీత ప్రకారం బుధవారం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరతారు. ఫ్లోరిడాలోని నాసాకు చెందిన కెన్నడీ స్పేస్ సెంటర్ నుండి యాక్సియమ్‌-4 కమర్షియల్ మిషన్ ఐఎస్ఎస్‌కు బయలుదేరుతుందని స్పేస్ ఎక్స్ ఉపాధ్యక్షుడు విలియమ్ గెర్స్టెన్మైర్ మంగళవారంనాడు పత్రికా గోష్ఠిలో చెప్పారు. ఈ నౌక గురువారం మధ్యాహ్నం 12.30 గం॥లకు ఐఎస్ఎస్‌తో అనుసంధానం అవుతుంది యాక్సియమ్‌-4 (ఎఎక్స్‌-4) మిషన్‌లో వ్యోమగాములకు నాయకత్వం వహిస్తున్న పెగ్గీ విట్సన్, భారత్ పైలట్ శుక్లా, స్పెషలిస్ట్ టైగర్ కపు (హంగేరీ), స్లావోజ్ ఉజ్నానన్స్కీ విస్నియిస్కీ (పోలండ్)లు ఐఎస్ఎస్‌కు వెళుతున్నారు. 14 రోజులపాటు వారు ఐఎస్ఎస్‌లో ఉండి పరిశోధనలు చేస్తారు.

ఫాల్కన్‌-9 రాకెట్‌ను స్థిరంగా ఉంచి మంటలను బయటకు ఎగజిమ్మే పరీక్షలు నిర్వహిస్తున్నప్పుడు కొన్ని సమస్యలను ఇంజనీర్లు తొలుత గుర్తించారు. రాకెట్‌లో బూస్టర్ల పునరుద్ధరణను గుర్తించలేదు. దీంతో మంగళవారంనాడు జరగాల్సిన ఐఎస్ఎస్ ప్రయాణం ఒకరోజు ఆలస్యంగా బుధవారంనాటికి వాయిదా వేశారు. లాక్స్‌లో లోపం ఉన్న



విషయాన్ని ఇంజనీర్లు గుర్తించారు. ఇంతకుముందు ప్రయోగం చేసిన తర్వాత మళ్ళీ బూస్టర్లను పునరుద్ధరించలేదు. వాటిని పూర్తిగా మరమ్మతు చేయలేదు. ఈ సమస్యను మంగళవారంనాటికి పరిష్కరించారు. అన్నింటినీ సరిదిద్దారు. ఇప్పుడు ఇంజనుకు సంబంధించిన సమస్యలన్నీ మంగళవారం సాయంత్రం నాటికి పూర్తిగా పరిష్కారమయ్యాయి.


కాగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ దీనికిముందుగా సోమవారంనాడు ఒక ప్రకటన చేస్తూ, జూన్ 10 వతేదీకి బదులుగా 11వ తేదీన ఫాల్కన్ రాకెట్ ప్రయోగం వాయిదా వేసినట్లు ఎక్స్ వేదికగా చెప్పారు.

అమెరికా అంతరిక్షదళం 45వ వెదర్ స్క్వాడ్రన్ జిమ్మీ టాగర్ మాట్లాడుతూ, సెంట్రల్ ఫ్లోరిడా ఆగ్నేయ ప్రాంతం ఉపరితలంలో భారీఎత్తున గాలి ఒత్తిడి కొనసాగుతోందని, నైరుతీవైపు ఈ గాలి ప్రసరిస్తోందని చెప్పారు. రాబోయే రెండు రోజుల్లోనూ ఉపరితలంలో ఉన్న విపరీతమైన గాలి ఒత్తిడి తదుపరి ఉత్తరం వైపు కొనసాగుతుందని, ఉదయం పూట ఉరుములతో వర్షం పడుతుందన్నారు. ఐనప్పటికీ కూడా మంగళవారంనాడు మొదటి ప్రయత్నానికి పిఓవి తక్కువగా ఉన్నప్పటికీ, రెండో ప్రయత్నంలో బుధవారం నాడు ఈ పిఓవి ఇరవైశాతానికి పెరుగుతుందన్నారు. రెండు రోజులు గాలులు వేగంగా ఉంటాయని, బుధవారం నాటికి అంతా సాధారణస్థితికి వస్తాయని, గురువారంనాటికి పరిస్థితి మరింత ఉత్తమంగా ఉంటుందని చెప్పారు. ఈనెల 30వ తేదీ వరకూ ఐఎస్ఎస్‌కు ఫాల్కన్ రాకెట్‌ను పంపేందుకు అవకాశాలు ఉన్నాయని నాసా ఇంటర్నేషనల్ స్పేస్ ప్రోగ్రామ్ మేనేజర్ డానా వీగెల్ చెప్పారు. మా వాహనాలు సిద్ధంగా ఉన్నాయనీ, వాతావరణంకోసం తాము ఎదురుచూస్తున్నామనీ వీగెల్ చెప్పారు.

# ప్రజలకు భద్రతకల్పించడంలో కేంద్రసర్కార్ విఫలం

మోదీ ప్రభుత్వం గద్దె దిగాల్సిందే: మమతా బెనర్జీ

**కోల్‌కతా:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి సంబంధించి కేంద్రం ప్రభుత్వంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు భద్రత కల్పించడంలో విఫలమైనందున గద్దె దిగాలని డిమాండ్ చేశారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె) అంశాన్ని ప్రస్తావిస్తూ, ఇటీవలి సైనిక సంఘర్షణ సమయంలో ఆ భూభాగాన్ని తిరిగి పొందేందుకు భారతదేశానికి సువర్ణావకాశం లభించిందని, కానీ నిర్ణయాత్మకంగా వ్యవహరించడంలో విఫలమైందని బెనర్జీ పేర్కొన్నారు. పిఒకెను నియంత్రించడానికి తమకు అవకాశం లభించిందని, అందుకు బదులుగా ఉగ్రవాదంపై ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన కమిటీలో పాకిస్థాన్‌కు అనుమతి లభించిందని, దీని బట్టి చూస్తే మన విదేశాంగ విధానంలో లోపం ఉందా? అని ఆమె ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా కచ్చితమైన దాడులకు సాయుధ దళాల శౌర్యాన్ని ప్రశంసించే తీర్మానంపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రసంగించారు. అయితే ఈ పదాన్ని తీర్మా



నంలో స్పష్టంగా ప్రస్తావించలేదు. పహల్గామ్ దాడిని కేంద్ర ప్రభుత్వ పూర్తి వైఫల్యం, నిర్లక్ష్యపు ఫలితమని పేర్కొంటూ, 26 మందిని బలిగొన్న ఉగ్రవాద దాడి జరిగిన ప్రదేశంలో భద్రతా దళాలు లేకపోవడాన్ని బెనర్జీ ప్రశ్నించారు. 'ఉగ్రవాద దాడి జరిగిన ప్రదేశంలో భద్రతా దళాలు లేదా పోలీసు సిబ్బంది ఎందుకు లేరు? ఒక్క ఉగ్రవాదిని ఎందుకు పట్టుకోలేదు? అధిక భద్రతా జోన్‌లో అటువంటి దాడి ఎలా జరిగింది? అని బెనర్జీ నిలదీశారు. అంతర్గత భద్రతలో భారీ లోపమే కారణమని ఆమె పేర్కొంటూ దానికి కేంద్రం జవాబుదారీతనంగా ఉండాలని డిమాండ్ చేశారు. తాము ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వమని, దానికి మతం, కులం అంటూ ఏమీ లేవన్నారు. పహల్గామ్ హత్యలకు బాధ్యులకు ఆలస్యం చేయకుండా న్యాయం చేయాలని బెనర్జీ అన్నారు. భారత సైనిక చర్యను ప్రశంసిస్తూ, మన సాయుధ దళాల ధైర్యసాహసాలకు సెల్యూట్ చేస్తాం అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై విమర్శలు చేస్తూ, ఆయన ప్రకటనలలో మాత్రమే బిజీగా ఉన్నారని ఆరోపించారు. పాకిస్థాన్‌కు సంబంధించి భారతదేశ దౌత్య వ్యూహం గురించి కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మన దౌత్యంలో ఏదైనా సమస్య ఉందో లేదో తెలియదు, ఎందుకంటే పాకిస్థాన్ అంతర్జాతీయంగా ఇరుక్కుపోయే బదులు, ఎంఎఫ్ నుండి రుణాలు పొందుతోందన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సాయుధ దళాల శౌర్యాన్ని బిజెపి రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తోందని టిఎంసి అధినేత్రి ఆరోపించారు. గతంలో బిజెపి పుల్వామా దాడిని ఎలా రాజకీయం చేసిందో కూడా బెనర్జీ గుర్తు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు అశాంతిని రెచ్చగొట్టడానికి ఇలాంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా హెచ్చరించారు.

## లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించండి

ప్రధాని మోదీకి కాంగ్రెస్ చీఫ్ ఖర్గే లేఖ



**న్యూఢిల్లీ :** లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాశారు. ఈ పదవిని ఖాళీగా ఉంచడం 'భారతదేశ ప్రజాస్వామ్య రాజకీయాలకు మంచిది కాదన్నారు. రాజ్యాంగంలో రూపొందించబడిన నిబంధనలను కూడా ఉల్లంఘించడమే అవుతుందని కాంగ్రెస్ చీఫ్ పేర్కొన్నారు. లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ ఖాళీకి సంబంధించి ప్రస్తుతం ఉన్న అత్యంత ఆందోళనకరమైన విషయాన్ని మీ దృష్టికి తీసుకురావడానికి లేఖ రాస్తున్నానన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఇద్దరినీ ఎన్నుకోవడం తప్పనిసరి అని, రాజ్యాంగబద్ధంగా స్పీకర్ తర్వాత డిప్యూటీ స్పీకర్ సభకు రెండవ అత్యున్నత ప్రిసైడింగ్ అధికారి అని ఆయన అన్నారు. సాంప్రదాయకంగా, డిప్యూటీ స్పీకర్ కొత్తగా ఏర్పడిన లోక్‌సభ రెండవ లేదా మూడవ సమావేశంలో ఎన్నికవుతారని ఖర్గే అన్నారు. ఈ ఎన్నికకు సంబంధించిన విధానం స్పీకర్ విధానాన్ని ప్రతిబింబిస్తుందని, లోక్‌సభలో విధాన, ప్రవర్తన నియమాలలోని నిబంధన 8(1) ప్రకారం డిప్యూటీ స్పీకర్ ఎన్నిక తేదీని స్పీకర్ నిర్ణయిస్తారనే ఏకైక తేడా ఉందని ఆయన పేర్కొన్నారు. మొదటి నుండి పదహారవ లోక్‌సభ వరకు ప్రతి సభకు డిప్యూటీ స్పీకర్ ఉన్నారని ప్రధానికి రాసిన లేఖలో ఖర్గే పేర్కొన్నారు. సాధారణంగా, ప్రధాన ప్రతిపక్ష పార్టీ సభ్యుల నుండి డిప్యూటీ స్పీకర్‌ను నియమించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమన్నారు. అయితే, స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారిగా ఈ పదవి వరుసగా రెండు లోక్‌సభ పర్యాయాలు ఖాళీగా ఉందని, 17వ లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరగలేదన్నారు. ఈ సందర్భోచిత ఉదాహరణ ప్రస్తుతం జరుగుతున్న 18వ లోక్‌సభలో కూడా కొనసాగుతోందన్నారు. ఇది భారతదేశ ప్రజాస్వామ్య రాజకీయాలకు శుభసూచకం కాదని, రాజ్యాంగంలో రూపొందించబడిన నిబంధనలను కూడా ఉల్లంఘిస్తోందని ంగ్రెస్ చీఫ్ అన్నారు. ఈ విషయాల దృష్ట్యా లోక్‌సభ డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకునే ప్రక్రియను మరింత ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని తాను అభ్యర్థిస్తున్నానన్నారు. జూలై 21 నుండి ప్రారంభమయ్యే పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందు ఖర్గే డిమాండ్ వచ్చింది.

## ఎన్‌సిపి చీలుతుందని ఎప్పుడూ అనుకోలేదు

పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శరద్ పవార్



పుణె : ఇరవై ఆరేళ్ల క్రితం తాను స్థాపించిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీలికను ఎదుర్కొంటుందని తాము ఎప్పుడూ అనుకోలేదని మంగళవారం ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ ఆవేదన వ్యక్తం చేశారు. సవాళ్లను ఎదుర్కొని పార్టీని ముందుకు తీసుకెళ్లినందుకు కార్యకర్తలను అభినందిస్తున్నాన్నారు. 2023లో ఎన్‌సిపి విడిపోయిన విషయం తెలిసిందే. కాగా, పార్టీ 26వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పవార్ మాట్లాడారు. ఎన్‌సిపి కొన్ని సవాళ్లను ఎదుర్కొంది, కానీ నిరుత్సాహపడకుండా పార్టీని ముందుకు తీసుకెళ్లండని కార్యకర్తలకు సూచించారు. పార్టీలో చీలిక వస్తుందని తాను ఎప్పుడూ అనుకోలేదని, కానీ అది జరిగిపోయిందన్నారు. 'ఇతర సిద్ధాంతాలతో కొంతమంది బయటకు వెళ్లారు, దీంతో పార్టీ చీలికకు దారి తీసింది. ఈరోజు దాని గురించి మాట్లాడదలచుకోలేదు. కానీ పార్టీకి విధేయులుగా ఉన్నవారు, అది మా పార్టీ సిద్ధాంతం వల్లనే' అని పవార్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో పరిస్థితి మరోలా ఉంటుందన్నారు. ఎవరో వెళ్లిపోయారని, లేక ఎవరోపార్టీలో చేరారు అని ఆలోచించవద్దు. మనం ఐక్యంగా ఉండి సామాన్య ప్రజలకు అండగా ఉంటే, మనకు ఎటువంటి సమస్యలు ఎదురుకావని పవార్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ కార్యకర్తలు చాలా మంది ప్రజాసేవకు అంకితభావంతో ఉన్నారని, వారే పార్టీకి నిజమైన బలం అని పవార్ అన్నారు. 'అధికారం గురించి చింతించకండి. మనం ఐక్యంగా ఉంటే, అధికారం వెంటాడుతుంది. రాష్ట్రంలో ఆ అవకాశం ఉద్భవించేలా నేను చూసుకుంటా' అని అన్నారు. రెండు మూడు నెలల్లో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్నందున, పార్టీ నాయకత్వం ప్రతి జిల్లాలోని ఎన్‌సిపి (ఎస్‌పి) ప్రతినిధులతో మాట్లాడి స్వతంత్రంగా లేదా కూటమిలో పోటీ చేయాలా వద్దా అని నిర్ణయిస్తుందని పవార్ అన్నారు. రాష్ట్రంలో కొత్త తరం పార్టీ కార్యకర్తలు, నాయకులను సృష్టించడానికి ఎన్‌సిపి (ఎస్‌పి) పనిచేస్తుందని ఆయన అన్నారు. 'యువ నాయకత్వానికి ఎలా అవకాశాలు ఇవ్వాలో ఆలోచించాలి, అందుకు అనుగుణంగా పనిచేయాలన్నారు. రాష్ట్రం లో కొత్తనాయకత్వాన్ని తీసుకురావడం ద్వారా పార్టీచరిత్ర సృష్టిస్తుందన్నారు. శరద్ పవార్ బంధువు అజిత్ పవార్ అప్పటి శివసేన-బిజెపి సంకీర్ణ ప్రభుత్వంలో చేరిన తర్వాత జూలై 2023లో ఎన్‌సిపి విడిపోయింది. పార్టీ పేరు, గడియారం గుర్తును అజిత్ పవార్ వర్గానికి ఇవ్వగా, మాజీ కేంద్ర వ్యవసాయ మంత్రి నేతృత్వంలోని వర్గానికి ఎన్‌సిపి (శరద్‌చంద్ర పవార్) అని నామకరణం చేశారు.

'మోదీరాజ్'లో అసమానతల స్థాయిలు

# 'వలసవాద బ్రిటీష్‌రాజ్'ను దాటిపోయామ్

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ధ్వజం

**న్యూఢిల్లీ :** 'మోదీరాజ్'లో భారతంలో అసమానతల స్థాయిలు 'వలసవాద బ్రిటీష్ రాజ్'ను దాటిపోయాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. కీలక రంగాలలో గుత్తాధిపత్యం పెరిగిపోవడంతో ధరలు పెరిగాయని, పదేళ్ళుగా గ్రామీణ వ్యవసాయ కార్మికుడు మొదలు మధ్యతరగతి వేతన జీవుల వరకు సగటు భారతీయుని వేతనాలు స్తంభించిపోయాయని వెల్లడించారు. ఇటీవల విడుదలైన 'కేప్ జెమిని రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' నివేదికను ఆయన ప్రస్తావిస్తూ ఆమ్ ఆద్మీని పెద్ద ఎత్తున నిరాశపరుస్తూ 2024లో భారతదేశంలో 33వేల మందిగా కొత్త 'ఖాస్ ఆద్మీ' మిలియనీర్లు అవతరించారని పేర్కొన్నారు. అలాగే అత్యధిక నికర విలువ కలిగిన వ్యక్తుల (హెచ్ఎన్‌డబ్ల్యు) సంపద 8.8 శాతం పెరిగిందన్నారు. అంటే మోదీ రాజ్‌లో ఉన్నత వర్గం రికార్డు స్థాయిలో పెరగడమే కాకుండా వారి సంపద కూడాఆశ్చర్యకరమైన స్థాయిలో పెరిగిందని జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. గడిచిన పదకొండేళ్ళలో ఆర్థిక అసమానతలు తీవ్రమవడమే మోదీ ప్రభుత్వ ట్రాక్ రికార్డ్ ఎద్దేవా చేశారు. నెక్ట్స్ జెన్ హెచ్ఎన్‌డబ్ల్యుఇతర దేశాలలో ఆస్తులను పెంచుకునేందుకు ప్రణాళికలు రచించుకుంటున్నారని, భారతదేశంలో సంపద కేంద్రీకృతం చేసకున్న వర్గాలు భారతదేశాన్ని వీడి సంఖ్య మరింత వేగంగా పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చస్తశారు. ఇది భారతదేశం భరించలేని మేథో వలస, దీనికి పెరిగిపోతున్న అసమానతలకు ప్రత్యక్ష ప్రభావమని పేర్కొన్నారు.

**భారతీయుల గౌరవాన్ని కాపాడడంలో మోదీ విఫలం**

భారతీయుల పట్ల క్రూరత్వానికి, దారుణాలకు ఒడిగడుతున్న విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీ తక్షణమే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేసింది. అమెరికాలోని న్యూవార్క్ ఎయిర్‌పోర్ట్ నుంచి భారతీయ విద్యార్థిని వెనక్కి పంపే ముందుకు, సంకెళ్ళు వేసి, నేలపై అదిమిపట్టుకొన్న వీడియో, ఫోటోలు మంగళవారం వెలుగులోకి వచ్చాయి. వాటిని ఎఐసిసి ప్రధాన



కార్యదర్శి జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు. భారతదేశం, భారతీయుల గౌరవాన్ని కాపాడడంలో మోదీ ప్రభుత్వం వరుసగా విఫలమవుతోందని ఆయన ఆరోపించారు. చరిత్రలో మొదటిసారిగా భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణను అమెరిక అధ్యక్షుడు వాషింగ్టన్ డిసిలో ప్రకటించారని, భారత్‌పై ఒత్తిడి తీసుకొచ్చిన ఘనత తనదేనని అమెరికా అధ్యక్షుడు పదే పదే చెప్పుకుంటున్నారని తెలిపారు. కాల్పుల విరమణపై లేదా అమెరికాలో భారతీయులపై జరగుతున్న దురాగతాలపై మాట్లాడేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ధైర్యాన్ని కూడదీసుకోలేకపోతున్నారని విమర్శించారు.



అలహాబాద్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ శేఖర్‌కుమార్ యాదవ్‌ను...

# రక్షించేందుకు ప్రభుత్వం ప్రయత్నం

రాజ్యసభ ఎంపి, ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ ధ్వజం

'అభిశంసన'నోటీస్‌పై ఎందుకు చర్యతీసుకోలేదని రాజ్యసభ ఛైర్మన్ ధన్కర్‌పై విమర్శనాస్త్రాలు

**న్యూఢిల్లీ :** అలహాబాద్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం నోటీస్‌పై ఎందుకు చర్య తీసుకోలేదని మంగళవారం రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్కర్‌ను ప్రశ్నించారు. గత ఏడాది మతపరమైన వ్యాఖ్యలు చేసిన జడ్జిని ప్రభుత్వం రక్షించేందుకు ప్రయత్నిస్తోందని కపిల్ సిబల్ ఆరోపించారు. సీనియర్ న్యాయవాది అయినటువంటి సిబల్ ఈ మొత్తం సంఘటన వివక్షతను సూచిస్తున్నదన్నారు. మరోవైపు రాజ్యసభ సెక్రటేరియట్ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసిందన్నారు. ఎగువసభలో యాదవ్‌పై పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున ఆయనపై అంతర్గత విచారణకు వెళ్లవద్దని కోరిందన్నారు.అయితే జస్టిస్ యశ్వంత్‌వర్మ విషయంలో అలా చేయలేదన్నారు. కొన్ని నివేదికల ప్రకారం వర్మకు వ్యతిరేకంగా అభిశంసన ప్రక్రియలేకుండా సుప్రీంకోర్టు విచారణను ఉదహరించి, ప్రభుత్వం ఆయన్ను తొలగించడానికి ప్రయత్నిస్తే అది ప్రయత్నించడం రాజ్యాంగ విరుద్ధం అవుతుందని కపిల్ సిబల్ అన్నారు. న్యాయ స్వతంత్రతను ప్రమాదంలో పడేస్తున్నందుకు తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటారన్నారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో దేశ రాజధాని ఢిల్లీలో ఉన్నటువంటి వర్మ అధికారిక నివాసంలో మార్చిలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఆయన ఇంటి ఆవరణలో కాలిన నగదు కట్టలను కనుగొనడం జరిగింది. జస్టిస్ యాదవ్ అంశంపై సిబల్ మాట్లాడుతూ అది 'చాలా దురదృష్టకర సంఘటన' అని అన్నారు. రాజ్యాంగ పదవిలో సోపాన క్రమంలో రెండవ స్థానంలో ఉన్నటువంటి వ్యక్తి విషయమై లెక్కలేనన్ని ప్రశ్నలు తలెత్తాయని, ఆరు నెలల కాలంలో రాజ్యాంగ బాధ్యతలు తలెత్తినప్పుడు ఈ ప్రశ్నలు తలెత్తుతాయన్నారు. 2024, డిసెంబరు 13న మేం రాజ్యసభ ఛైర్మన్‌కు 55 మంది ఎంపీలు తమ సంతకాలతో కూడిన అభిశంసన తీర్మానం నోటీస్ ఇచ్చి ఉన్నారని, అయినప్పటికీ ఎలాంటి చర్యా ఇప్పటివరకూ తీసుకోలేకపోవడం బాధాకరం అని కపిల్ సిబల్ ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. రాజ్యాంగ పదవిలో ఉన్నవారిని నేను అడగదలచానని, వారు సంతకాలు చేశారా? లేదా? అని మాత్రమే పరిశీలించడం వారి బాధ్యత అని, అందుకు ఆరు నెలల సమయం పడుతుందా? లేదా, ప్రభుత్వం శేఖర్‌యాదవ్‌ను రక్షించేందుకు ప్రయత్నిస్తుందా అని కపిల్ సిబల్ ప్రశ్నించారు.విశ్వహిందూ పరిషత్ సూచనల మేరకే యాదవ్ హైకోర్ట్ ప్రాంగణంలో ప్రసంగించారని, ఆ తర్వాత సుప్రీం కోర్టు దృష్టికి ఈ అంశం వెళ్లడంతో చర్య తీసుకున్నారని సిబల్ తెలిపారు. యాదవ్‌ను ఢిల్లీలో ప్రశ్నించారు. అలహాబాద్ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి నుంచి ఒక నివేదికను కోరింది. ప్రధాన న్యాయమూర్తి 2025మే 13న ప్రతికూల నివేదిక ఇచ్చారని తాను విన్నానని, ఛైర్మన్ ఈ విషయాన్ని రాజ్యాంగబద్ధంగా పరిశీలించాలని, పార్లమెంట్ దానిపై ముందుకు తీసుకెళ్లవచ్చిన అన్నారని సిబల్ తెలియజేశారు. రాజ్యసభ సెక్రటేరియట్ సిజెఐ చర్య కోరుతూ ఒక లేఖ పంపించిందని , అభిశంసన తీర్మానం నోటీస్ ఉన్నందున ఈ విషయాన్ని పరిశీలిస్తామని, యాదవ్‌పై సుప్రీంకోర్టు అంతర్గత ప్రక్రియను తప్పకుండా నిలిపివేయాలని కపిల్ సిబల్ కోరారు. డిసెంబర్ 13న పలువరు ప్రతిపక్ష పార్టీల సభ్యులు విశ్వహిందూ పరిషత్ ఈవెంట్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు జస్టిస్ యాదవ్‌కు వ్యతిరేకంగా ఎగువ సభలో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అభింశన తీర్మానం నోటీస్‌పై సంతకం చేసిన 55మంది ప్రతిపక్ష ఎంపీలలో కపిల్ సిబల్ సహా జైరాం రమేష్, వివేక్ తన్‌ఖా, దిగ్విజయ్‌సింగ్, జాన్ బ్రిట్టాస్, మనోజ్ కుమార్ ఝా, సాకేత్‌గోఖలే ఉన్నారు. డిసెంబర్ 8న జరిగిన విశ్వహిందూ కార్యక్రమంలో జస్టిస్ యాదవ్ మాట్లాడుతూ ఏకరీతి పౌర నియమావళి (యూనిఫామ్ సివిల్ కోడ్ ) లక్ష్యం సామాజిక సామరస్యాన్ని, లౌకికవాదాన్ని ప్రోత్సహించడమేనని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

## జాతీయ భద్రతా సలహా బోర్డు సభ్యుడిగా సతీశ్‌రెడ్డి

**న్యూఢిల్లీ :** జాతీయ భద్రతా సలహా బోర్డు (ఎన్ఎస్ఎబి) సభ్యుడిగా డీఆర్డీవో మాజీ ఛైర్మన్ సతీశ్‌రెడ్డి నియామకమయ్యారు. రెండు సంవత్సరాల పాటు ఆయన బోర్డు సభ్యుడిగా కొనసాగనున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రా మాజీ చీఫ్ అలోక్‌జోషీ నేతృత్వంలోని జాతీయ సలహా బోర్డును ఏర్పాటు చేసిన విసయం తెలిసిందే. ఈ బోర్డు ప్రధాని నేతృత్వంలోని జాతీయ భద్రతా కౌన్సిల్‌కు పలు సూచనలు చేస్తుంది. జాతీయ భద్రతా సలహా బోర్డును ఇటీవలే పునర్వ్యవస్థీకరించి.. రా మాజీ చీఫ్ అలోక్ జోషి నేతృత్వంలోని బోర్డును ఏర్పాటు చేసింది. ఈ బోర్డులో ఏడుగురు సభ్యుల్లో ఆరుగురిని ఇప్పటికే కేంద్రం నియనించింది. ఇందులో మాజీ వెస్ట్రన్ ఎయిర్ కమాండర్ ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, ఆర్మీ సదరన్ మాజీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఏకేసింగ్, రియర్ అడ్మి రల్ మోంటీ ఖన్నా, విశ్రాంతి ఐపీఎస్ అధికారులు రాజీవ్ రంజన్‌వర్మ, మన్మోహన్ సింగ్, మాజీ విదేశాంగ శాఖ అధికారి బీ వెంకటేశ్‌వర్మను బోర్డు సభ్యులను నియమించింది. తాజాగా రక్షణరంగ నిపుణుడు, డీఆర్డీవో మాజీ ఛైర్మన్ సతీశ్‌రెడ్డికి సైతం చోటు కల్పించింది. ప్రస్తుతం ఆయన ఏపీ ప్రభుత్వ సలహాదారుగా కొనసాగుతున్నారు.



# ఢిల్లీ హైకోర్ట్ ఇచ్చిన ఉత్తర్వులపై 'సుప్రీంకోర్టు స్టే'

ఎన్‌సిఐఎస్ఎంసి, ఇతరులకు 'అపెక్స్ కోర్ట్' నోటీసులు జారీ

**న్యూఢిల్లీ :** భారత వైద్యవ్యవస్థ జాతీయ కమిషన్ (నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ఎన్‌సిఐఎస్ఎంసి)ఛైర్‌పర్సన్ పోస్ట్ నియామకానికి అర్హత లేదంటూ ఆయన్ను తొలగిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై మంగళవారం సుప్రీంకోర్టు 'స్టే' విధించింది. వైద్య జయంత్ యశ్వంత్ దేవ్‌పూజారి దాఖలు చేసిన అప్పీల్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, మన్‌మోహన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఎన్‌సిఐఎస్ఎంసి, ఇతరులకు నోటీసులు జారీచేసింది. దేవ్‌పూజారి ఎన్‌సిఐఎస్ఎంసి ఛైర్మన్‌గా తన నియామకాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీ హైకోర్టు రెండు పిటిషన్లను అనుమతిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేశారు. ఛైర్‌పర్సన్ ఎంపిక, నియామక ప్రక్రియ ప్రారంభమైందని కమిషన్ న్యాయవాది హైకోర్టుకు తెలియజేయగా ఆ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించింది. ఎంపిక ప్రక్రియలో తన పరిశీలనను పరిగణనలోనికి తీసుకోవాలని హైకోర్టు సూచించింది. పూర్వ సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ ప్రసిడెంట్ వేద్ ప్రకాష్ త్యాగి, డాక్టర్ రఘునందన్ శర్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన వారిలో ఉన్నారు. కమిషన్ ఛైర్‌పర్సన్‌గా దేవ్‌పూజారిని నియమిస్తూ 2021 జూన్ 9న సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ ఒక సర్క్యులర్‌ను జారీచేయడంపై పిటిషన్లు దాఖలు చేసిన పిటిషన్‌దారులు భారతీయ వైద్య వ్యవస్థ జాతీయ కమిషన్ చట్టం 2020 (ఎన్‌సిఐఎస్ఎం) యాక్ట్) పేర్కొన్న ప్రకారంగా దేవ్‌పూజారికి తప్పనిసరిగా ఉండాల్సిన పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదని ఆరోపించారు. పుణే విశ్వవిద్యాలయం అతనికి ఇచ్చిన డిగ్రీ తక్కువ అర్హత (మాస్టర్స్ డిగ్రీ) సంపాదించడాన్ని సూచించదని స్పష్టం చేసింది.

## ఇవిఎం, వేర్‌హౌస్‌ను పరిశీలన



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా కలెక్టరేట్‌లో గల ఇవిఎం, వేర్ హౌస్‌ను రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంత రావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం వేర్ హౌస్ సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరి చిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సి ఈ ఓ సూచించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జల కుమారి, డి.టి.సురేష్ బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతి నిధులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మూడు రకాల స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు చర్యలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జిల్లాలో మూడు రకాల స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీవో పీడీ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సెర్ఫ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లా డుతూ కిశోర బాలికలు, 60 ఏండ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల స్వయం సహాయ సంఘాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కొత్తగా 36 పరస్పర సహకార సంఘాల ఏర్పాటు చేశామని వారికి జిల్లాలో మూడు టీంలు శిక్షణ ఇస్తున్నారని అన్నారు. ఈ ఏడాది బ్యాంక్ లింకేజీ రుణాలు సుమారు రూ.1090కోట్లు, డీఆర్డీవో నుంచి రూ.144కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. గత ఏడాది రూ.1200 కోట్లు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇచ్చా మని వాటిలో 68శాతం వసూలు చేశామని, 32శాతం వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పాత రుణాలు చెల్లిస్తే కొత్త రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. పరస్పర సహకార సంఘాల నూతన సభ్యులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రునాలు తీసుకోని సకాలంలో చెల్లించి ఆర్థిక సాధికారత సాధించాలని కోరారు.

## లిక్కర్‌దందాలో నాపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** లిక్కర్ దందాలో తాను డబ్బులు తీసుకున్నట్లుగా వీడియో చిత్రీకరించి అవినీతి అరోపణలు చేస్తున్న దానిలో ఎలాంటి వాస్తవం లేదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మంగళవారం ఆయన లిక్కర్ దందాలో యాజమానులు సిండికేటై తనకు డబ్బులను తన ఇంట్లో ఇస్తున్నట్లు సోషల్ మీడియాలో వీడియో వైరల్ కావడంపై ఆయన స్పందించారు. తనపై అసత్య అరోపణలు చేస్తున్న వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దళితుడైన తనను ఎమ్మెల్యేగా చూసి ఓర్వలేక కొంతమంది కావాలనే కుట్రలు చేస్తున్నారని అన్నారు. తన ఇంటికి వచ్చి టీ తాగిన వీడియోలు కూడా ఉన్నాయన్నారు తనను బ్లాక్ మెయిల్ చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. చట్టపరంగా పోలీసులు విచారణ జరిపి అసలు దోషులు ఎవరో తేల్చాలని అన్నారు. నిత్యం ప్రజల కోసం శ్రమిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నానని అన్నారు. ప్రజాధరణ చూసి ఓర్వలేకే ఇలా తనను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. క్యూన్యూస్ ఛానల్ నిర్వాహకుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బిఆర్‌ఎస్ నేతలు కలిసి తనపై కుట్రలు పన్నుతున్నారని అన్నారు. వారు ఎన్ని కుట్రలు చేసిన చట్ట ప్రకారం ఎదుర్కొంటానని చెప్పారు.

## 'అమ్మ మాట (-)అంగన్‌వాడీ బాట' ర్యాలీ



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పౌష్టికాహార పంపిణీ, పాఠశాల పూర్వ విద్య కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందేందుకు 5 సంవత్సరాలలోపు పిల్లలందరినీ దగ్గర్లోని అంగన్వాడి కేంద్రాలలో నమోదు చేయించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 10 నుండి 17 వరకు నిర్వహిస్తున్న అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని గొల్లగూడ 3 వ అంగన్వాడి కేంద్రం పరిధిలో చిన్న పిల్లలతో నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గర్భిణీస్త్రీలు, బాలింతలు, 6 నెలల నుండి 5 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలు దగ్గర్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు కావాలని, ప్రభుత్వం వీరికోసం ప్రతిష్టాత్మకమైన పథకాలను అమలు చేస్తున్నదని, తొలిమెట్టు ఎలా ఉండాలన్న దానిపై ఏం బోధించాలనే దానిపై అంగన్వాడీ కేంద్రాల ద్వారా నేర్పించడం జరుగుతుందన్నారు.జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సిడిపివో హరిత,స్థానిక ప్రజా ప్రతినిధులు సుభాష్ ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

## భూ నిర్వాసితుల అభ్యున్నతే లక్ష్యం

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పెద్దగట్టుకు చెందిన 10 మంది లబ్ధిదారులకు రూ. 13లక్షలు, అంబా భవాని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కింద భూముల కొల్పొయిన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రూ. 32 లక్షలవిలువ గల నష్ట పరిహారం చెక్కులను 30 మంది లబ్దిదారులకు ఎంఎల్‌ఏ బాలునాయక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం నక్కలగండి ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న వారి పునరావాసం కొరకు చింతపల్లి గ్రామం వద్ద నిర్మించ తలపెట్టిన ఆర్ అండ్ ఆర్ కాలనీ కోసం సేకరించిన భూములకు ఆయా రైతులకు ప్రభుత్వం నుండి రూ. 84 లక్షల విలువ గల నష్టపరిహారం చెక్కులను 9 మంది లబ్దిదారులకు ఎంఎల్‌ఏ అందజేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ నిర్వాసితుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. పెద్దగట్టు, అంభాభవాని, నక్కలగండి ప్రాజెక్టు వంటి అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రానికి ప్రగతి దిశగా ముందడుగు వేయిస్తాయన్నారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎస్ భద్రు, ఈఈ నెహ్రూ, రాములునాయక్, యాదన్‌కుమార్, సత్యనారాయణ, ఎస్‌డిసి యూనిట్1 నీల, డిఎఫ్‌వో రాజశేఖర్, ఆర్డివో రమణారెడ్డి, ఎఫ్‌డివో సంగీత, డిఈలు, ఏఈలు, ఫారెస్ట్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## భూభారతితో భూసమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/కోదాడ(నడిగూడెం):** భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలకి పరిష్కారం లభిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. మంగళవారం నడిగూడెం మండలం రత్నవరం గ్రామంలో జరుగుతున్న రెవిన్యూ సదస్సులో ఆయన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 20వ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రత్నవరం గ్రామంలో నిర్వహించిన సదస్సులో 113 దరఖాస్తులు వచ్చాయని, త్రిపురవరం గ్రామంలో 152 దరఖాస్తులు సమర్పించారని అదనపు కలెక్టర్ తెలిపారు. రత్నవరం గ్రామంలోని రేషన్ దుకాణంను సందర్శించి ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వ అదేశాల ప్రకారం సన్నబియ్యం మూడు నెలలకి సరిపడేవి ఒకేసారి పంపిణీ చేయాలని రేషన్ డీలర్‌ను అదేశించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ, తహసిల్దార్ సరిత, హిమబిందు, సీనియర్ అసిస్టెంట్ కళ్యాణి, ఆర్‌ఐ రాంబాబు, కార్యదర్శి శ్రీను, అంగన్‌వాడీ టీచర్ కమలమ్మ, రేషన్ డీలర్ కిరణ్, అధికారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

ప్రజా పాలనలోనే ఇందిరమ్మ కళ సాకారం

ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

లబ్ధిదారులకు పట్టాల పంపిణీ



**ప్రజాపక్షం/గుండాల :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలోనే ఇందిరమ్మ కళ సాకారం అయిందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై లబ్ధిదారులకు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రతి పేదకు సంక్షేమ, అభివృద్ధి ఫలా లు దక్కుతాయని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన పేదలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ నిరంతరం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరిగౌడ్‌లు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో సిసి రోడ్లు వేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని, లింక్‌రోడ్లను పూర్తిచేయాలని, ఆయా గ్రామాల నుండి మండల కేంద్రానికి రోడ్లను పూర్తి చేయాలని అన్నారు. మండలానికి గురుకుల పాఠశాలలను కేటాయించాలని ఎంఎల్‌ఏను అడగగా మండలానికి గురుకుల పాఠశాల మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. నవాబుపేట రిజర్వాయర్ ద్వారా చెరువులు నింపుతామని, గందమల్ల రిజర్వాయర్‌నుండి సాగునీరు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కృష్ణారెడ్డి, బిక్షం, వేణుగోపాల్‌యాదవ్, విమల వెంకటేశ్వర్లు, కుమార్, స్పెషల్ ఆఫీసర్, తహశీల్దార్, అధికారులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్,ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు.మంగళవారం మండల కేంద్రంలో మొదటి విడతగా మంజూరైన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను,కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణము అధికార సూచన ప్రకారం నిర్మించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమల, మండల ప్రత్యేక అధికారి రాజారాం, తహసిల్దార్ లావణ్య,డిప్యూటీ తహసీల్దార్ సఫీ, ఆర్‌ఐ మల్లికార్జున రావు పాల్గొన్నారు.

## నెల రోజులు గడవకముందే ముగ్గురు ఉపాధ్యాయుల సస్పెన్షన్...

బడికి వెళ్లకుండా జీతాలు...మండల ఉపాధ్యాయుల బాగోతం....ఎఇఒ చందర్‌నాయక్ సస్పెన్షన్



**ప్రజాపక్షం/చందంపేట :** నల్గొండ జిల్లా చందంపేట మండలం ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకుంటూ తల్లిదండ్రులు కూలీ పనులు, వ్యవసాయ పనులు చేసుకుంటూ పిల్లల భవిష్యత్తు ఆలోచన చేస్తూ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపిస్తున్నారు. కానీ చందంపేట మండలంలో ఉపాధ్యాయురాలు పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు చదువు చెప్పకుండా జీతాలు తీసుకుంటున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఏప్రిల్ 22న విచారణ జరిపి వాస్తవాన్ని జిల్లా అధికారులు సోమవారం ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఏడాదిగా పాఠశాలకు వెళ్లకుండా జీతాలు తీసుకుంటుందని, ఆమె జీతంలో హెడ్మాస్టర్ మరియు మండల ఎంఈవో కొంత వాటా తీసుకుంటూ ఆమెకు సహకరించారన్న విషయం బయటకు రావడంతో ఉన్నతాధికారులు మండల ఎంఈవో చందర్‌నాయక్‌ను సస్పెండ్ చేశారు. గత నెలలో విద్యాశాఖ అధికారులు ఇద్దరు హెడ్మాస్టర్లను సస్పెండ్ చేసిన విషయం మరవక ముందు మరల మండల ఎంఈవోను విద్యాధికారులు సస్పెండ్ చేయడం చర్చనీయాంశం అయ్యింది. మండలంలో ఎన్ని గ్రామాలలో ఇలా వాటాల దందా జరుగుతుందో జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికే గ్రామాలలో బడిబాట కార్యక్రమం నేపథ్యంలో ప్రభుత్వం ఇలాంటి ఘటనలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వ ంనుండి జీతాలు తీసుకొని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాల్సిన ఉపాధ్యాయులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహిస్తూ విద్యార్థులు భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఇలాంటి చర్యలు మరల పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలి

కుదాబాక్షిపల్లి గ్రామ రైతులు కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/మర్రిగూడ:** సీలింగ్ భూములకు పట్టాలి ఇవ్వాలని కుదాబాక్షిపల్లి గ్రామ రైతులు కలెక్టర్‌కు వినతి పత్రం అంద.జేశారు. రెవిన్యూ సదస్సులు జరుగుతున్న సందర్భంగా మంగళవారం సదస్సుకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా హాజరై మాట్లాడుతూ ఎవరైనా పెద్ద రైతులు వారి భూములలో కట్టడాలు, వ్యవసాయానికి యోగ్యం కాని భూమి ఉన్నట్లయితే వాటిని రైతులే స్వచ్ఛందంగా నాలా చేసుకోవాలని లేనిచో వారికి భారీగా ఫైన్ వేస్తామని అన్నారు. రేపటినుండి గ్రామ సభలు మండలములో ముగిసిన రానివారు తహసిల్దార్ కార్యాలయములో ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా సాదా బైనామా కోర్టు పరిధిలో ఉన్నందున పరిష్కరించలేమన్నారు. రైతులతో వివిధ సమస్యలపై చర్చించారు. దీనిలో భాగంగా రైతులు అభ్యర్థిస్తూ ముఖ్యంగా గ్రామములో గతంలో ఇచ్చిన సీలింగ్ భూములకు నూతన పాస్ పుస్తకములు ఇవ్వాలని రైతులు కోరినారు. కేబి పల్లిలో, మేటిచ్చిందాపురంలో రైతులు ఇచ్చిన దరఖాస్తులను తాహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో



డిప్యూటీ తాహసిల్దార్ చంద్రశేఖర్ సీనియర్ అసిస్టెంట్ శ్రీను నాయక్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పాండురంగారెడ్డి, జహీరుద్దీన్, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

**ప్రభుత్వ ప్రభుత్వ హాస్పిటల్‌ను ఆకస్మిక తనిఖీ**

మర్రిగూడలో ఉన్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి ఆకస్మిక తనిఖీ చేసి వైద్యులకు సూచనలు ఇచ్చారు. ఆసుపత్రిలో డెలివరీ కేసులను ఇంప్రూవ్ చేయాలని, ఆసుపత్రిలో ఉన్న ఎక్సేరే మిషన్ను త్వరలోనే బాగు చేయిస్తానని అన్నారు. సూపరండేటెంట్ డాక్టర్ కే శంకర్ నాయక్, డాక్టర్ అరుణతార ఉన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు అందించాలని వినతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో హరిజనవాడ దొమ్మరి బజారులో ఉంటున్న అన్నపూరి జయమ్మ అనే పేద మహిళకు ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో తన పేరు రానందున బుధవారం సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన జయమ్మ భర్త చనిపోవడంతో తన భర్త చనిపోవడంతో తన పిల్లలను పోషించకోవడానికి పాత సామాన్లు సేకరించుకుంటూ, కూలీ పనులకు వెళ్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు కావాలని జయమ్మ ఆరు గ్యారెంటీల్లో భాగంగా దరఖాస్తు చేసుకోగా ఆమె రిసీప్ట్ ఇచ్చారని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జయమ్మకు ఇందిరమ్మ ఇల్లు అందించి ఆదుకోవాలని కోరారు.

## 12న భూదాన్ పోచంపల్లికి గవర్నర్ రాక

ఏర్పాట్లను పరిశీలించిన యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఈనెల 12న భూదాన్ పోచంపల్లి పర్యటన సందర్భంగా మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు పోచంపల్లి టూరిజం పార్క్‌ను పరిశీలించారు. గవర్నర్తో 50 మంది చేనేత కార్మికులు ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. క్షేత్రస్థాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు చేనేత పరిశ్రమకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు మెరుగుపడుతున్న జీవన పరిస్థితులు స్వయంగా అడిగి తెలుసుకోనున్నారు. ముఖాముఖి కార్యక్రమం అనంతరం గవర్నర్ రెండు లేదా మూడు చేనేత మగ్గాలు నేస్తున్న కుటుంబాలను సందర్శించి క్షేత్రస్థాయిలో చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియను పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ కు ఘన స్వాగతం పలికేలా అధికారులు అందరూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కొంతమంది చేనేత ముఖ్య నాయకులతో కలిసి ఆయన గవర్నర్ తో ముఖాముఖిలో పాల్గొనే చేనేత కార్మికుల, సందర్శించే మగ్గాల కుటుంబాలను వివరాలను అధికారులకు అందజేయాలని కోరారు.టూరిజం పార్కులోని అన్ని విభాగాలను పరిశీలించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసే ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆదేశించారు. అధికారిక పర్యటన వివరాలు వెల్లడించాల్సి ఉంది.పోచంపల్లి తహసిల్దారు శ్రీనివాస్ రెడ్డి హ్యాండ్లూమ్ ఏడి శ్రీనివాస్ చేనేత కార్మిక సంఘ ముఖ్య నాయకులు ఇతర అధికారులు ఆయన వెంట ఉన్నారు. కాగా దంతూరు గౌస్కొండ గ్రామాలలో జరిగిన రెవెన్యూ సదస్సులలో డిప్యూటీ తహసిల్దారు నాగేశ్వరరావు రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి పాల్గొని భూ యజమానుల నుంచి భూసమస్యల పరిష్కారం చేయాలని దరఖాస్తులను స్వీకరించారు.

# సాధారణ ప్రసవాలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎస్):** ఆత్మకూర్(ఎస్) మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, భూభారతి రెవిన్యూ సదస్సును సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ మంగళవారం అకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని ఓపి రిజిస్టర్, ఏఎన్‌సి రిజిస్టర్ లను పరిశీలించారు. ఈడిడి రిపోర్టు పరిశీలించి వారంలో జరిగే ప్రసవాల వివరాలను ఎఎన్‌ఎం సంధ్యను అడిగి తెలుసుకున్నారు. ప్రసవాలకు దగ్గరలో ఉన్న పెషెంట్లను వారి డెలివరీ ప్లానింగ్ వివరాలను ఎఎన్‌ఎంల దగ్గర ఉంచుకోవాలని, ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. ఆసుపత్రి నందు మందుల స్టాక్ బాక్సులు అడ్డదిడ్డంగా పెట్టడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే వీటిని స్టోర్ రూంకు మార్చాలని డాక్టర్ మౌనికకు అదేశించారు. సాధారణ ప్రసవాలు చేపట్టాలని, అలాగే సిబ్బంది సమయపాలన పాటించాలని అదేశించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం మండలంలోని రైతు వేదికలో జరుగుతున్న భూ భారతి రెవిన్యూ సదస్సును సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన భూ భారతి నూతన రెవిన్యూ చట్టంలో భాగంగా గ్రామ స్థాయిలో రెవిన్యూ సంబంధించిన ఈ భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 20వ వరకు కొనసాగే రెవెన్యూ సదస్సులో రైతులు పాల్గొని తమ భూ సమస్యలను పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ రోజు జరిగిన రెవిన్యూ సదస్సులో 261 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తు అందజేసిన రైతు టీ పద్మ తన కుమారుడికి కలెక్టర్ స్వయంగా చేతుల మీదుగా అందజేశారు. రెవిన్యూ సదస్సుకు వచ్చిన తంగేళ్ల వెంకటరెడ్డి, అబ్బగాని బిక్షంతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి సమస్యలను విన్నారు. ఈ కార్యక్రమంలో తహసిలార్ అమీన్‌సింగ్, ఆర్‌ఐ ప్రదీప్, జూనియర్ అసిస్టెంట్లు అజయ్, సుధాకర్, ఎంపి ఎస్ శంకర్ పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారంలో సత్వర చర్యలు

రాష్ట్ర షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ఎస్సీ, ఎస్టీలపై దాడుల నివారణకు ప్రతి నెల చివర పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసులలో పురోగతి, భూ సమస్యలు ఎస్సీ, ఎస్టీ లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై అణిచివేత, అసమానత్వం, అట్రాసిటీ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో కమిషనర్ నిరంతరం పనిచేస్తోందని చైర్మన్ వెల్లడించారు. జిల్లాలో పెండింగ్‌గా ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అన్ని రకాల పెండింగు కేసులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లాలో కొన్ని ప్రాంతాలలో రెండు గ్లాసల పద్ధతి, కుల వివక్ష ఉన్నందున విచారం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు నివారణకు ప్రతి నెల చివర శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. అందుకు ఎస్ఐలు, తాహసీల్దార్లు సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రత్యేకంగా రాయపురం గ్రామంలో వివక్ష ఎక్కువగా ఉన్నందున ఆర్డీఓ, డీఎస్పీలు చొరవ చూపే గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పూర్తిగా వారికే కేటాయించాలని నిధులు పక్కదారి పడకుండా చూడాలని తెలిపారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ డివిఎంసీ వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం నష్టపరిహారం చెల్లింపులు, రెసిడెన్సియల్ పాఠశాలల వివరాలు వంటి జిల్లా ప్రొఫైల్‌ను కలెక్టర్ వివరించారు. జిల్లాలోని రెసిడెన్సియల్ పాటశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు 85 శాతం ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. కులాంతర వివాహాల క్రింద మొత్తం 59 దరఖాస్తులు అందగా, 6 జంటలకు రూ.15 లక్షల ప్రోత్సాహకాన్ని అందించామని తెలిపారు. నిధులు వచ్చిన వెంటనే మిగతా వారికి ప్రోత్సాహకం అందించడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకం క్రింద ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, కోటా ప్రకారం మంజూరు చేయాలని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు మాట్లాడుతూ సెప్టెంబరు 2023 నుండి ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 62 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కాగా వాటిలో 19 కేసులు విచారణతో ఉన్నాయని, మిగతా కేసులకు చార్జిషీట్ వేసినట్లు తెలిపారు. ఈ కేసుల్లో ఒకటిలో నిందితులకు శిక్ష విధించబడినట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో 32 కేసులకు సంబంధించి రూ.38.75 లక్షల నష్టపరిహారం బాధితులకు చెల్లించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వివిధ సమస్యలపై బాధితుల సమస్యల పరిష్కారం పై వినతిపత్రాలను సేకరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగ్ రావు, కమిటీసభ్యులు కొంకటి లక్ష్మీ నారాయణ, నీలా దేవి, రాంబాబు నాయక్, రేణికుంట్ల ప్రవీణ్, ఆర్డిఓ అలివేలు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రమేష్ బాబు, డిఎస్పీ మొగులయ్య, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

## మోదీకి ఉగ్రవాదులకు తేడా ఏమీలేదు

**సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం**

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మోడీకి ఉగ్రవాదులకు తేడా ఏమీ లేదని ఇద్దరు కూడా మత ఘర్షణలను సృష్టించేవారేనని సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని శ్రీలక్ష్మ ఫంక్షన్‌హాల్లో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ పరిణామాలు,అఖిల భారత మహాసభలపై తమ్మినేని వీరభద్రం పాఠం బోధించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పహాల్గామ్ ఉగ్రదాడి జరుగుతుందని ఇంటిలిజెన్స్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ముందే తెలుసన్నారు. దాడి జరుగుతుందని తెలవడం వలనే నరేంద్ర మోడీ పర్యటనను రద్దు చేసుకోవడం జరిగిందన్నారు. దాడి జరుగుతుంని తెలిసి కూడా పర్యాటకులను ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. దాడి జరిగిన నాలుగు రోజుల తర్వాత ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. పాకిస్తాన్‌తో జరిగిన దాడులలో జరిగిన నష్టాన్ని ప్రజలకు తెలియజేయాలని తమ్మినేని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి,నెమ్మాది వెంకటేశ్వర్లు, పోలిశెట్టి యాదగిరి,నాగారపు పాండు,ములకలపల్లి రాములు,కోట గోపి పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ఇసుక తరలించొద్దు

### ఎస్ఐ రమాకాంత్




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తున్న డ్రైవర్‌తో సహా ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.ఇసుక డ్రైవర్ కంకణాల సుధాకర్‌ను వెంకటాపురం అంబేద్కర్ విగ్రహం వద్ద ఇసుకతో సహా పట్టుకున్నామన్నారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించామని మీడియాతో తెలిపారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై దృష్టి

**ప్రజాపక్షం/రామడుగు:** అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, వాటిని నియంత్రించే పద్దతులను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కల్నల్ ఆఫీసర్ ఏకె జయంతి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజు నాయక్ వివరించారు. గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో మంగళవారం విధ్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్‌సిసి క్యాడెట్ల శిక్షణ శిబిరంలో భాగంగా అగ్నిమాపక శాఖ ఆద్వర్యంలో నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిధిగా మాట్లాడారు.




## ఏ శాఖ కేటాయించినా.. న్యాయం చేస్తా

### మంత్రి లక్ష్మణ్‌కుమార్



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా సిఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాలకు సమ న్యాయం చేసేలా మంత్రివర్గ విస్తరణచేశారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారి హైదరాబాద్ నుండి సొంత నియోజక వర్గం ధర్మపురి వెళ్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కు సిద్దిపేట పొన్నాల వద్ద కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆనంతరం నియోజక వర్గం నేతలు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరుకుల శివప్ప, పిసిసి వీవర్స్ సెల్ చైర్మన్ గూడురి శ్రీనివాస్‌లు సన్మానించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాల ప్రజలకు సోషల్ జస్టిస్‌గా మంత్రివర్గ విస్తరణ జరిగిందన్నారు. అందరి ఆశీర్వాదంతో సామాన్యుడైన తనకు మంత్రి వర్గంలో స్థానం లభించిందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి తనకు ఏ శాఖ కేటాయించిన సమర్థవంతంగా నిర్వహిస్తానని మంత్రి తెలిపారు. తనకు మంత్రి పదవి కేటాయించేందుకు సహకరించిన జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎంపి రాహుల్‌గాంధీ, సోనియగాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



**ప్రజాపక్షం/ముత్తారం :** ఫర్టిలైజర్ షాపుల డీలర్లు నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని ముత్తారం ఎస్సై నరేష్ హెచ్చరించారు.మంగళవారం పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఏవో అనూష తో కలిసి ఆయన తనిఖీ చేశారు. అనుమతి లేని విత్తనాలు అమ్మితే నేరం ఏవో అనుష ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు ఎవరూ విక్రయించినా అలాంటి వారి పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో అనూష హెచ్చరించారు. ముత్తారం మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను ఎస్ఐతో పాటు ఏవో అనూష పరిశీలించారు. ప్రతీ రైతు తాము తీసుకునే పత్తి విత్తనాలకు సంబంధించి తప్పనిసరిగా ఆ షాపునకు సంబంధించి రసీదు పొందాలని సూచించారు.అలాగే పెటిలైజర్ షాపుల్లోని స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్స్, సీడ్స్ ఫర్టిలైజర్ షాపుల వద్ద స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు.

## సాగు పద్ధతులపై అవగాహన ఉండాలి



**ప్రజాపక్షం/కొండపాక:** వానాకాలం సాగుకు రైతులను సమయాతం చేసేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, వికాసి కృషి సంకల్ప అభియాన్ అనే కార్యక్రమాన్ని కుకునూరుపల్లి మండల కేంద్రంలోని మెదిని పూర్ గ్రామ రైతువేదికలో మంగళవారం ఏరువాక కేంద్రం వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నాల ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డా సిహెచ్ పల్లవి, డా ఇ ఉమారాణి, ఐసిఏఆర్ సిఆర్ఐడిఏ సీనియర్ శాస్త్రవేత్త డా పుష్పాంజలి మాట్లాడారు. ముఖ్యంగా యూరియా వాడకాన్ని తగ్గించి రసాయనాలను అవసరం మేరకు వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు. వరి కోయలను కాల్చవదన్నారు. ఏఎంసీ చైర్మన్ కొండపాక విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, కుకునూరుపల్లి మండల వ్యవసాయ అధికారి గోవిందరాజు మాట్లాడారు. శాస్త్రవేత్తలు సూచనలు పాటిస్తూ సాగు ఖర్చు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించాలన్నారు.శాస్త్రవేత్తలు డాక్టర్ యశ్వంత్, డాక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారులు రమ్యశ్రీ, శ్రీహరి, పంచాయతీ సెక్రటరి రవళిక, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆటపాటలతో విద్యాబోధన



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని ఇబ్రహీం నగర్ గ్రామంలో,గల ఒకటవ ,మూడవ అంగన్వాడి సెంటర్లో మంగళవారం సూపర్వైజర్ జ్యోతి ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంపై తల్లులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో టీచర్లు పిల్లలకు ఆట పాటలు కథలతో పాటు విద్య నేర్పిస్తారని వారు తెలిపారు .చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు అలవర్చుకునేలా సంసిద్ధం చేస్తున్నారని ,వర్క్ బుక్స్ గురించి తల్లులకు తెలియజేశారు .కొత్తగా ప్రవేశించే పిల్లలను తల్లులను అంగన్వాడి సెంటర్ కి పిలిచి సెంటర్లో గల వివిధ సదుపాయాల గురించి తల్లులకు తెలియజేయడం జరిగింది.అంగన్వాడి సూపర్వైజర్ జ్యోతి ,టీచర్లు రమాదేవి ,రాధా ,ఆయాలు తల్లులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/మంథని/ ముత్తారం :** పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని బోయిన్ పేట్ 6.వ వార్డులో సీసీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు.బోయిన్‌పేటలోని 6.వ వార్డు లో సీసీ రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పోత రవేని క్రాంతి కుమార్ ఇటీవలే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభించడం పట్ల క్రాంతి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ కోయ శ్రీ శ్రీహర్ష కి,మంథని ఎమ్మార్వో కుమార స్వామి కి,పంచాయితీరాజ్ ఎఈ అనిరుధ్ కి, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌రెడ్డికి, ప్రతినిధులకు, బోయిన్ పేట్ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

### వసతిగృహాల వంట గదుల్లోనూ, పరిసరాల్లోనూ పరిశుభ్రత పాటించాలి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని తయారు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వంట చేసే సిబ్బందికి సూచించారు. జిల్లాలోని అన్ని కెజిబివిలు, బాలికల రెసిడెన్షియల్ హాస్టళ్లలో వంట చేసే 90 మంది సిబ్బందికి రామడుగు మండలం వెదిర గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. సిబ్బంది వంట చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. శిక్షణలో భాగంగా వంట సిబ్బంది తయారు చేసిన భోజనాన్ని రుచి చూశారు. కలెక్టర్ మాట్లాడుతూ వంట సిబ్బంది వ్యక్తిగతంగా పరిశుభ్రత పాటిస్తూ వంటగది పరిసరాలను సైతం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంట చేసేందుకు పరిశుభ్రమైన నీరు వాడాలని, నాణ్యత కూడిన భోజనం తయారు చేయాలన్నారు. డైట్ మెనూలో పేర్కొన్న విధంగా వివిధ రకాల పిండి వంటలు, పలహారం వంటివి రుచికరంగా చేయాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న ప్రకారం వంట చేయాలని సూచించారు. కెజిబివిలలో స్థలం ఉన్నందున వంటకు ఉపయోగకరమైనకరివేపాకు వంటి మొక్కలునాటాలని,స్వీట్‌పొటాట వంటి పాదులు వేయాలని, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి, కెజిబివి ప్రిన్సిపాల్ కవిత, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూంరెడ్డి మరణం బాధాకరం : చాడ



**ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధి:** ఉత్తర తెలంగాణ జిల్లాల పేదలకు వైద్య సేవలందించిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ భూంరెడ్డి మరణం బాధాకరమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని భూంరెడ్డి పార్థివ దేహానికి చాడ వెంకటరెడ్డి నివాళులర్పించారు.డా.భూంరెడ్డి వరంగల్ జిల్లా లో పుట్టి వైద్య విద్యనభ్యసించి కరీంనగర్ ప్రభుత్వ హాస్పిటల్‌లో సర్జన్‌గా వైద్య సేవలు అందించడానికి వచ్చి ఇక్కడే స్థిరపడి పేరుప్రఖ్యాతలు సంపాదించారన్నారు. వైద్యప రంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాల్లో పాలుపంచుకుని వైద్య వృత్తిపై రోగులకు సేవలందించే విదానంపై అందరికీ వివరించే వారన్నారు. వృత్తిపరంగా జాతీయ, రాష్ట్రస్థాయిలో ఎన్నో అవార్డులు అందుకున్నారని, ఐఎంఏను బలోపేతం చేసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పనిచేశారన్నారు. ఆయన 80 ఏళ్ల వయస్సు దాటేంత వరకు వైద్య సేవలందించారని కొనియాడారు. అలాంటి డాక్టర్ మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహానికి నివాళులర్పిన వారి లో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బామండ్లపల్లి యుగేందర్, బూడిద సదాశివ, నాయకులు చెంచల మురళి ఉన్నారు.

# విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పించాలి

### ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఉచిత బస్సు పాస్ ఇవ్వాలని టీజీఆర్టీసీ గోదావరిఖని డిపో మేనేజర్ భూషణంకి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు పై చదువులు చదువుకోడానికి ఒక ప్రాంతం నుండి ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారని, ప్రభుత్వం బస్ ఛార్జీలను పెంచడం వల్ల విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొన్నదని ఆయన అన్నారు.పేద ,బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులతే బస్సులలో ప్రయాణం చేస్తారని, కేజీ టు పీజీ చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఉచిత బస్సు పాస్ ఇవ్వాలని గోదావరిఖని డిపో మేనేజర్‌కి వినతి పత్రం ఇచ్చామన్నారు.విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేంతవరకు, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు మొలుగూరి నితీలేష్, జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు మాతంగి సాగర్, నాయకులు రౌతు అరవింద్ పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** 2025–26 సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్ లో 3వ, 5వ, 8వ తరగతుల్లో ప్రవేశం కొర కు పెద్దపల్లి జిల్లాలోని గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు జూన్ 6 లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ నందు జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు మొత్తము (5) సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు.మూడవ తరగతిలో లంబాడ బాలికలకు ఒకటి, బాలురకు ఒకటి, ఎరుకుల బాలురకు ఒకటి చొప్పున కేటాయించడం జరిగిందని తెలిపారు.ఐదవ తరగతిలో గోండు బాలురకు ఒకటి, 8వ తరగతి లో లంబాడ బాలికలకు ఒకటి చొప్పున కేటాయించడం జరిగిందన్నారు.తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతంలో రెండు లక్షలు, రూరల్ ప్రాంతంలో ఒక లక్షా 50 వేలు ఉండాలని, ధ్రువీకరణ పత్రాలు ఆదాయం, కులం, బర్త్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, దరఖాస్తులను జూన్ 17లోగా సమర్పించాలని సూచించారు.

# కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనీ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ గ్రాండ్‌లో జరిగిన వేములవాడ నియోజకవర్గం సోషల్ మీడియా సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. గత ఎన్నికల్లో వేములవాడ ఎమ్మెల్యేగా గెలవడంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వారియర్స్‌ల పాత్ర అపూర్వమన్నారు. అనాడు పిసిసి అధ్యక్షునిగా రేవంత్‌రెడ్డి బిఆర్ఎస్ ప్రభుత్వంపై , దొరల పాలనకు చరమ గీతం పాడండి అని చెప్పిన సందేశాన్ని గ్రామ గ్రామాన ప్రతి ఒక్కరికీ చెరవేసింది సోషల్ మీడియా వారియర్స్ అని అన్నారు. ప్రభు త్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు సోషల్ మీడియా వారియర్స్ చెరవేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలు తెరిస్తే బిఆర్ఎస్ పార్టీ దుబాయ్ కేంద్రంగా వాట్స్ అప్ యూనివర్సిటీలను తెరిచి ప్రభుత్వం పై ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం పై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పేర్కొన్నారు. కష్టపడ్డవారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. దానికి నిదర్శనమే సోషల్ మీడియా వారియర్స్‌గా ఉన్న వారికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లుగా నియమించారన్నారు. సోషల్ మీడియా వేములవాడనియోజకవర్గ ఇన్చార్జ్ బొజ్జ మల్లేష్, జిల్లా కోకన్వీనర్ కనికరపు రాకేష్, వేములవాడ పట్టణ కన్వీనర్ ఎర్ర శ్రావణ్, వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు న్యాత నవీన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, పలు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అన్ని మండలాల కోఆర్డినేటర్లు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## కార్మికులకు బీమా తప్పనిసరి

**ప్రజాపక్షం/గోదావరిఖని :** ప్రతి కార్మికుడు తప్పనసరిగా బీమా కలిగి ఉండాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), రామగుండం నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ జె.అరుణశ్రీ అన్నారు. మంగళవారం వంద రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఎన్‌టిపిసి కాకతీయ కల్యాణ మండపంలో ఇన్సురెన్స్ మేళా నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై బల్దియా కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రమాదాలలో పారిశుద్ధ్య కార్మికులు, రాక్ పిక్కర్స్, హెల్త్ వర్కర్లు మరణిస్తే వారి కుటుంబానికి కొంత పరిహారం అందేలా ప్రతి కార్మికుడు తప్పనిసరిగా బీమా కలిగి ఉండాలన్నారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతులలో పనిచేస్తున్న వివిధ పారిశుద్ధ్య కార్మికులు, హెల్త్ వర్కర్లు, రాగ్ పిక్కర్లకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనం, ప్రధాన మంత్ర జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలపై అవగాహన కల్పించి వారి నుంచి బీమా సౌకర్యం కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరించారు. కొందరికి అప్పటికప్పుడే ఇన్సూరెన్స్ బాండ్లను పంపిణీ చేశారు. లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, డిప్యూటి కమిషనర్ ఎన్.వెంకటస్వామి, రీజినల్ మేనేజర్ రవీందర్ సింగ్, రామకృష్ణ, ఎస్‌బిఐ మేనేజర్ నవీన్‌కుమార్, వలి ఉన్నారు.

## మట్టి తవ్వకాల ప్రదేశంలో తనిఖీలు



**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో పట్టా భూమిలోని మట్టిని ఇటుక బట్టీ వ్యాపారి ఆదివారం అక్రమంగా టిప్పర్ల ద్వారా మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని ఇష్టా రాజ్యంగా మట్టి దందా అనే ప్రజాపక్షం దిన పత్రిక కథనంపై జిల్లా మైనింగ్ అధికారి క్రాంతి కుమార్ స్పందించారు. సోమవారం మైనింగ్ ఏడి క్రాంతి కుమార్ ముస్తాబాద్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ రఘు పోతుగల్ గ్రామంలో ఇటుక బట్టీలలో మట్టి కుప్పలు పరిశీలించారు. మట్టి తవ్వకాలు ప్రదేశాన్ని తనిఖీ చేశారు. హిటాచి, జెసిబి సీజ్ చేశారు. పలువురిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

## క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేత



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జయశంకర్ మైదానంలో స్విమ్మింగ్‌పూల్‌లో 50మీటర్లు, 100మీ, బటర్ఫ్లై 50మి, 100మీ, బ్యాక్ స్ట్రోక్ 50మీ, 100 మీటర్ల జిల్లా స్థాయి బాల,బాలికల ఎంపికలు విజయవంతంగా నిర్వహించారు. 5 ఏండ్ల నుండి 16 ఎండ్ల వరకు బాలబాలికలు 130మంది క్రీడాకారులు పాల్గొన్నారు.జిల్లా స్థా యి నుండి రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపికైన స్వి మ్మింగ్ క్రీడకారులకు సిద్దిపేట సిటిజన్స్ క్లబ్ సహాకారంతో మెడల్స్ అందచేశారు. సిద్దిపేట జిల్లా స్విమ్మింగ్ పూల్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్లమల్లికార్జున్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా నుండి ఎం పికైన క్రీడకారులు రా ష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభను కనబర్చాలని ఆకాంక్షించారు. స్విమ్మింగ్‌లో క్రీడకారులకు శిక్షణ ఇచ్చిన కోచ్‌లను అభినందించారు. సిటిజన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎంఎస్ రమేశ్ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తమ సంస్థ పూర్తి సహకారం అందిస్తామన్నారు. పేద క్రీడకారులకు తమ సంస్థ పక్షాన చేయుత అందిస్తామన్నారు. తమ క్లబ్ పక్షాన మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తరిస్తామన్నారు.ఆనంతరం క్రీడకారులకు మెడల్స్, మెరిట్ సర్టిఫికేట్లు అందచేశారు. స్విమ్మింగ్ పూల్ యజమాన్య సభ్యులు పోతుల మహేశ్, రాజలింగం, గోపినాథ్,మహేశ్. కొండల్‌రెడ్డి, ప్రవీణ్, సిటిజన్స్ క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, బ్రహ్మం, శ్రీనివాస్ రెడ్డి, కాముని శ్రీకాంత్, బండారుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులు నియంత్రించరా?


### ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ జిల్లాలో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్రశాఖ పిలుపు మేరకు మంగళవారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్ అధ్యక్షతన రౌండ్ టేండ్ సమావేశం జరిగింది. ఈ సంధర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, పిడిఎస్‌యు జార్జి రెడ్డి జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సందేశ్, తెలంగాణ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంట అజయ్ పటేల్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెంచెల నవీన్, టిఆర్ఎస్‌వి నాయకుడు బద్దం ప్రవీణ్ రెడ్డి మాట్లాడారు. జిల్లాలో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రతి విద్యా సంవత్సరం ఫీజులనుఇష్టానుసారంగా పెంచుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి భవిష్యత్తు ఇవ్వడం కోసం ఇంగ్లీష్ మీడియంలో చదివించాలని అనుకున్నప్పటికీ ఈ ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధికంగా ఫీజు ఉండడం వలన వారు నిరాశ చెందాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ప్రవేశపెట్టిన నిబంధనలను ఉల్లంఘించి ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల యాజమాన్యం ప్రవర్తిస్తుందన్నారు. అడ్మిషన్ ఫీజు కళాశాల ఫీజు ఒకేసారి కట్టాలని విధ్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. నీట్ కోచింగ్ పేరుతో విధ్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు అవుతున్నా విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలను పట్టించుకోకపోవడం ఏమిటని మండిపడ్డారు. ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేస్తే ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ప్రైవేట్ విద్యా సంస్థలు ఫీజులను వసూలు చేయడానికి వీలవుతుందని, ఈ చట్టం వలన బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉచితంగా చదువుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ చట్టం వల్ల విద్యార్థుల భవిష్యత్తు మారుతుందని, విద్యావ్యవస్థ సైతం మెరుగుపడుతుందన్నారు. విద్యా హక్కు చట్టం 2009 నిబంధనల ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం పేద విధ్యార్థులకు విద్య అందించాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విధ్యార్థులకు న్యాయం చేయాల న్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు కేశబోయిన రాము, నగర నాయకుడు మచ్చ పవన్, కళ్యాణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం

### అడిషనల్ కలెక్టర్ బిఎస్. లత



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని, భూ సమస్యలు ఉన్న ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత తెలిపారు.మంగళవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గుంజపడుగు గ్రామంలో నిర్వహించిన భూభారతి గ్రామ రెవెన్యూ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో రెవెన్యూ అవగాహన సదస్సులు విజయవంతంగా నిర్వహించామని, ప్రజల నుండి భూ సమస్యల అర్జీలు స్వీకరించామని,ఆయా సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను రెవిన్యూ అధికారులు పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఇదే విధంగా జూన్ 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని, భూ సమస్యలున్న ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులకు హాజరై దరఖాస్తు సమర్పించాలని సూచించారు. రెవెన్యూ సదస్సులో హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను, రైతుల భూసమస్యల దరఖాస్తులను పరిశీలించారు. తహసిల్దార్ వరందన్ , ఆర్ ఐ జీవన్ ,అనూష రెవిన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని వివరాలు తెలిస్తే సమాచారం అందించాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** గుంతకల్లు నుండి బోధన్ వెళ్లే రైలులో ప్రయాణిస్తు గుర్తు తెలియని అనారోగ్యం కారణాలతో ఒకరు మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి మంగళవారం తెలిపారు. స్టేషన్ మేనేజర్ దుర్గాప్రసాద్ ఇచ్చిన సమాచారం ప్రకారం మంగళవారం తెల్లవారు జామున 01.40 గంటలకు ఒక గుర్తు తెలియని ప్రయాణీకులు (50 నుండి 55) రైలు నెం. 57411 గుంతకల్లు నుండి బోధన్ వెళ్ల రైలులో ప్రయాణిస్తూ అనారోగ్య కారణాలతో మృతి చెందాడని మృతుని వద్ద గుర్తించుటకు ఎటువంటి ఆధారాలు దొరకలేదని ఈ విషయమై కేసు నమోదు చేసుకొని శవాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ రూంకు తరలించినట్లు తెలిపారు. మృతుడిని గుర్తించినచో జిల్లా రైల్వే పోలీస్ ఫోన్ నెం. 8712658591 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు 12న ఉద్యోగమేళా

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లాలో నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 12న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బి.మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళాకు ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ వారు ఈ క్రింది ఉద్యోగాల కోసం నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రొబేషనరీ ఆఫీసర్, కస్టమర్ కేర్, ఎగ్జిక్యూటివ్, జూనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, ఇంటర్న్‌షిప్ ట్రేనీ ఉద్యోగాల కోసం ఏదైనా డిగ్రీ, ఎంబిఎ, ఎంకం అర్హతలుండాలని జాబ్ లోకేషన్ నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ, పిట్లం, కామారెడ్డి, బైంసా, భీమ్‌గల్‌లలో కలవని, ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయం, శివాజీనగర్ నిజామాబాద్‌లో 12న ఉద్యోగ మేళా ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం లోగా పాల్గొనాల్సిందిగా తెలిపారు. ఇతర వివరాలకు 9948748428, 9959456793 ఫోన్ ద్వారా సంప్రదించాలని అభ్యర్థులు తమ బయోడేటా, ఆధార్ కార్డు, పదవ తరగతి మెమో, ఫొటో తీసుకరావలన్నారు.

## భూ భారతి చట్టంతో ప్రజల భూ సమస్యలు దూరం

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.



**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి:** నూతన భూ భారతి చట్టం అమలుతో ప్రజల భూ సమస్యలు దూరమవుతాయని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పేర్కొన్నారు. పటాన్‌చెరువు మండలం రుద్రారం గ్రామంలో మంగళవారం నిర్వ హించిన భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈ సందర్భంగా చేపట్టిన గ్రామ రెవెన్యూ సదస్సుకు హాజరైన రైతులు ప్రజల భూ సమస్యల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజల భూ సమస్యల దరఖాస్తులను తీసుకొని వారికి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన భూ సమస్యలకు సంబంధించిన వివరాలను రిజిస్టర్లలో అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. జూన్ 20వ తేది వరకు జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూ భారతి అవగాహన సదస్సులు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజలందరూ ఈ సదస్సులను సద్వినియోగించుకొని తమ భూ సమస్యలకు సంబందించిన దరఖాస్తులను సమర్పించవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజా ,రెవెన్యూ , అధికారులు ,ప్రజాప్రతినిధులు ,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్

**ప్రజాపక్షం/గజ్వేల్:** రాష్ట్రంలో సామాజిక న్యాయం పాటిస్తూ సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాలకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ దళితులు, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుండగా, ఇందుకు ఇటీవల ఏర్పాటు చేసిన మంత్రివర్గం, పిసిసి కార్యవర్గాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఒకటి రెండు శాతం ఉన్న కులాలకు మంత్రివర్గంలో ప్రాధాన్యత ఇవ్వగా, అందుకు భిన్నంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు దళితులు, బీసీలకు పెద్దపీట వేసినట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా చారిత్రాత్మక నిర్ణయాలతో పేద ప్రజల మన్ననలు పొందుతున్న సీఎం రేవంత్ రెడ్డి మరింత ఉత్సాహంతో కొత్త కొత్త పథకాలకు శ్రీకారం చుడుతున్నట్లు గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమాన్ని జీర్ణించుకోలేక కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత కొత్త కొత్త డ్రామాలకు తెరలేపుతున్నట్లు ఎద్దేవా చేశారు, ఎన్నో ఆశలతో నమ్మి ఓటేసిన గజ్వేల్ ప్రజలకు అందుబాటులోకి రాని కెసిఆర్ తన పార్టీ ఎమ్మెల్యే చనిపోతే మాత్రం పరామర్శకు వెళ్లినట్లు విమర్శించారు. ప్రజల సొమ్ముతో సుఖాలు అనుభవిస్తున్న కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం అక్రమాల్లో జైలుకెల్లనున్నట్లు వివరించారు..

## గూడ్స్ రైలు నుంచి పడి వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ సిర్పూర్ (టి) :** మాకోడి సిర్పూర్ (టి) రైల్వేస్టేషన్ మధ్య నవేగాం గ్రామానికి సమీపంలో గల రైలు పట్టాలపై వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రోజున ఉదయం కోయంబత్తూరు కు చెందిన భూపతి కరుపు సామి వయసు 22 సంవత్సరాలు కల వ్యక్తి, కోయంబత్తూరు నుండి ఫీరీదాబాద్ వెళ్లే గూడ్స్ రైలు బండిలో, బుల్ కంపెనీ జెసిబి లకు ట్రాన్స్పోర్టరుగా వెళుతూ ప్రమాదవశాత్తు అట్టి గూడ్స్ రైలు బండి నుండి పడి మరణించినాడు. ఇన్వెస్టిగేషన్ చేస్తూ మృతుని బంధువులకు సమాచారమిచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి కాగజ్‌నగర్ మార్చురిగదియందు భద్రపరిచినట్లు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాంభూపాల్

కాంగ్రెస్ పార్టీ కోసం అవిశ్రాంతంగా పని చేస్తా

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా కు చెందిన బీసీ మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన చిన్నబ్బు రాంభూపాల్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియమించారు. ఈ మేరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కెసి వేణు ప్రకటనలో తెలిపారు. ఈ నియామకాలు వెంటనే అమలులోకి వస్తాయని తెలిపారు. మొత్తం 69 మంది నాయకులు ప్రధాన కార్యదర్శులను నియమించగా అందులో జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు రాంభూపాల్‌కు చోటు దక్కడం విశేషం. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ అధిష్టానం టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వం సలహాదారులు షబ్బీర్ అలీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి సహకారంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని పార్టీ కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## 'దోస్త్ ఐడి'తో వస్తే ఎస్టీలకు నేరుగా అడ్మీషన్

ప్రిన్సిపాల్ డాక్టర్ సైదా జైనబ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** తెలంగాణ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) ద్వారా ఇప్పటికీ తమ కళాశాలలో 96 మ oదికి ప్రవేశాలు కల్పించామని జిల్లా గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సైదా జైనబ్ ప్రకటించారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటనలో విడుదల చేస్తూ దోస్త్ ఐడి పూర్తి చేసి సీట్లు పొందని ఎస్టీలు తక్షణమే తమను సంప్రదించాలని కోరారు. ఆఫ్‌లైన్ ప్రక్రియ ద్వారా తమ సంస్థ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో నేరుగా అడ్మిషన్ పొందే అవకాశముందన్నారు. దోస్త్ ఐడి ప్రకారం అన్ని సర్టిఫికెట్లు తీసుకుని తమ కళాశాలలో వెంటనే సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు మీ సేవలో లేదా ఆన్‌లైన్ సెంటర్లలో ఎలాంటి ఫీజులు చెల్లించవద్దని, రిజిస్ట్రేషన్ సైతం తమ కళాశాలలో చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎస్టీలకు మాత్రమే సీట్లున్నాయన్నారు. బీజడ్‌సీ, ఎంజడ్‌సీ, బీబీఎ, ఎంఎస్ సిఎస్ గిరిజన విద్యార్థులకు సీట్లు ఖాళీగా ఉన్నాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# విద్యార్థులు స్థిరమైన లక్ష్యసాధన కోసం చదవాలి

ర్యాంకులు పొందిన విద్యార్థులకు రూ. 9 లక్షలు పంపిణి

పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి:** విద్యార్థుల స్థిరమైన లక్ష్యసాధన కోసం చదవాలని, విద్యార్థులు ఇష్టంతో చదవాలని, , తల్లిదండ్రులు విద్యార్థులను ప్రొత్సహించాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మైపాల్ రెడ్డి అన్నారు. ఏడు సంవత్సరాలుగా విద్యార్థులను ప్రొత్సహించడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ సంవత్సర ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు స్థానిక శాసన సభ్యులు చేతుల మీదుగా తొమ్మిది లక్షల నగదు పంపిణి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు చేశారు. 2024–2025 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి పరీక్షలలో అత్యధిక మా ర్కులు సాధించిన విద్యార్థులకు నగదు పంపిణి పురష్కారం కార్యక్రమం జిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ విద్యార్థులు స్థిరమైన లక్ష్యాల కోసం చదవాలన్నారు. ఏడు సంవత్సరాలుగా శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి, ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతిలో ర్యాంకులు పొందిన విద్యార్థులకు 9 లక్షల రూపాయలు పంఫిణి చేయడంతో విద్యార్థులను ఎంతో ప్రొత్సహిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల పరాఅపజయాల్లో తల్లిదండ్రులు తొడుండాలన్నారు. తను ఐఏఎస్ కోసం చదువుతున్నప్పుడు మొదటి ప్రయత్నంలో ఐఏఎస్ రాలేదని, 162 ర్యాంకుతో ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ వచ్చిందన్నారు. మొదటి ప్రయత్నం అప్పుడు రాలేకపోవడంతో చాలా నిరాశ పొందానని వారం రోజులు బాదపడ్డాను అని మళ్లి టైం వెస్ట్ చేయకుండా నిరాశ చెందకుండా ఐఏఎస్ పరీక్షలో ఏలాంటి తప్పులు చేస్తున్నానో తెలుసుకొని చాలా కష్టపడి చదవి 65వ ర్యాంకుతో ఐఏఎస్ సాధించాలని విద్యార్థులకు తెలిపారు. సంగారెడ్డి జిల్లా పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంక్ సాదించినందుకు సంతోషంగా ఉందని, విద్యార్థులకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 30 కోట్లతో మరమ్మతులు చేశామన్నారు. ప్రతి నెల 70 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు. పిల్లల్ని దత్తత తీసుకొని చదవించాలని, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ విద్య సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా మొదటి ర్యాంకు రావాలని, ఆ విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. మొదటి బహుమతి, 3వేలు, ద్వితీయ బహుమతి, 2వేలు, తృతీయ బహుమతి వెయ్యి రూపాయలు దాదాపు 450 మంది విద్యార్థులకు నగదు పురస్కారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సంబందిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు ,ప్రభుత్వ ప్రైయివేటు, ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షం సహాయక చర్యల్లో 'శివంగి టీం'





**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** సోమవారం రాత్రి నిర్మల్ పట్టణాన్ని వణికించిన ఈదురు గాలులు, భారీ వర్షానికి బ్రహ్మపురి,షేక్సాపేట్ వంటి కాలనీలో పెద్దపెద్ద చెట్లు విరిగి రోడ్డు మీద అడ్డంగా పడిపోవడం వలన ఆటోలు లారీలు ఇంకా వేరే వాహనాలు ధ్వంసం అయ్యాయి.ఈ పరిస్థితిని గమనించిన జిల్లా ఎస్పీ జి.జానకి షర్మిల తక్షణమే స్పందించి,నిర్మల్ జిల్లా ప్రత్యేక మహిళా బృందమైన శివంగి టీమ్ ను రంగంలోకి దింపారు.శివంగి బృందం వెంటనే స్పందించి అక్కడికి చేరుకుని అక్కడున్న పరిస్థితులను చక్కదిద్ది,రోడ్డు కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి,అక్కడ ఇబ్బంది పడిన వృద్ధులకు,ప్రజలకు సహాయం అందించారు.ఈ సహాయక చర్యల్లో,రోడ్డుకు అడ్డంగా ఉన్న వాటిని తొలగింపు కార్యక్రమం లో నిర్మల్ పట్టణ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్,ఆర్ఐ అడ్మిణ్ రామ్ నిరంజన్ రావ్,ఆర్ ఐ శేఖర్,ఆర్ఎస్సై రాజశేఖర్‌లు 12 మంది శివంగి మహిళా బృందం పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు చర్యలు తీసుకోండి

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ,అటవీ,విద్యుత్,ఆర్ అండ్ బి,పంచాయతీ రాజ్,ఇరిగేషన్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,మారుమూల గిరిజన,అటవీ ప్రాంతాల్లో రహదారులు,వంతెనలు,విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పన కోసం శాఖల అటవీశాఖకు ప్రపోజల్స్ పంపించాలని సూచించారు.అభివృద్ధి పనులకు అటవీశాఖ నుంచి ముందస్తు అనుమతులు పొందాల్సిన అవసరం ఉందని,ప్రతి శాఖ పరస్పర సమన్వయంతో కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు.విద్యుత్ లైన్‌ల ఏర్పాటుకు పరివేష్ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాలని అధికారులకు స్పష్టంగా తెలిపారు.చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.అవసరమైన మార్గదర్శకాలను ఇతర శాఖలకు అటవీశాఖ వేగంగా పంపించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,జిల్లా అటవీ అధికారి నాగిని భాను,ఆర్డీఓ రత్నాకళ్యాణి,సంబంధిత శాఖల ఇంజినీరింగ్,రెవెన్యూ,విద్యుత్ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో దారుణ హత్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ శివారులోని 4వ టౌన్ పరిధిలో పాంగ్రాలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తిని బండరాయితో కొట్టి చంపారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 4వ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం బోర్గాం(పి) మెగా వాటర్ ప్లాంట్ వద్ద అర్ధరాత్రి దుండగులు గుర్తు తెలియని వ్యక్తిని దారునంగా హతమార్చారు. యువకుని ముఖంపై బండరాళ్లతో దాడి చేయటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు జరిపినట్లు తెలిపారు. హత్యకు గురైన యువకుడు ఎవరనేది ఇంకా తెలియలేదని, యువకుని సమాచారం తెలిస్తే 4వ టౌన్‌లో సంప్రదించాలని తెలిపారు.

# నకిలీ విత్తనాలు అమ్మినట్లైతే డీలర్ల లైసెన్స్‌లు రద్దు

-అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి:** కలెక్టర్ ఆడిటోరియం నందు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, అడిషనల్ సంజీవరావు అధ్యక్షతన వివిద పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిచనైనది. ఇందులో ముఖ్యంగా జాతీయ నూనె గింజల పథకము కింద సోయాబీన్ 2500 ఎకరాలలో మొగడం పల్లి ,కోహిర్, నారాయణఖేడ్, కంగ్గి మండలాలలో అమలు చేయటకు జిల్లా స్థాయి కమిటీలో తీర్మాణం చేయనైనది. ముఖ్యంగా ఈ పథకాన్ని ఎప్‌పిఓ ల ద్వారా అమలు చేయుటకు దిశ నిర్దేశం చేయనైనది. ఉద్యానవన శాఖ ద్వారా 2025 సంవత్సర గను అయిల్ ఫామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి ఒక్కొక్క ఏఈఓ క్లస్టర్సు 25 ఎకరాల చొప్పున లక్ష్యాన్ని జిల్లా ఎడిడి కలెక్టర్ సూచించారు. ఇందుకు అవసరం అయ్యే అన్ని రకాల సబ్సిడీలను ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు సరియైన సమయంలో ఇప్పిచ్చే విధంగా వ్యవసాయ అధికారులు ,ఉద్యానవన అధికారులు ,వ్యవసాయ సహాయ సంచాలకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తద్వారా జిల్లాలో అధిక విస్తరణంలో అయిల్ ఫామ్ సాగు జరిగే విధంగా చూడాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీలర్లను ఉద్దేశించి మాట్లాడారు . డీలర్లు అందరు కచ్చితంగా విత్తన చట్టం, ఎరువుల చట్టం, పురుగు మందుల చట్టానికి లోబడి తమ వ్యాపారాలు కొనసాగించాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే సరపరా చేయాలని, కొనుగోలు చేసిన రైతులకు కచ్చితంగా రశీదు ఇవ్వాలని సూచించారు. ఎక్కడైనా రైతులకు నకిలీ విత్తనాలు అమ్మినట్లు రుజువైతే ఆ డిలర్స్ విత్తన చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అడిషనల్ యస్పీ మాట్లాడుతూ డీలర్లు అందరు విత్తనాలుగాని, ఎరువులు,గాని ప్రభుత్వం , నిర్ణయించిన గరిష్ట ధరలకంటే అధికంగా అమ్మకూడదని ఎవరైన దళారులు గ్రామాలలో లూజు ప్యాకెట్లు బట్ట సంచులలోగాని అమ్మినట్లు గుర్తిస్తే అలాంటి సమాచారాన్ని వెంటనే వ్యవసాయ అధికారులకు గాని పోలీస్ అధికారులకు తెలియజస్తే వెంటనే వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా అదనపు కలెక్టర చంద్రశేఖర్ మాట్లాడుతూ డీలర్లు అందరు కచ్చితంగా విత్తన చట్టం ,ఎరువుల చట్టం పురుగుమందుల చట్టాలకు లోబడి తమ వ్యాపారాలు చేయాలని ఎక్కడైన నకిలి విత్తనాలు అమ్మినట్లు గుర్తిస్తే వెంటనే వారి యొక్క లైసెన్స్ లు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. టాస్క్ పోర్స్ టీమ్స్ జిల్లా స్థాయిలో డివిజన్ స్థాయిలో మండల స్థాయిలో వ్యవసాయ శాఖ పోలీస్ శాఖ ఆద్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ టీమ్స్ ప్రతి రోజు వివిధ డీలర్ పాప్లనందు ఎక్కడై నకిలి విత్తనాలు అమ్మి నట్లు గుర్తిస్తే వెంటనే వారి యొక్క లైసెన్స్ లు రద్దు చేయడం జరగుతుందని హెచ్చరించారు. ఈ టీమ్స్ ప్రతి రోజు వివిధ డీలర్ పాప్లనందు గోదాములో తనిఖీలు చేయడం జరుగుందని ఎరువులు విత్తనాలు కృతమ కొరతను సృష్టించవద్దని డీలర్లను అదేశించారు.

## మంత్రిని కలిసిన కోల్‌బెల్ట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్



**ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ :** నస్పూర్ లోని సిపిఐ గోదాం వద్ద కోల్‌బెల్ట్ ఏరియా లారీ ఓనర్స్ అసోసియేషన్ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 9వ రోజుకు చేసుకున్నాయి. అయినా అధికారుల వద్ద నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో మంగళవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కి వినతిపత్రం అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా కోల్ బెల్ట్ ఏరియా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నస్పూర్, జూపూర్, భీమారం మండలాల పేరుతో అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని సుమారు వేయి కుటుంబాలు స్థానికంగా ఉం టూ బొగ్గు, కర్ర,పత్తి మొదలగునవి రవాణా చేస్తూ జీవనం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కానీ ఈ క్రమంలో మా పరిధిలో గల న స్పూర్ మండలంలోని తీగల పహాడ్ సిపిఐ గోడౌన్ వారు పత్తి బెల్స్‌ను నిలువ చేసి ఉండడం జరిగిందన్నారు. నిలువ చేసి ఉం చడం జరిగిందన్నారు. నిలువ చేసిన పత్తి బెల్సును స్థానికంగా ఉ న్న లారీలకు కిరాయిలు ఇవ్వకుండా బయట ట్రాన్స్‌పోర్ట్ వా రితో చేతులు కలిపి బయట ప్రాంతాలకు రవాణా కొనసాగిస్తున్నారని అన్నారు. స్థానికంగా ఉన్న లారీ ఓనర్స్ బయట వారితో రవా ణా చేపించడం ఏంటని ప్రశ్నించడంతో మాపై దౌర్జన్యానికి దిగి జిల్లా కలెక్టర్‌కి మాపైన ఫిర్యాదు చేసి పోలీస్ వారితో అక్రమ కే సులు పెట్టించడం జరిగిందని విన్నవించారు. మా సమస్యను అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేయాలని రవాణా శాఖ మంత్రిని కోరారు. ఈ విషయానికి సానుకూలంగా స్పందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అధికారులతో మా ట్లాడి మీ సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## సిఎం పిఎఫ్ వడ్డీ శాతం తగ్గుదలపై ఎఐటియుసి ఆందోళన



**ప్రజాపక్షం/ మందమర్రి :** సింగరేణి కోల్ ఇండియా కార్మికుల భవిష్య నిధిపై ఉన్న వడ్డీ శాతాన్ని తగ్గించడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని గుర్తింపు కార్మిక సంఘం మందమర్రి బ్రాంచ్ సెక్రటరి శైలేంద్ర సత్యనారాయణ అన్నారు. మంగళవారం మందమర్రి ఏరియా కేకే 5 గనిని సందర్శించి ఆయన మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులకు 12శాతం జీంత రికవరీ చేస్తారని అలాగే 12 శాతం యాజమాన్యం కల్పిస్తుందని వాటిపై వడ్డీ గతంలో 8.5శాతంగా ఉన్న దానిని 8 శాతం చేశారని ఇప్పుడు 7.6శాతంకు తగ్గించారని భూగర్భం లోకి వెళ్లి బొగ్గు తీస్తూ దేశానికి వెలుగులు అందిస్తున్న కార్మికులకు వడ్డీ శాతం తగ్గించడం చాలా దారుణమని వెంటనే వడ్డీ శాతం పెంచాలని అన్నారు. అలాగే కేకే 5 గనిలో యాజమాన్యం మాన్ పవర్ లేదంటూ కార్మికులపై పని భారాన్ని మోపడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, శ్రమదానం పేరిట కార్మికుల శ్రమ దోపిడి చేయడానికి సహించబోమని పని ప్రదేశాల్లో వెంటిలేషన్ , గాలి సరఫరా పరిసరాలలో సౌకర్యాలు మెరుగుపరచకుంటే ఎఐటియూసి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో బ్రాంచ్ జాయింట్ సెక్రటరి కంది శ్రీనివాస్, ఏరియా నాయకులు ఎగ్గెడి రాజేశ్వరరావు, గాండ్ల సంపత్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి ప్రేమ్ లాల్, కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నేలకొరిగిన చెట్ల తొలగింపు

ఈదురుగాలులకు కూలిన చెట్లు

ఎస్ఐ రాజశేఖర్‌కు మాక్లూర్ మండల ప్రజల అభినందనలు





**ప్రజాపక్షం/మాక్లూర్ :** మాక్లూర్ నుంచి నందిపేట్ వైపు వెళ్లే రహదారిలో ఈదురుగాలులతో కూడిన వర్షానికి భారీ వృక్షాలు నేలకులాయి. సమాచారమందుకున్న ఎస్సై రాజశేఖర్ హుటాహుటిన చెట్లను తొలగించి వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. మండల వ్యాప్తంగా ఈదురుగాలులకు ఎటువంటి సంఘటనలు జరిగిన వెంటనే సహాయక చర్యలు చేపడుతామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఎస్సై రాజశేఖర్ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రాత్రికి రాత్రే సహాయ చర్యలు చేపట్టి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేశాడు. రోడ్లపై చెట్లను జేసీబీల సహాయంతో తొలగించాడు.

మండల ప్రజానీకం ఎస్సై రాజశేఖర్‌కు అభినందనలు తెలుపుతున్నారు. వర్షాకాలంలో పురాతన పెండింగ్ లో ఉండకూడదని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై రాజశేఖర్ ప్రజలకు సూచించారు.

# క్రీడ



## నేడు డబ్ల్యుటిసి ఫైనల్..

### ఆసీస్, సఫారీల 11 మంది సైన్యమిదే!

క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు సమయం దగ్గరపడింది. నేడు లార్డ్స్ మైదానంలో మెగా ఫైట్ షురూ కానుండగా.. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలు టెస్టు గద కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ బిగ్ ఫైట్‌లో గెలిచి ఛాంపియన్‌గా నిలవాలని సఫారీలు అనుకుంటుండగా.. ఐసీసీ ఫైనల్స్‌లో తమ ఆధిపత్యాన్ని చాటేందుకు ఆసీస్ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఇరుజట్లు ఫైనల్లో ఆడబోయే 11 మంది పేర్లను ప్రకటించాయి.

లార్డ్స్ మైదానంలో డబ్ల్యూటీసీ ఫైనల్‌కు నేడు (జూన్ 11 బుధవారం)తో తెరలేవనుంది. సీజన్ ఆసాంతం అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు అర్హత సాధించిన ఆస్ట్రేలియా, దక్షిణాలు టైటిల్ కోసం నువ్వానేనా అన్నట్టు తలపడనున్నాయి. ఇక.. ఐసిసి ఈవెంట్లలో చోకర్స్‌గా ముద్ర పడిన సఫారీలు ఈసారి టెస్టు గదను వదలొద్దనే కసితో ఉన్నారు. అందుకే.. బలమైన తుదిజట్టును ఎంపిక చేశారు కోచ్, కెప్టెన్. ఐపీఎల్ 18వ సీజన్‌లో చెలరేగి ఆడిన మర్క్‌రమ్, రికెల్టన్, స్టబ్స్‌లతో పాటు వెర్రినే, బడింగ్‌హమ్‌లు బ్యాటింగ్ భారం మోయనున్నారు. బౌలింగ్ యూనిట్ విషయానికొస్తే.. కగిసో రబడ, యాన్సెన్, కేశవ్ మహారాజ్‌తో పాటు సీనియర్ బౌలర్ అయిన లుంగి ఎంగిడి మూడో పేసర్‌గా జట్టులోకి వచ్చాడు.

**దక్షిణాఫ్రికా తుది జట్టు :**

ఎడెన్ మర్క్‌రమ్, రియాన్ రికెల్టన్, వియాన్ మల్డర్, తెంబా బవుమా(కెప్టెన్), ట్రిస్టన్ స్టబ్స్, డేవిడ్ బడింగ్‌హమ్, కైలీ వెర్రినే(వికెట్ కీపర్), మార్కో యాన్సెన్, కేశవ్ మహారాజ్, కగిసో రబడ, లుంగి ఎంగిడి.

**సగానికి పైగా వాళ్లే**

వరుసగా రెండోసారి ఫైనల్ చేరుకున్న ఆస్ట్రేలియా మరోసారి విజయంపై కన్నేసింది. నిరుడు ఛాంపియన్‌గా నిలిచిన జట్టులోని సగానికి పైగా ఆటగాళ్లు ఈసారి తుది జట్టులో చోటు దక్కించుకున్నారు. ఖవాజా, లబూషేన్, పేసర్ మిచెల్ స్టార్క్, హేజిల్‌వుడ్ లియాన్, హెడ్ కామెరూన్ గ్రీన్, అలెక్స్ క్యారీలు మరోసారి దేశానికి టెస్టు గదను అందించాలనే కసితో ఉన్నారు.

డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఆడుతున్న ఆసీస్‌కు కమిన్స్ అతిపెద్ద బలం కానున్నాడు. తనదైన వ్యూహాలతో ప్రత్యర్థిని చిత్తుచేయగల సత్తా ప్యాట్ సొంతం. ఉస్మాన్ ఖవాజా, లబూషేన్, చిచ్చరపిడుగు ట్రావిస్ హెడ్ స్మిత్, కామెరూన్ గ్రీన్, అలెక్స్ క్యారీలతో కంగారూల బ్యాటింగ్ యూనిట్ దుర్భేద్యంగా ఉంది. ఐపిఎల్‌లో అద్భుతంగా రాణించిన హేజిల్‌వుడ్. తమకు లక్కీ హ్యాండ్ అవుతాడని కమిన్స్ బృందం భావిస్తోంది.

**ఆస్ట్రేలియా తుది జట్టు :**

ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబూషేన్, కామెరూన్ గ్రీన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్ బ్యూ వెబ్‌స్టర్, అలెక్స్ క్యారీ(వికెట్ కీపర్), ప్యాట్ కమిన్స్(కెప్టెన్), మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్, జోష్ హేజిల్‌వుడ్.

## అంతర్జాతీయ క్రికెట్‌కు నికోలస్ పూరన్ గుడ్‌బై!

అంతర్జాతీయ క్రికెట్ నుంచి మరో స్టార్ ప్లేయర్ తప్పుకున్నాడు. వెస్టిండీస్ విధ్వంసక బ్యాటర్ మూడు ఫార్మట్లకు వీడ్కోలు పలికాడు. 29 ఏండ్ల వయస్సులోనే రిటైర్మెంట్ ప్రకటించి క్రికెట్ ప్రపంచానికి షాకిచ్చాడు. విండీస్ వికెట్ కీపర్‌బ్యాటర్ నికోలస్ పూరన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. అయితే ఫ్రాంచైజ్ క్రికెట్‌లో మాత్రం కొనసాగుతానని వెల్లడించారు. దక్షిణాఫ్రికా క్రికెటర్ హెన్రిచ్ క్లాసెన్ రిటైర్మెంట్ ప్రకటించిన కొన్ని రోజుల వ్యవధిలోనే పూరన్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకోవడం విశేషం. ఈమేరకు పూరన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. ఇది ఎంతో కఠినమైన నిర్ణయమని, అయినప్పటికీ చాలా ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నా అని రాసుకొచ్చాడు.

'చాలా ఆలోచించిన తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాలని నిర్ణయించుకున్నా. తాము ఎంతో ఇష్టపడే ఈ ఆట చాలా ఇచ్చింది. ఇస్తూనే ఉంటుంది. వెస్టిండీస్ ప్రజలకు ప్రాతినిధ్యంవహించే అవకాశం ఎంతో ఆనందాన్ని, మరపురాని జ్ఞాపకాలు మిగిల్చింది. ఆ మెరూన్ రంగు ధరించడం, జాతీయగీతం కోసం నిలబడటం, మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ పూర్తిస్థాయిలో ప్రదర్శన ఇవ్వడం. నిజంగా మాటల్లో చెప్పడం కష్టం. కెప్టెన్‌గా జట్టును నడిపించడం నేను ఎల్లప్పుడూ గుర్తుంచుకునే గౌరవం' అని రాసుకొచ్చారు. నాపై చూపిన అమితమైన ప్రేమకు ధన్యవాదాలు, కష్ట సమయాల్లో నావెంటే ఉన్నారంటూ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈ ప్రయాణంలో నాతో కలిసినందుకు కుటుంబ సభ్యులు, స్నేహితులకు ధన్యవాదాలు తెలిపారు. వారి నమ్మకం, మద్దతు తనను ముందుకు నడిపించాయని చెప్పారు.



విండీస్ తరఫున 61 వన్డేలు ఆడిన ఈ లెఫ్ట్ హాండ్ బ్యాటర్ 1983 రన్స్ చేశాడు. వాటిలో 3 సెంచరీలు ఉన్నాయి. 106 టీ20ల్లో 2275 పరుగులు చేశాడు. ఇటీవల ఐపీఎల్ 2025 సీజన్‌లో తన పవర్ ఏంటో చూపించారు. లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడిన ఈ లెఫ్ట్ హ్యాండ బ్యాటర్ గ్రౌండ్‌లో సిక్సర్ల వర్షం కురిపించాడు. 14 మ్యాచ్‌ల్లో దాదాపు 200 స్ట్రైక్ రేట్‌తో 524 పరుగులు సాధించాడు. విడీస్ టీ20 జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన పూరన్.. మరో 8 నెలల్లో పొట్టి ప్రపంచకప్ ఉండగా తప్పుకోవడం గట్టి ఎదురుదెబ్బేనని చెప్పొచ్చు.

# ఫోకస్ మహిళ


మహిళలపై జీవిత భాగస్వామి నుంచే లైంగిక హింసకు తెరపడుతుందనిగానీ అనుకోవడానికి వీల్లేదు. వైవాహిక అత్యాచారం అనే అంశం వ్యక్తిగత స్వేచ్ఛ, నైతికత, మానవ హక్కులు, న్యాయ వ్యవస్థ లాంటి అనేక విషయాలను చర్చకు తెస్తుంది. ఇది ఎంతో సున్నితమైన, కానీ కీలకమైన సామాజిక సమస్య.






## వ్యక్తిగత స్వేచ్ఛను హరించే వైవాహిక అత్యాచారం

ఇటీవల కాలంలో విస్తృతంగా చర్చకు వస్తున్న అంశం 'వైవాహిక అత్యాచారం'. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ అకృత్యంపై మహిళలు గళం విప్పడం హర్షణీయ పరిణామం. ఒక్కసారిగా సమాజం మారిపోతుందని గానీ, మహిళలపై జీవిత భాగస్వామి నుంచే లైంగిక హింసకు తెరపడుతుందనిగానీ అనుకోవడానికి వీల్లేదు. అయితే, సమస్యపట్ల ఆలోచన మొదలైతే, అది కార్యరూపం దాల్చడానికి మార్గం సుగమమవుతుంది. వైవాహిక అత్యాచారం అనే అంశం వ్యక్తిగత స్వేచ్ఛ, నైతికత, మానవ హక్కులు, న్యాయ వ్యవస్థ లాంటి అనేక విషయాలను చర్చకు తెస్తుంది. ఇది ఎంతో సున్నితమైన, కానీ కీలకమైన సామాజిక సమస్య. దీనిని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఈ అంశాన్ని పలు కోణాల్లో విశ్లేషించుకోవాలి. ఇక్కడ వైవాహిక అత్యాచారం అంటే ఏమిటి? అనే ప్రశ్న తొలుత వినిపిస్తుంది. వైవాహిక అత్యాచారం అంటే, ఒక జీవిత భాగస్వామి మరొక జీవిత భాగస్వామిపై వారి అనుమతి లేకుండా లైంగిక సంబంధాన్ని బలవంతంగా పెట్టడం. ఇది మానవ హక్కుల ఉల్లంఘన మాత్రమే కాకుండా శారీరక, మానసిక, భావోద్వేగ హింస. కానీ, ఈ దుర్మార్గమైన పోకడలను భారత చట్టాలు ఖండించడం లేదు. ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 375 ప్రకారం వివాహితుల మధ్య లైంగిక సంబంధం అత్యాచారంగా పరిగణించబడదు. అంటే భార్యపై భర్త చేసిన లైంగిక అత్యాచారం చట్టబద్ధంగా అత్యాచారం కాదు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం ఇది నేరమవుతుంది. సెక్షన్ 375 రెండో క్లాజ్ ప్రకారం, భార్య లేక భర్త మైనర్ అయినప్పుడు మాత్రమే, వారి మధ్య లైంగిక సంబంధం నేరమవుతుంది. అయితే, ఈ సెక్షన్ తీవ్రమైన విమర్శలకు లోనవుతున్నది. లైంగిక సంబంధానికి భార్య అనుమతి అవసరం లేదన్న వైఖరిని విమర్శలు ఉన్నాయి. స్త్రీ అనుమతిని అసహజంగా పక్కకుపెట్టిన విధానాన్ని చాలా మంది తప్పుపడుతున్నారు. మానవ హక్కుల దృష్టిలో భార్య అనుమతి లేకుండా భర్త లైంగిక కార్యకలాపానికి ఒడిగట్టడం నేరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ), ఐక్యరాజ్యసమితి లాంటి సంస్థలు వైవాహిక అత్యాచారాన్ని లైంగిక హింసగా పరిగణిస్తున్నాయి. వివాహమంటే ఒప్పందం మాత్రమేతప్ప, స్వీకార హక్కు తీసివేసే అనుమతి కాదని స్పష్టం చేస్తున్నాయి. అందుకే, సహజమైన సంబంధాల్లో కూడా సంపూర్ణ అనుమతి అవసరం అని నేడు న్యాయవ్యవస్థలు చెప్పడం ప్రారంభించాయి. తరతరాలుగా జరుగుతున్న వైవాహిక అత్యాచారం సామాజికంగా, మానసికంగా మహిళలను దారుణ పరిస్థితుల్లోకి నెడుతున్నాయి. బాధితురాలు తన స్వంత భర్త చేతినుండి లైంగికంగా హింసకు గురికావడం, ఆత్మవిశ్వాసం, భద్రతా భావం, మానసిక శాంతిని నాశనం చేస్తుంది. ఇది ఒక నిరంతర వేదన, దానిని బయటకు చెప్పడానికి ఆమెకు భయము, సంకోచము, తిట్లు, అవమానాల భయం ఉంటుంది. బాధితురాలి ఆరోగ్యం, సంబంధాలు, పిల్లలపై ప్రభావం కలుగుతుంది. భార్యను సొంత ఆస్తిగా, ఒక వస్తువుగా చూడడం దుర్మార్గం. సమాజంలో మహిళలకు ఎలాంటి హక్కులు లేని పరిస్థితికి నిలువుటద్దమైన వైవాహిక అత్యాచారానికి ఎంత త్వరగా తెరపడితే అంత మంచిది. ఈ విషయంలో చట్టాల్లో మార్పులు ఎంతైనా అవసరం.



## మావోయిస్టులతో శాంతిచర్చలు జరపండి



### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ డిమాండ్

### మంచిర్యాలలో 21,22 తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభలు

**ప్రజాపక్షం/మంచిర్యాల :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)జిల్లా మహాసభలు ఈనెల 21,22 తేదీలలో మంచిర్యాలలో ఘనంగా నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ తెలిపారు. మంగళవారం సిపిఐ జిల్లా సమితి సభ్యులు కొట్టే కిషన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలవేన శంకర్ మాట్లాడుతూ 21న ప్రదర్శన, బహిరంగ సభ, 22న ప్రతినిధుల సభ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హాజరువుతారని తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరుతో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖామంత్రి అమిత్‌షాలు మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపేస్తున్నారని, మావోయిస్టులు లేకుండా చేస్తే అడవుల్లోని విలువైన ఖనిజ సంపదను దోచుకుని కార్పోరేట్ కంపెనీలకు దారాదత్తం చేయవచ్చనే కుట్రను బిజెపి ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలుపుదల చేసి మావోయిస్టులతో శాంతి చర్చలకు జరిపించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరేవారిని దేశద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల ఏరివేత వెనుక ఆదివాసి ప్రాంతాల్లోని సహజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. మావోయిస్టులను పట్టుకుని కాల్చి చంపే విధానాన్ని తక్షణమే మానుకొని శాంతి చర్చలు నిర్వహించాలని కేంద్రప్రభుత్వానికి సిపిఐ మొదట నుంచి విజ్ఞప్తి చేస్తుందని ఆయన గుర్తు చేశారు. ఈ దిశగా కేంద్రప్రభుత్వం ఆలోచన చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తి అవుతున్నందున ప్రజల ఆశలు, ఆకాంక్షలను నీరుగార్చకుండా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కమ్యూనిస్టులు గా కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, మిట్టపల్లి వెంకటస్వామి, రేగుంట చంద్రశేఖర్, కె.వీరభదయ్య, బొల్లం పూర్ణిమ, జోగుల మల్లయ్య, కలిందర్ అలీ ఖాన్, లింగం రవి, కాకూరి నగేష్, మిట్టపల్లి శ్రీనివాస్, ముస్కే సమ్మయ్య, రేగుంట చంద్రకళ, మిట్టపల్లి పోలు, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండ ఎర్ర జెండానే

### నూరేళ్ల ఉత్సాహంతో పోరాటాలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు భాగం హేమంతరావు

**ప్రజాపక్షం/భద్రాచలం/చర్ల :** నాటి నుండి నేటి వరకు ఎర్రజెండానే పేదలకు అండగా ఉందని, ఉంటుందని, నూరేళ్ల ఉత్సాహంతో మరిన్ని సమరశీల పోరాటాలు నిర్వహిద్దామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. చర్ల మండల సిపిఐ 20వ మహాసభ సంతపాకల ప్రాంగణంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ అధ్యక్షతన మంగళవారం జరిగింది. పార్టీ అరుణ పతాకాన్ని సీనియర్ నాయకులు నూపా తిరుపతిరావు ఎగరవేయగా, మహాసభ అమరులకు నివాళ్లర్పించింది. అనంతరం భాగం మాట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం, పీడిత ప్రజల విముక్తి కోసం ఎర్రజెండా వందేళ్లుగా అలుపెరగని పోరాటాలు సాగిస్తుందన్నారు. అటవీహక్కుల చట్టం, ఉపాధిహామీ చట్టం కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే వచ్చాయన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖామంత్రి అమిత్‌షాలు అడవుల్లోని విలువైన ఖనిజ సంపదను కార్పోరేట్ కంపెనీలకు దారాదత్తం చేయవచ్చనే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతిచర్చలకు జరిపించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చాలన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వలస ఆదివాసీ పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని, ఏజెన్సీలో తాగుసాగు నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సభలో నూపా పోతయ్య, పాలంచ రామారావు, పాలెం సత్యనారాయణ, నానిపల్లి భద్రం, కణితి మంగమ్మ, ఉప్పులూరి నాగరాజు, గుంజి మాల్యాద్రి, పొడియం ఆదిలక్ష్మి, కాకర్ల అనసూయ, కోడిరెక్కల రాజారావు, ఆంద్రు వామనరావు, చల్లా లక్ష్మీనారాయణ, కోటి ముత్యాలరావు, ఉప్పులూరి వెంకట నర్సమ్మ, కల్లూరి సీతారాములు, కట్టం నాగేశ్వరరావు, కట్టం ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాసమస్యలపై పోరాటాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులు అలుపెరగని పోరాటాలు చేస్తున్నారని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ఈనెల 16న జిల్లా కేంద్రంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో జరిగే సిపిఐ నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డిలు హాజరవుతారన్నారు. ఈ మహాసభల్లో గత మూడు సంవత్సరాలలో జరిగిన పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తులో ప్రజాసమస్యలపై కలసివచ్చే శక్తులతో, లౌకిక వాదులతో కలిసి పని చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కేంద్రంలోని బిజెపి ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్రలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో లక్ష ఎకరాల ప్రభుత్వ భూమి పేదలకు పంచాలని భూ పోరాటాలను నిర్మాణాత్మకంగా బలమైన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పూనుకోబోతున్నామన్నారు. వంద సంవత్సరాలుగా అలసిపోకుండా అనేక అడ్డంకులను దాటుకొని అనేక సవాళ్లను ఎదుర్కొని దేశంలో నిరుపేదల సమస్యల పరిష్కారానికి సిపిఐ అనేక పోరాటాలు చేస్తుందన్నారు. జిల్లాలో 35 వేలకు పైగా భూమిలేని నిరుపేదలు ఉన్నారని, వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు సాధించడమే లక్ష్యంగా భవిష్యత్తు పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, కడారి రాములు, సిపిఐ జిల్లా నాయకులు రాజశేఖర్, అజ్జ వేణు, బాలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు



### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాంనాయక్ డిమాండ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాంనాయక్ డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి అధ్యక్షతన ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో రౌండ్ టేండ్ సమావేశం నిర్వహించగా విద్యార్థి సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని మాట్లాడారు. ఈనెల 12 నుండి రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమవుతున్న సందర్భంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రతి సంవత్సరం 20 శాతం నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరుతో జలగల్లాక పీడిస్తున్నారన్నారు. ప్రైవేట్ కార్పోరేట్ విద్యాసంస్థల్లో బుక్స్, స్కూల్ డ్రెస్, పేరుతో డబ్బులు దండుకుంటున్నా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. జిఓ నెం. 42, 91 ప్రకారం ఫీజులు పెంచాలంటే జిల్లా కలెక్టర్‌తో అదేవిధంగా జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు పేరెంట్స్ అభిప్రాయాలు తీసుకుని కమిటీ ద్వారా నిర్ణయించి ఫీజులు పెంచాలన్నారు. విద్యాశాఖ అధికారులు ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేసి ఫీజులు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్ మాట్లాడుతూ ఫీజులు పెంచటం నియంత్రణ చట్టాన్ని అమలు చేయకపోతే మాత్రం రాబోయే కాలంలో రాష్ట్ర, జిల్లావ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, రాజేశ్వర్, గణేష్, కుషాల్, సంతోష్, రమేష్, మోతి, దినేష్, చరణ్ పాల్గొన్నారు.

## వడ్ల బోనస్ కాజేసిన వారిపై చర్యలు

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్

**ప్రజాపక్షం/కోటగిరి :** కోటగిరి సొసైటీలో వడ్ల బోనస్‌పై అధికారులు విచారణ జరిపి, ఖజానా కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. కోటగిరి మండలకేంద్రంలో మంగళవారం సిపిఐ మండల మహాసభ నల్ల గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ కోటగిరి సోసైటీలో గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో జరిగిన అవినీతిపై నిగ్గు తేల్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారి పేర్లు అధికారులు బహిర్గతం చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఏడాది దాటుతున్న ప్రభుత్వ ధనం కాజేసిన వారిపై చర్యలు తీసుకోకుండా చేస్తున్న ఆలస్యం కావడంతో అధికారులు తీరుపై అనుమానాలు సైతం వ్యక్తం చేయాల్సి వస్తుందని వారు ఆరోపించారు. ప్రజల ఎజెండా కోసం జీవితాలు త్యాగం చేస్తున్న మావోయిస్టులు చర్చలకు సిద్ధమని తెలిపిన ఆపరేషన్ కగార్ పేరుతో చంపడం అన్యాయమన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఖనిజ సంపద అ ప్పనంగా అప్పచెప్పడానికి అడవులను ఖాళీ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దత్తత గ్రా మమైన కోటగిరిలో నూతన బస్టాండ్‌ను నిర్మించి విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని సుధాకర్ కోరారు. ఈసందర్భంగా మహాసభలో సిపిఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిపిఐ మండల కార్యదర్శిగా అంబాటి విఠల్‌గౌడ్, సభ్యులుగా నల్ల గంగాధర్, రాజు, బర్ల సునీల్ కుమార్, బుడాల రాములు, మల్లేష్‌గౌడ్, వెంకటేష్, గోపాల్‌రావులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.





# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## సొంతింటి కల కాంగ్రెస్ తోనే సాధ్యం

**ప్రజాపక్షం/నెక్కొండ:** పేదవారి సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని టిపిసిసి సభ్యుడు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని పిట్ట కాలు బోడు తండా, సీతారాంపురం గ్రామాలలో శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి, ఇటీవల ఇందిరమ్మ పథకంలో ఇండ్లు మంజూరు చేసిన లబ్ధిదారులకు మంజూరి పాత్రాలను అందించిన సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి . ఆయన మాట్లాడుతూ పేదవారికి సొంత ఇంటి కలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని ఆయన అన్నారు. పేదవారికి మూడు నుంచే క్రమంలో ఎన్ని సవాలు ఎదురైనా ప్రభుత్వం ఎదుర్కొని ఇచ్చిన మాట ప్రకారం పరకాల అమలుకు నిరంతరం శ్రమిస్తూనే ఉంటుందని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కీ అశోక్, నెక్కొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్టిఆర్ హరిప్రసాద్, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కుసుమ చెన్నకేశవులు, ఆయా గ్రామాల నాయకులు కటుకూరి కొండల్ రెడ్డి, సూర్య, భానోత్ వీరన్న, భీమన్న, జక్కుల రాజు, పోల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## పంటలలో రసాయనక ఎరువుల వాడకం తగ్గించాలి

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**ప్రజాపక్షం/ఖానాపూర్:** పంటలలో రసాయనాల వాడకం తగ్గించాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై మాట్లాడుతూ రబీ సీజన్లో నాట్లు బాగా ఆలస్యంగా వేయడంతో ఖానాపూర్ మండలంలో ధాన్యం కోతకు ఆలస్యంగా వస్తుందని తద్వారా అకాల వర్షాలతో రైతులతో నష్టపోతున్నారని, కొనుగోలు కేంద్రాలలో కూడా ఇబ్బందులు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ అల్దాస్ జనయ్య, నర్సంపేట ఇరిగేషన్ ఇఇ సుదర్శన్ రావు, డిఇ రమేష్, పాకాల ఎఇలు జెఇలు ఖానాపురం వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, మాజీ జడ్పిటిసి ఎడ్ల జగన్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ పరుచూరి సుబ్బారావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు వేములపల్లి వెంకట ప్రసాద్, రైతులు మండల ప్రసాద్, కందుల సాంబయ్య, పల్లపాటి సీతారాములు, కోరే రాములు, తదితరులు పాల్గొన్నారు.

## నిఘా నేత్రాలతో నేరాల నియంత్రణ సాధ్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఒక్క సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డికాలనీ ఫేస్ 1లో సిసి కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఒక్క సిసి కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. నేరాల నియంత్రణలో సిసి కెమెరాల పాత్ర కీలకమని అన్నారు. నేరం జరిగిన వెంటనే మేము నేత్రాలతో నేరస్తులను పట్టుకోవడం సులువుతుందని పేర్కొన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీలోని 30 వార్డుల కాలనీ వాసులను ఆదర్శంగా తీసుకుని అన్ని వార్డుల్లో దొంగతనాలు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, పిసిసి సభ్యులు చల్లూరి మధు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు క్యాతరాజు సాంబమూర్తి, అప్పం కిషన్, మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్ గౌడ్, వెన్నంపల్లి మహేష్ రెడ్డి, చల్లా శ్రీనివాస్ రెడ్డి, కుమార్, శివ రెడ్డి, మాదుగుల సమ్మిరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## దేశినేని హన్మంతరావు లేని లోటు పూడ్చలేనిది : శ్రీహరి



**ప్రజాపక్షం/కాజీపేట :** హన్మంతరావు లాంటి గొప్ప మిత్రుడు నాకు దొరకడం తన అదృష్టంగా భావిస్తానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రాంపూర్ గ్రామ వాస్తవ్యులు దేశినేని హన్మంతరావు దశదిన కర్మ సందర్భంగా రాంపూర్ లోని వినాయక కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్. నాగరాజు, మేయర్ గుండు సుధారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశినేని హన్మంతరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ తన 35ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ప్రతీ సందర్భంలో తన వెంట ఉంటూ తనను ప్రోత్సహించారని తెలిపారు. హన్మంతరావు కేవలం స్నేహితుడు మాత్రమే కాదని కుటుంబ సభ్యుడని అన్నారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటూ, సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. హన్మంతరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జీజీ క్యాట్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, మాజీ ఎంపి సీతారాం నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుపోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, దేశినేని హన్మంతరావు కుటుంబ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఝాన్సిరెడ్డికి ఘనస్వాగతం



**ప్రజాపక్షం/పాలకుర్తి:** నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సిరెడ్డి టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ గా నియమితులై నియోజకవర్గానికి రావడంతో మంగళవారం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా ఘనస్వాగతం పలికారు. జనగామ నుండి పాలకుర్తి వరకు పూల వర్షంతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సిరెడ్డికి టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ పదవి కల్పించిన పార్టీ అధిష్టానానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఝాన్సిరెడ్డి మాట్లాడుతూ పార్టీ నన్ను గుర్తించి ఈ పదవిని కట్టబెట్టడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా న్నారు. అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేస్తానన్నారు. కార్యకర్తల సమస్యలపై పూర్తి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం

ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని, రేవూరి, కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని 150 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రిలో సోమవారం జిల్లా స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ సమీక్షలో దవాఖాన అభివృద్ధి, వసతుల పెంపుదల, సిబ్బంది వినియోగం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల శాసన సభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య హాజరయ్యారు. సమీక్షకు ముందు ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ఆసుపత్రి ఆవరణలో వివిధ విభాగాలను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న ప్రహరీ గోడలను పరిశీలించి నూతన ప్రహరీ నిర్మాణం త్వరగా చేపట్టాలని సూచించారు. నిరుపయోగంగా మారిన పురాతన భవనాలను తొలగించాలని సూచించారు. ఒపి విభాగాన్ని సందర్శించి, రోగుల నమోదు (ఇన్/అవుట్) పత్రాలు పరిశీలించారు. రోగులతో ప్రత్యక్షంగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు పొందారు.ప్రసూతి వార్డు, మెడికల్ స్టోర్, ఇతర కీలక విభాగాలు నిశితంగా పరిశీలించారు. అనంతరం సమీక్షా సమావేశంలో ఆసుపత్రిలో ఉన్న వైద్య సేవల స్థితిగతులు, రోగులకు అవసరమైన అదనపు వసతులు, వైద్య సిబ్బంది పౌర అవసరాలకు తగినట్లుగా ఉండేలా మార్పులు, ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన పెంచే ప్రచార కార్యక్రమాలు, ఆశా కార్యకర్తల వాడకంతో గ్రామీణ ప్రజలకు సేవలు అందించాలన్న దిశగా సూచనలు చేశారు. వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి అభివృద్ధి, వసతులు, బడ్జెట్, వైద్యులు సిబ్బంది, తదితర అంశాలను సమీక్షా సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. ఇంకా ఆసుపత్రికి కావాల్సిన మౌలిక వసతుల గురించి ప్రతిపాదనలు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. వారం పదిరోజుల్లోవైద్య ఆరోగ్య శాఖ మంత్రి రానున్నారని అన్నారు. ఆసుపత్రికి సంబంధించిన వివరాలతో ఎమ్మెల్యేలతో కలిసి ముందుగా వైద్య ఆరోగ్య మంత్రి ని, ఆ తదుపరి సిఎం దృష్టికి తీసుకెళ్లి ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం 2009లో జరిగిందని, ఇప్పుడు 16 ఏళ్ల తరువాత మళ్ళీ అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. అభివృద్ధికి కట్టుబడి ఉన్నామనడానికి ఇదొక నిదర్శనం అని అన్నారు. సమీక్షా సమావేశంలో చర్చించిన అంశాల ఫలితాలను త్వరలోనే చూపిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ హనుమకొండ మెటర్నిటీ హాస్పిటల్‌కు ఎంతో గౌరవప్రదమైన చరిత్ర ఉందని, అనేక పేద ప్రజలకు ఇది వెలకట్టలేని వైద్య సేవలను అందిస్తోందని ఈ హాస్పిటల్‌ను హెరిటేజ్ స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తోందన్నారు.ఆసుపత్రికి కావాల్సిన నిధులను త్వరలో ప్రజా ప్రతినిధులందరం కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. ఈ సమీక్షా సమావేశంలో రెడ్ క్రాస్ ఇసి సభ్యుడు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ అప్పయ్య, ఆసుపత్రి వైద్యులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంపై ఎపి ప్రభుత్వం దాడి

కొమ్మినేని అరెస్టును నిరసిస్తూ జర్నలిస్టు సంఘాల ఆందోళన




**ప్రజాపక్షం/హనుమకొండ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జర్నలిస్టులు, సాక్షి మీడియా కార్యాలయాలపై పాశవికంగా దాడులు చేస్తూ అక్రమ కేసులు నమోదు చేయడాన్ని హనుమకొండ జిల్లా జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. ఎపి ప్రభుత్వ వైఖరినీ నిరసిస్తూ మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ప్ల కార్డులు పట్టుకొని తమ నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎపి ప్రభుత్వం గత సంవత్సర కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక చతికిలబడిందని ఈ అంశంలో ప్రజలను పక్కదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా కక్షగట్టి సాక్షి జర్నలిస్టులు,సాక్షి మీడియా కార్యాలయాలపై అక్రమ దాడులకు పాల్పడుతోందని, అక్రమ కేసులు నమోదు చేస్తోందని అన్నారు. జర్నలిస్టులు మీడియా కార్యాలయాలపై దాడులు ప్రజాస్వామ్యం పై దాడిగా వారు అభివర్ణించారు. టియుడబ్ల్యూజె(ఐజెయు) హనుమకొండ జిల్లా అధ్యక్షులు గడ్డం రాజిరెడ్డి, టియుడబ్ల్యూజె జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, తెలంగాణ జర్నలిస్టు ఫెడరేషన్ హన్మకొండ శాఖ అధ్యక్షులు టివి రాజు, రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సహాయ కార్యదర్శి పొడిశెట్టి విష్ణువర్ధన్, టియుడబ్ల్యూజె ఐజెయు రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడి పెల్లి మధు, టియుడబ్ల్యూజె హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కన్వీనర్ వల్లాల వెంకటరమణ, టియుడబ్ల్యూ జె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, కౌన్సిల్ సభ్యులు నల్లాల బు చ్చిరెడ్డి, చిన్న పత్రికల సంఘం జిల్లా నాయకులు అంతడుపుల శ్రీనివాస్, టి యుడబ్ల్యూజెజిల్లా ఉపాధ్యక్షులు ఊటుకూరు సాయిరాం, సీనియర్ జర్నలిస్టులు వరదెల్లి లింగయ్య, వాంకే శ్రీనివాస్, బత్తిని రాజేందర్ గౌడ్, కొల్ల కృష్ణ కుమార్ రెడ్డి, నరేష్, ఎ. నరేందర్, జి రమేష్, ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి యాంసాని శ్రీనివాస్, దామెర రాజేందర్, కొలనుపాక కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎకో టూరిజంగా పాకాల అభివృద్ధి

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ఖానాపురం:** పాకాలను ఎకో టూరిజంగా మరింత అభివృద్ధి చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా అటవీ శాఖ అనూజ్ అగర్వాల్‌తో కలిసి క్షేత్రస్థాయిలో న ర్సంపేట రేంజ్‌లోని పాకాలలో గ్రీన్ హెరిటేజ్ క్రింద అభివృద్ధి చేసిన బయోడైవర్సిటీ పా ర్కును, బట్టర్, ట్రిక్కింగ్, సైక్లింగ్, పగోడాలను పరిశీలించిన అనంతరం కలెక్టర్ పాకాల సరస్సులో బోటింగ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకులకు ఆకర్షించే విధంగా పాకాల సరస్సు పరిసర ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయుటకు పటిష్టమైన ప్రణాళికలు రచించాలని డిఎఫ్ఒకు సూచించారు. అందులో భాగంగా బయోడైవర్సిటీ పార్క్‌ను మరింత అభివృద్ధి పరచడం, పర్యావరణ పర్యాటక అభివృద్ధి చేయాలని, సఫారీ ట్రాక్ ఏర్పాటు, మూలికల తోట పునరుద్ధరణ, సందర్శకులకు రాత్రి బస సౌకర్యాల అభివృద్ధి, చెరకు ప్యాచ్ అభివృద్ధి, పర్యావరణ పర్యాటక సంబంధిత కార్యకలాపాలకు సంబంధించిన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ రవి కిరణ్, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ, అటవీ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిర్దిష్ట గడువుగా స్మార్ట్ సిటీ పనులు పూర్తి

బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** స్మార్ట్ సిటీ పనులను నిర్దిష్ట గడువుగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగర పరిధిలోని భద్రకాళి బండ్‌తో పాటు బిఆర్ నగర్, మడికొండ, కడిపికొండ, గోకుల్ నగర్ ప్రెసిడెన్సీ స్కూల్, రాజాజీ నగర్ కల్వర్టు తదితర ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించి కొనసాగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని సమర్థవంతంగా పూర్తి చేయుటకు పలు సూచనలు చేశారు ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భద్రకాళి బండ్‌పైన 90 పనులను పూర్తి చేయడం జరిగిందని, డ్రైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఫినిషింగ్ వర్క్, గ్రానైట్ వర్క్, లైటింగ్‌తో పాటు ఎంట్రెన్స్ గేట్ పనులను వారంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బంధం చెరువు ప్రాంతంలోని రోడ్డు పనులు, సుబేదారి ప్రాంతంలోని డొమినోస్ వద్ద కొనసాగుతున్న అంతర్గత రోడ్డు నిర్మాణ పనులు, బిఆర్ నగర్‌లో స్మార్ట్ సిటీ అంతర్గత రోడ్ పనులను కడిపికొండ, మడికొండ ప్రాంతాలలో అంతర్గత రోడ్డు నిర్మాణ పనులను ములుగు రోడ్డు ప్రాంతం లో రోడ్డు నిర్మిత పనులు గోకుల్ నగర్‌లో తిరుమల బార్ నుండి ప్రెసిడెన్సీ స్కూల్ వరకు రోడ్డు పనులను పరిశీలించారు. ఇన్‌చార్జి ఎస్ఇ శ్రీనివాస్, ఇఇలు రవికుమార్, సంతోష్ బాబు, డిఇ లు రవి, కిరణ్, రాజ్ కుమార్, ఎఇలు రాగి శ్రీకాంత్, నరేష్, స్మార్ట్ సిటీ ప్రతినిధులు ఆనంద్, ఓలేటి లక్ష్మారెడ్డి, శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

వివరాలు వెల్లడించిన డిఎస్పి సంపత్ రావు

**ప్రజా పక్షం/ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు భూపాలపల్లి డిఎస్పి ఎ సంపత్‌రావు తెలిపారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని డిఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగతనాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గత నెల రోజుల వ్యవధిలో గణపురం, భూపాలపల్లి, మణుగూరు ప్రాంతాలలో రాత్రి పూట తాళం వేసిఉన్న ఇళ్లను టార్గెట్ చేసి వరుస దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. వరుస దొంగతనాలపై గణపురం, భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగ తనాలను నమోదు చేయగా ఈ విష యంపై జిల్లా ఎస్పి కిరణ్ ఖరే వరుస దొంగతనాలు కట్టడి చేయడానికి భూపాలపల్లి సబ్ డివిజన్ అధికారి సంపత్ రావు ఆధ్వర్యంలో చిట్యాల, భూపాలపల్లి సిఐలు మల్లేష్, నరేష్ కుమార్ సిసిస్ వెంకటేశ్వర్లు కలిసి ఒక బృందంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 15రోజులుగా నిఘా ఏర్పాటు చేసుకొని, సిసి టివి కెమెరాల పుటేజ్‌లను ఉపయోగించి నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం గణపురం మండలం మైలారం గ్రామం పెట్రోల్ బంక్ వద్ద గణపురం ఎస్సై వాహనాలను తనిఖీ చేస్తుంగా ఒక కారును ఆపే ప్రయత్నంలో వహనంలో ఉన్న ఆరుగురు వ్యక్తులను అదుపు లోకి తీసుకొని విచారించగా వారి పేర్లు తెలియజేసినట్లు తెలిపారు. చోరీలకు పా ల్పడ్డవారిలో దొరిశెట్టి స్వామి, నిరంజన్ కారల్ మార్క్స్ కా లనీ భూపాలపల్లి, మేన శివ సిరిసిల్ల,వాంక్ డోత్ సాయికుమా ర్, సారపాక, రమేష్ మేడ్చెల్ మల్కాజిగిరి,షేక్ బాబావలి గుంటూర్, అజయ్ పెద్దపల్లి జిల్లాల వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుండి 37,95260 లక్షల సొత్తును,బంగారు నగలను స్వాధీన పరుచుకున్నట్లు డిఎస్పి తెలిపారు. అరెస్టు చే సిన ఆరుగురిని అదుపులోకి తీసుకొని కోర్టు ముందు హాజరు పరిచినట్లు తెలిపారు. సిసిఎస్‌సిఐ వెంకటేశ్వర్లు,ఎస్సైలు సాంబమూర్తి, అశోక్, రమేష్ తోపాటు కానిస్టేబుల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌టిసి పరిరక్షణకు ఉద్యమ కేసులు ఎత్తివేయాలి

సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథిరెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్‌ప్రతినిథి:** ఆర్‌టిసి పరిరక్ష ణకై ఉద్యమ సమయంలో పె ట్టిన కేసులు ఎత్తివేయాలని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కోర్టుకు హాజరై ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్‌టిసి ప్రైవేట్ పరం చేసి ఎత్తివేయాలని చూసిన సందర్భంగా ఆర్‌టిసి కార్మికులకు అండగా నిలిచి ఆ పోరాటంలో పాల్గొన్నందుకు సిపిఐ, ఎఐటియుసి శ్రేణులు 40మందిపై అక్రమ కేసులు పెట్టి కోర్టు చుట్టూ తిరగడానికి బిఆర్‌ఎస్ ప్రభుత్వమే కారణమన్నారు. నాటి ఉద్యమ సమయంలో పెట్టిన అక్రమ కేసులను నేటి వరకూ ఎత్తివేయకపోవడం ఎంతవరకూ సమంజసమో ప్రభుత్వం ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఉద్యమ సమయంలో పెట్టిన అ క్రమ కేసులు ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సి పిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , ఎండి ఫాతిమా, వెలుగు శ్రావణ్, నర్రా శ్రావణ్, మంద శం కర్, కూరాకుల పాల్, ఎర్రోజు పద్మ, తండ మాధవి, ఎండి హలీమా, బాదావత్ బాలాజీ, దొండ నాగేష్, గుల్లగట్లు శ్రీను, కందుకూరి రాంబాబు పాల్గొన్నారు.

## సన్నబియ్యం పంపిణీతో నిరుపేదల సంబరాలు

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న లబ్ధిదారుల కృతజ్ఞతలు

జిల్లాలో ఎక్కువగా సన్నవడ్లను పండిస్తున్న రైతన్న



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లా రైతాంగం ఎక్కువగా సన్నవడ్లను సాగు చేస్తున్న తరుణంలో జిల్లాలో పండించిన వరి ధాన్యాన్ని ఇక్కడి ప్రాంత ప్రజలకు బియ్యం రూపంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుంది. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం గతంలో ఎన్నడు లేని విధంగా దేశంలో ఎక్కడ పంపిణీ చేయని సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని నిరుపేదలకు ఈ సంవత్సరం ఉగాది పర్వదినం నుండి ప్రారంభం కావడంతో జిల్లాలో సన్నబియ్యం తీసుకుంటున్న ప్రతి నిరుపేద కుటుంబాలలో సంబరాలు నెలకొల్పాయి. 1982 సంవత్సరంలో అప్పటి పాలకులు ఒక్క రూపాయికి కిలో దొడ్డు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టగా ఆ సమయంలో సంబరాల్లో మునిగిన ప్రజలు అదే తరహాలో నేడు సంతోషాలు వ్యక్తం చేస్తున్నారు. దొడ్డు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టగా ఆ సమయంలో సంబరాల్లో మునిగిన ప్రజలు అదే తరహాలో నేడు సంతోషాలు వ్యక్తం చేస్తున్నారు. దొడ్డు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టగా కాదు నిరుపేదలు మాత్రమే ఆహారంగా తీసుకున్నారే తప్పా 80 శాతం ప్రజలు వాటిని ఇతరులకు అమ్మకం చేయడంతో దొడ్డు బియ్యం పథకం పక్కదారి పట్టింది. దీనితో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్ణయం తీసుకొని ప్రతి నిరుపేద వ్యక్తం ధనవంతుడు తింటున్న విధంగానే కడుపు నిండా ఆహారం తీసుకోవాలని ఉద్దేశ్యంతో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడమే కాకుండా సన్నవడ్లను రైతులు పండించే విధంగా ప్రభుత్వం ప్రోత్సహించి సన్నవడ్లను పండించిన ప్రతి రైతుకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వడంతో రైతులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలకు సరిపడా బియ్యం ఈ నెల 1వ తేదీ నుండి ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగించనున్నారు. మూడు నెలల బియ్యాన్ని తీసుకున్న ప్రతి నిరుపేద కుటుంబం ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది.ములుగు జిల్లాలో అధిక మొత్తంలో రైతులు వరి ధాన్యాన్ని సాగు చేస్తుండగా ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ప్రతి రైతు సన్న వడ్లను పండించడానికే మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో పండిస్తున్న సన్నవడ్లను ఇక్కడి జిల్లా ప్రజలకు బియ్యం రూపంలో ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుంది. జిల్లాలోని 10 మండలాల్లో 94,628 తెల్ల రేషన్ కార్డులు కలిగిన నిరుపేదలు ఉండగా ప్రతి నెల వారికి 17వేల 19క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేయడం జరుగుతుంది. ప్రసుత్తం మూడు నెలల బియ్యం పంపిణీ చేస్తుండడంతో ఐదు వేల 150 టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం రేషన్ షాపులకు సరఫరా చేసింది. దీనితో ఒక వైపు రైతులు మరోవైపు నిరుపేదల కళ్ళల్లో ఆనంద భాష్పాలు వెల్లువిరుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ రుణపడి ఉంటామని పేదలు అంటున్నారు. కడుపునిండా తిండి కంటి నిండా నిద్ర పోతున్నాం లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యంతో పౌష్టికాహారాన్ని అందిస్తుండడంతో ప్రతి రోజు కడుపునిండా తిండి తినడమే కాకుండా కంటి నిండి నిద్రపోతున్నామని జిల్లాలోని ఏజెన్సీ గ్రామానికి చెందిన మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో తిండి తినలేకపోయామని, నేడు రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్నబియ్యం పంపిణీ చేస్తుండడంతో కష్టపడి పనిచేస్తూ ఇష్టంతో సన్నబియ్యంతో భోజనం చేస్తున్నామన్నారు. పేదలఇబ్బందులను గుర్తించినప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడంఎంతో గొప్పవిషయమని వారుహర్షంవ్యక్తం చేశారు.

## పోగుల శ్రీనివాస్ నిబద్ధత కార్యకర్తలకు స్ఫూర్తిదాయకం

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** పోగుల శ్రీనివాస్ క్రమశిక్షణ, అంకితభావం, తన రాయకీయ నిబద్ధత కార్యకర్తలకుస్ఫూర్తిదాయకమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. సిపిఐ కురవి మండల సమితి ఆధ్వర్యంలో పారటీ కార్యాలయంలో ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన పోగుల శ్రీనివాస్ సంతాప సమావేశం జరగగా ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా విద్యార్థి, యువజన రంగాల్లో పనిచేసి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా అనేక ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొని డోర్నకల్ నియోజకవర్గంలో పార్టీ విస్తరణకు తన వంతు పాత్ర పోషించాడని, వారి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని అన్నారు. ఈ నెల 15న రాజోలు గ్రామంలో సంతాప సభ నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సంతాప సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కరణ రాజన్న, బుర్ర సమ్మయ్య, బుడమ వెంకన్న, తురక రమేష్, దూదికట్ల సారయ్య, బొల్లం ఉప్పలయ్య,కలగూర నాగరాజు, నిలిగొండ నాగేశ్వరావు, బండారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## చాతకొండ ఆరవ బెటాలియన్‌ను సందర్శించిన ఎస్‌పి



**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి :** లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఆరవ బెటాలియన్ ను కమాండెంట్ డి శివ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్‌పి ఎస్‌పి హిత్ రాజు 6వ బెటాలియన్ ను మంగళవారం సందర్శించి నూతనంగా 100 మందితో ఏర్పాటు చేసిన ఎస్డిఆర్ఎఫ్ బెటాలియన్ పోలీస్ సిబ్బంది అధునాతనమైన పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఏవిధమైన విపత్తులు, ప్రమాదాలు, వరదలు సంభవించిన మన ఎస్డిఆర్ఎఫ్ ముందుండి ప్రజలను కాపాడి వారికి రక్షణ గా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ డి.శ్రీనివాసరావు, ఆర్ఐలు, బెటాలియన్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చర్ల మండల సిపిఐ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/భద్రాచలం:** చర్ల మండల సిపిఐ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మంగళవారం చర్లలో జరిగిన సిపిఐ 20వ మహాసభలో ఈ ఎన్నిక చోటు చేసుకుంది. మండల కార్యదర్శిగా నూపా పోతయ్య, సహాయ కార్యదర్శులుగా కోటి ముత్యాల రావు, చల్లా లక్ష్మీ నారాయణ ఎన్నికయ్యారు. అదేవిధంగా 19 మందితో కార్యవర్గ, 55 మందితో మండల కమిటీ ఎంపికైంది. ఈ సందర్భంగా కార్యదర్శి, సహాయ కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామగ్రామాన పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

## సిపిఐ మండల మహాసభ

**ప్రజాపక్షం/బోనకల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బోనకల్ మండల 17వ మహాసభ బుధవారం ముష్టికుంట్ల గ్రామంలో జరుగుతుందని సిపిఐ మండల కార్యదర్శి వెంగళ ఆనందరావు నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలకు 150 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. మండల మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు, జిల్లా సమితి సభ్యులు హాజరుకానున్నట్లు ఆనందరావు తెలిపారు. ఈ మహాసభలు అమరజీవి జక్కా నాగభూషణం ప్రాంగణంలో జరుగుతాయన్నారు.

## జూన్19న మధిరలో సిపిఐ ఖమ్మం జిల్లా మహాసభలు

**ప్రజాపక్షం/మధిర:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మంజిల్లా మహాసభలు జూలై 19, 20 తేదీల్లో మధిర పట్టణంలో నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి, మందడపు రాణి నేడొక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధిరలోని సిపిఐ కార్యాలయంలో మండల పరిధిలోని సిపిఐ ముఖ్యుల సమావేశం జరిగింది. సమావేశంలో రవి మాట్లాడుతూ ఈ మహాసభల నిర్వహణకు సంబంధించి 14న ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. ఆహ్వాన సంఘ ఏర్పాటు సమావేశానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ములజితేందర్ రెడ్డి లు హాజరుకానున్నారని రవి, రాణి లు తెలిపారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమచరిత్రను నేటి తరానికి తెలియజేసేవిధంగా మహాసభల నిర్వహణ ఉంటుందని వారు తెలిపారు. అదే సమయంలో గత మహాసభల నుంచి ఈ మహాసభల వరకు పార్టీ కార్యాచరణపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ మధిర మండల కార్యదర్శి , జిల్లా సమితి సభ్యులు ,ఎఐటియుసి డివిజన్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.


## 26న సిపిఐ మణుగూరు పట్టణ, మండల మహాసభలు



**ప్రజాపక్షం/మణుగూరు:** ఈ నెల 26వ తేదీన జరుగు సిపిఐ మణుగూరు పట్టణ, మండల మహాసభలు జయప్రదం చేయాలని మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ లు పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం విఠల్ రావు నగర్ గ్రామంలో సీపీఐ ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ 100 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటంలో అనేక ఉద్యమం లో పోరాటాలు కొనసాగించారని, భూమి కోసం, భుక్తి కోసం అనేక పోరాటాలు కొనసాగించారన్నారు. దేశ స్వాతంత్రం కోసం అలుపెరగని పోరాటాలు కొనసాగించారని, ప్రత్యేక రాష్ట్రాలు విభజన కోసం పని చేశారని వారన్నారు. పార్టీ ఈ నెల 26వ తేదీన జరుగు మండల, పట్టణ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

టాస్క్ ఫోర్స్ ఎడిఎ నరసింహారావు



**ప్రజాపక్షం/సుజాతనగర్:** గ్రామాలలో రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్ ఫోర్స్ ఎడి ఎ నరసింహారావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ దుకాణాలను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. విత్తనాలు ప్యాకెట్ మీద ఉన్న లాట్ నెంబర్ ఇన్ వాయిస్ సరిగా ఉందా లేదా అని పరిశీలించారు. విత్తనాలు సంబంధించిన కంపెనీ లైసెన్స్‌లను తనిఖీలు నిర్వహించారు. రైతులు లైసెన్సు కలిగిన డీలర్లు వద్దని విత్తనాలు కొనుగోలు చేయాలని గ్రామాలలో తిరుగుతూ ఎవరైనా నకిలీ విత్తనాలను అమ్మితే అలాంటి వారిపై వ్యవసాయ అధికారులకు కానీ పోలీస్ శాఖ కానీ తెలియచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి నర్మదా తదితరులు పాల్గొన్నారు.

## దిశ సర్వసభ్య సమావేశం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** ఐడిఓసి కార్యాలయంలో గురువారం దిశ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపి బలరాం నాయక్, జిల్లాకు చెందిన శాసన మండలి, శాసనసభ సభ్యులు, దిశా కమిటి సభ్యులు, అన్నిశాఖల అధికారులు పాల్గొంటారన్నారు. ఆయాశాఖల అధికారులు సంబంధిత నివేదికలతో హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

# శరవేగంగా అమరావతి హైవే పనులు

మూడు ప్యాకేజీల్లో
నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణం
కొదుమూరు, బోనకల్ క్రాస్ రోడ్డు వద్ద రింగ్





**ప్రజాపక్షం/ బోనకల్ :** నాగపూర్ అమరావతి హైవే నిర్మాణ పనులు ఖమ్మంజిల్లాలో శరవేగంగా సాగుతున్నాయి. నాగపూర్ నుంచి అమరావతి వరకు 310 కిలో మీటర్ల మేర నాలుగు వరుసల రోడ్డును నిర్మిస్తున్నారు. ఖమ్మం నుంచి విజయవాడ వరకు మూడు ప్యాకేజీల్లో ఈ పనులు సాగనున్నాయి. వివి పాలెం నుంచి బ్రాహ్మణపల్లి వరకు మొదటి ప్యాకేజీలో బ్రాహ్మణపల్లి నుంచి రెమిడిచర్ల వరకు రెండవ ప్యాకేజీలో రెమిడిచర్ల నుంచి విజయవాడ వరకు మూడవ ప్యాకేజీలో హైవే నిర్మిస్తున్నారు. మొదటి ప్యాకేజీని అగర్వాల్ కంపెనీ, రెండు, మూడవ ప్యాకేజీ పనులను మెగా ఇంజనీరింగ్ వర్క్స్ సంస్థ చేపట్టింది. గతంలో నాగపూర్ వెళ్లాలంటే విజయవాడ నుంచి 720 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. ఈ నాలుగు వరుసల హైవే నిర్మాణం పూర్తయితే కేవలం 310 కిలో మీటర్లు ఐదు గంటల్లో విజయవాడ నుంచి నాగపూర్ చేరుకోవచ్చు. విజయవాడ నుంచి వెస్ట్ బైపాస్ ద్వారా అమరావతి వెళ్లేందుకు సులువుగా ఉంటుంది. ఖమ్మంజిల్లాలో మే 2024న పనులు ప్రారంభించి శరవేగంగా రోడ్డు నిర్మిస్తున్నారు. చింతకాని మండల పరిధిలోని కొదుమూరు వద్ద రింగ్ రోడ్డును నిర్మిస్తున్నారు. ఇందుకు అవసరమైన భూ సేకరణను కూడా పూర్తి చేశారు. దేవరపల్లి హైవేను నాగపూర్ అమరావతి హైవే క్రాస్ చేస్తుంది. అందుకే ఇక్కడ రెండు హైవేలలో ప్రయాణించే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా రింగ్ ఏర్పాటు చేస్తున్నారు. బోనకల్ మండలం బోనకల్ క్రాస్ రోడ్డు వద్ద వైరా బోనకల్ క్రాస్ రోడ్డు, మధిర బోనకల్ క్రాస్ రోడ్డుపై ఫ్లైఓవర్‌లు నిర్మించడంతో పాటు ఇక్కడ హైవే నుంచి దిగేందుకు లేదా హైవేపైకి ఎక్కేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఈ హైవే నిర్మాణం పూర్తయితే ఖమ్మంనుంచి 90 కిలో మీటర్ల వ్యవధిలో విజయవాడ చేరుకోవచ్చు. ఇప్పుడు ఖమ్మం నుంచి విజయవాడ వెళ్లాలంటే కోదాడ వెళ్లి నేషనల్ హైవే 65 ద్వారా విజయవాడ చేరుకుంటున్నారు. ఖమ్మం నుంచి విజయవాడ వరకు మూడు ప్యాకేజీల పరిధిలో తొమ్మిది చోట్ల హైవేపైకి రాకపోకలకు అవకాశం కల్పిస్తున్నారు.

## కొలిక్కొచ్చిన గంధం టవర్ డ్రైనేజీ సమస్య

డ్రైనేజీ నిర్మాణానికి
రూ.30లక్షల నిధులు కేటాయింపు

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/వైరా:** ప్రజాపక్షం దినపత్రికలో రోడ్లపై దుర్వాసనలు వస్తున్న విషయంపై కథనాలను ప్రచురించడం జరిగింది. గంధం టవర్స్ మురికినీరు సంగతేంటి. మురికినీటి సమస్యకు ముగింపు లేదా, గంధం టవర్ మురికి నీటి పరిస్థితి ఏంటి? ఇలా పలు కథనాలను ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురించడం జరిగింది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే అధికారులు రూ.30లక్షల నిధులను డ్రైనేజీ నిర్మాణానికి కేటాయించారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న గంధం టవర్స్‌లో డ్రైనేజీకి సౌకర్యం లేకుండా అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. దీంతో ఆ అపార్ట్‌మెంట్‌లోని 40 ఫ్లాట్‌లోని నీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు అటు చుట్టుప్రక్కల ప్రజలు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దుర్వాసనలపై ప్రజాపక్షం దినపత్రిక వరుస కథనాలు అధికారుల్లో కదలికను తెప్పించాయి. ఇటీవల వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో, మున్సిపాల్ అధికారులతో కలిసి గంధం టవర్ వద్ద రోడ్డుపై ప్రవహించే బురద దుర్వాసన నీటిని పరిశీలించారు. సమస్యను అధికారులకు వివరించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. దీంతో స్పందించిన అదనపు కలెక్టర్ వెంటనే నిధులు రూ.30లక్షలు మంజూరు చేసి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ఆదేశించింది. అప్పటికే పలుదఫాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపాల్ కమీషనర్ చింతా వేణు రోడ్లపై నీరు రాకుండా బ్యాంకర్లతో బయటకు లాగించి పంపించారు. ఇప్పుడు డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు కావడం పట్ల ప్రజాపక్షం కథనాలను పలువురు అభినందిస్తున్నారు.

## భూభారతిలోనే భూ సమస్యలు పరిష్కారం

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** భూ భారతి చట్టం 2025 ద్వారా ఇక నుండి భూ సమస్యలు వుండవు అని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మంగళవారం మండాలపాడులో జరిగిన భూభారతి సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో భూసమస్యల పరిష్కారం కోసం ఆఫీస్‌లు చుట్టూ తిరిగిన మీకు పరిష్కారం లభించలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న భూ భారతి చట్టం ద్వారా అనేక సమస్యలు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. భూ భారతి చట్టం తీసుకువచ్చిన మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి బట్టి, పొంగులేటి, తుమ్మల, ఇతర రాష్ట్ర మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓరాజేంద్ర, తహసీల్దార్ యస్‌వి నారాయణ మూర్తి, ఆర్ఐ భాస్కర్, రెవిన్యూ అధికారులు, పెనుబల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, పెనుబల్లి మండలం, మండాలపాడు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## పేదల పాలిట వరం ఇందిరమ్మ ఇల్లు

అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్




**ప్రజాపక్షం/పినపాక:** ఇందిరమ్మ ఇళ్ళు పేదల పాలిట వరం లాంటివని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్ అన్నారు. మంగళవారం పినపాక మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల పైలట్ ప్రాజెక్ట్ విలేజ్ అయిన భూపాలపట్నం గ్రామపంచాయితీ నందు వివిధ స్థాయిలలో నిర్మించబడుతున్న ఇందిరమ్మ ఇండ్లను హౌసింగ్ పిడిశంకర్‌తో కలిసి పరిశీలించినారు. లబ్ధిదారులతో మాట్లాడి త్వరితగతిన ఇల్లు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇల్లు ప్రభుత్వ నిబంధనల మేరకు 400 చ.అడుగులకు తగ్గకుండా 600 చ.అడుగులకు పెరగకుండా నిర్మాణం చేపట్టాలన్నారు. మంజూరు పత్రాలు అందుకుని కట్టుకోవడానికి సిద్ధంగా వున్న లబ్ధి దారులు నిర్మాణం చేపట్టే ముందు పంచాయతీ కార్యదర్శికి, హౌసింగ్ ఎఇ కి తెలియజేసి వారి చేత మార్కింగ్ ఇవ్వబడి, మొబైల్ యాప్ ద్వారా గ్రౌండ్ లెవల్ ఫోటోలను జియో టాగింగ్ చేసిన తర్వాత మాత్రమే ఇంటి నిర్మాణం ప్రారంభించాలన్నారు. నిబంధనల మేరకు నిర్మించుకున్న అందరులబ్ధిదారులకు స్టేజ్‌లను బట్టి ఎప్పటికప్పుడు బిల్స్ చెల్లించడం జరుగుతుందని, ఇప్పటి వరకు భూపాలపట్నం గ్రామపంచాయితీ పరిధిలో బేస్మెంట్ పూర్తి చేసుకున్న 35 మంది లబ్ధిదారులకు బేస్మెంట్ బిల్ ఒక లక్ష రూపాయలు, స్లాబ్ లెవల్ పూర్తి చేసుకున్న 12 మంది లబ్ధిదారులకు మరో లక్ష రూపాయల బిల్ నేరుగా లబ్ధిదారుల అకౌంట్ కి జమ చేయడం జరిగిందన్నారు. బిల్స్ చెల్లించడంలో ఎటువంటి జాప్యం లేదని, అయితే నిబంధనలు పాటించకుండా ఇంటి నిర్మాణం చేపడితే మాత్రం పైకం చెల్లించబడదని వారు తెలియజేసారు.ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులు అందరూ మోడల్ హౌజ్‌ని సందర్శించి ప్రభుత్వం అందించే సొమ్ముతో ఇల్లు ఎలా పూర్తి చేసుకోవాలో తెలుసుకొని ఆర్థికంగా అదనపు భారం పడకుండా ఇల్లు పూర్తి చేసుకోవాలని ఇందిరమ్మ ఇల్లు మంజూరు పొందటం పేదలకు ఒక వరం వంటిదని ఇటువంటి అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపిడిఒ సునీల్ కుమార్, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, హౌ సింగ్ ఎఇ వినిత, కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నా రు.

## ఇందిరమ్మ ఇండ్లు పట్టాలు అందజేత: ఎమ్మెల్యే కోరం



**ప్రజాపక్షం/ఇల్లెందు:** మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే కోరం కనకయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ఐదేళ్లుగాప్రతీపేదవారి సొంతింటి కల కలగానే మిగిలిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖామాత్యులు పొంగిలేటి శ్రీనివాసరెడ్డికి సభాముఖంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలలిపారు. మొదటి విడతలో పేర్లు రానివారు నిరాశపడొద్దని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ విడతల వారీగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరభద్రం, ఎంపిడిఒ గాంధీ, సిఐ తాటిపాముల సురేశ్, బోడు ఎస్ఐ శ్రీకాంత్, ఇల్లెందు మార్కెట్ కమిటీ చైర్మన్ బాణోత్ రాంబాబు, మండల అధ్యక్షుడు బూక్యా దేవానాయక్, సొసైటీ డైరెక్టర్ ఉల్లోజి ఉదయ్, మండల కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ద్వారా ఇసుక పాయింట్ నిర్వహణ



**ప్రజాపక్షం/చింతకాని:** జిల్లా వ్యాప్తంగా మహిళల ద్వారా ఇసుకపాయింట్ నిర్వహణ ఏర్పాటు చేశామని మహిళా సమాఖ్యలపైపెట్టిన నమ్మకం నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ మజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం చింతకాని మండలం చిన్నమండవలో సింధు గ్రామసమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్న ఇసుక రిచ్‌ను పరిశీలించారు.. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కూపన్ ఆధారంగా మాత్రమే ఇసుక పాయింట్ నుంచి ఇసుక తరలించాలన్నారు. లోడ్ అవుతున్న ట్రాక్టర్ వద్ద ఉన్న కూపన్ ను కలెక్టర్ పరిశీలించి ఖర్చు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇసుక రిచ్ వద్ద10 రోజుల్లో చెక్‌పోస్టు వంటిది మహిళలు ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు.మహిళలు స్త్రీ శక్తి భవన్ అసంపూర్తిగా ఉండటంతో రూ. 5లక్షల చెక్కు మంజూరీ చేసి నెలరోజుల్లో భవన నిర్మాణం పూర్తి చేయాలని ఎంపిడిఒను ఆదేశించారు.కార్యక్రమంలోఎంపిడిఒచుంచు శ్రీనివాసరావు , తహసీల్దార్ అనంతరాజు, ఐకెపి సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

## వెల్‌నెస్ సెంటర్‌లో సమస్యలు పరిష్కారం

ఎస్‌జిపిఎటి ఖమ్మంజిల్లా యూనిట్



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంజిల్లాలో వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు, జర్నలిస్టులకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే ఆశయంతో ప్రారంభించిన వెల్‌నెస్ సెంటర్‌లో తిష్టవేసిన సమస్యలను సత్వరం పరిష్కారించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఏటి) ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్ లు డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా ప్రతినిధి బృందం ఖమ్మం వెల్‌నెస్‌సెంటర్‌ను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు వంద మందికిపైగా వెల్‌నెస్ సెంటర్‌కు వస్తుండగా తమకు కావాల్సిన మందులు సరిపడ ఇవ్వడం లేదని, షుగర్ పరీక్ష కోసం రెండు రోజులు తిరగాల్సి వస్తుందని, వేచి ఉండటానికి ప్రత్యేక హాల్, కూర్చోవడానికి సరిపడ కుర్చీలు కూడా లేవని పలువురు పెన్షనర్ల ఆవేదనను ఇప్పటికైనా అధికారులు పరిశీలించి తగు సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం డిమాండ్ చేస్తుంది. అదే సమయంలో వెల్‌నెస్ సెంటర్ కోసం ప్రత్యేకంగా నూతన భవనం ఏర్పాటు చేయాలని భవనం నిర్మించేంత వరకు తాత్కాలికంగా వసతులతో కూడిన ప్రభుత్వ భవనంలో వెల్‌నెస్ సెంటర్ నిర్వహించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వైద్య పరీక్షల నిమిత్తం వస్తున్న పెన్షనర్లు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు ల్యాబ్ సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కనీసం బిపి మిషన్లు కూడా లేకపోవడం శోచనీయమని సత్వరం బిపి మిషన్లు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. వేలాది మంది పెన్షనర్లు, ఉద్యోగ, ఉపాధ్యాయ, జర్నలిస్టులు ఆధారపడిన వెల్‌నెస్ సెంటర్‌లో తక్షణం కనీస మౌలిక వసతులు కల్పించాలని, వైద్య పరికరాలను సమకూర్చాలని లేని పక్షంలో ఆందోళనను చేపడతామని పరిశ పుల్లయ్య, రవికుమార్ లు హెచ్చరించారు. వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శి ంచిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు పి. వీరభద్రరావు, పివిఆర్‌కె ప్రసాద్, పెన్షనర్లు కెవి రమణా రావు, ఎం. కృష్ణయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఒకరికి అగచాట్లు... ఇంకొకరికి పడిగాపులు!



**ప్రజాపక్షం/పెనుబల్లి:** రేషన్ బియ్యం కావాలంటే పడిగాపులు పడాల్సిందే.. డీలర్ కి సైతం తప్పని అగచాట్లు. మండలంలో మొత్తం 17 వేల 132 రేషన్ కార్డులు ఉన్నాయి. లబ్ధిదారులు 46 వేల 636 మంది ఉన్నారు. ఒక్కొక్కరికి ఆరు కేజీల బియ్యం పంపిణీ చేయాలి. ఐతే కేంద్ర ప్రభుత్వం మూడు నెలలకి సరిపడా బియ్యం ఒకేసారిపంపిణీ చేయాలి అని తెలపటంతో ఇబ్బందులు మొదలు అయ్యాయి. రే షన్ షాప్ వద్ద లబ్ధిదారులు ఒక్కొక్కరు మూడు సార్లు వేలిముద్రలు వేయాలి. అనంతరం బియ్యం తూకం వెయ్యాలి. అన్నిఒకే అయితేనే బియ్యం పంపిణీ జరుగుతుంది. ప్రతి కార్డుకి సుమారు పది నుండి పదిహేను నిమిషాలు పడుతుంది. అప్పటి వరకు లబ్ధిదారులు పడిగాపులు పడాల్సిం దే. ఇందులో ప్రధాన సమస్య నెట్.. సరి గా పని చేస్తే ఓకే లేదంటే జాప్యం తప్ప దు. బియ్యం. జూన్, జూలై, ఆగస్టు నెలల కు పంపిణీ చేసున్నారు. మండలం మొత్తం రెండు లక్షల 98 వేల 391కేజీలు పంపిణీ జరుతుండగా. కాంగ్రెస్ ప్రభుత్వం లో కొత్తగా సభ్యులు చేరికతో అదనంగా రే షన్ పంపిణీ పెరిగిందని డీలర్లు తెలిపా రు. మండలంలో మొత్తం 28 రేషన్ షా పులు ఉండగా పంచాయతీలు 33ఉన్నాయ్. ఏ రేషన్‌షాప్ వద్ద చూసినా లబ్ధిదారు లు పడిగాపులుపడి ఎదురు చూడాల్సిందే.

## అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో కూనంనేనికి మరోవిజయం



**ప్రజాపక్షం/ఇల్లెందు:** నవంబర్ 2023లో జరిగిన ఎన్నికల్లో అపూర్వ విజయం సాధించిన సిపిఐ అభ్యర్థిగా పోటీచేసిన కూనంనేని సాంబశివరావుతో పోటీలో చతికిలబడిన పలువురు అఫిడవిట్‌లో తప్పుందని సుప్రీంకోర్టును ఆశ్రయించగా సుధీర్ఘ విచారణ అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో కూనంనేనికి మరోవిజయం సొంతమైందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె .సారయ్య పేర్కొన్నారు. పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద మంగళవారం ఏర్పాటైన విజయోత్సవ కార్యక్రమంలో కేక్‌ను కత్తిరించి మిఠాయి లు పంచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. శాసనసభలో కూనంనేని మాట్లాడుతుంటే..విద్యార్థులు, యువత, మహిళలు హ ర్షించేవారని తెలిపారు. ఈ తీర్పుతో అన్నివర్గా ల ప్రజలకు కూనంనేనిపై ఉన్న నమ్మకం, అభిమానం అందరికీ తెలిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, శాఖా కార్యదర్శి నజీర్ అహ్మద్,ఎఐటియుసిఉపాధ్యక్షుడుదాసరిరాజారాం,పట్టణకార్యదర్శితదితరులుపాల్గొన్నారు.

# లీల

## తెలుగు అమ్మాయిలకే మొదటి ప్రాధాన్యత

నిర్మాత ఎస్‌కెఎన్



తెలుగు తెరపై అమ్మాయిలకే మొదటి ప్రాధాన్యత ఇస్తానని, తెలుగు అమ్మాయిలను తన సినిమాల్లో ప్రోత్సహిస్తానని నిర్మాత ఎస్‌కెఎన్ అన్నారు. ఇప్పటివరకూ దాదాపు 10 మంది తెలుగు అమ్మాయిలకు హీరోయిన్స్‌గా అవకాశం ఇవ్వడం విశేషం. హీరోయిన్స్ గానే కాదు చిత్ర పరిశ్రమలోని అన్ని క్రాఫ్ట్‌లో 25 మంది తెలుగు అమ్మాయిలను పరిచయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు ఎస్‌కెఎన్. ఒక తాజాగా తన కొత్త సినిమా లవ్ స్టోరీ ద్వారా తెలుగు అమ్మాయి శ్రీగౌరి ప్రియకు హీరోయిన్‌గా అవకాశం కల్పించారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న చెన్నై లవ్ స్టోరీ మూవీ టీజర్ ఇటీవల రిలీజై హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. తెలుగు అమ్మాయిలను ఎంకరేజ్ చేస్తూనే తను మాటిచ్చినట్లే అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ రోజుల్లో చిత్రంతో రేష్మ, ఆనంద్, రొమాన్స్ సినిమాతో మానస, టాక్సీవాలాతో ప్రియాంక జవాల్కర్, సంతోష్ శోభన్ కొత్త చిత్రంతో హారిక, మరో కొత్త చిత్రంతో ఐశ్వర్య, త్రీ రోజెస్ వెబ్ సిరీస్‌తో కుషిత కల్లపులను హీరోయిన్స్‌గా పరిచయం చేశారు. ఇప్పుడు శ్రీగౌరి ప్రియను చెన్నై లవ్ స్టోరీ మూవీతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఫ్యూచర్ లోనూ తాను నిర్మించే చిత్రాల్లో హీరోయిన్స్‌గా మొదటి ప్రాధాన్యత తెలుగు అమ్మాయిలకే ఇవ్వాలని భావిస్తున్నానని ఎస్‌కెఎన్ తెలిపారు. తెలుగు అమ్మాయిలకు అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని ఆయన చెప్పారు.

## తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు లోగో




తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డు లోగోను ప్రభుత్వం సిద్ధం చేసింది. తెలుగు సినిమా కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ లోగోను తయారు చేసింది. ఒక చేతితో డప్పు వాయిద్యంతో రూపొందించారు. డప్పు పై తెలంగాణ గుర్తును పొందుపరిచారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత సినిమా అవార్డులు రెండు ప్రభుత్వాలు కూడా ఇవ్వలేదు. తెలంగాణ ఏర్పడిన పదేళ్ళ తరువాత తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం సినిమా అవార్డులు ఇవ్వడానికి ముందుకు వచ్చింది. 2024 ఏడాదికి సంబంధించిన అవార్డులతో పాటు, ఆరు జాతీయ అవార్డులు ఇవ్వనున్నారు. దీంతో పాటే పదేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న ఒక్కో ఏడాదికి మూడు సినిమాల చొప్పున అవార్డులు ఇవ్వనున్నారు. ఈ నెల 14న హైటెక్స్‌లో ఈ వేడుక జరగనుంది.





పద్మభూషణ్ అవార్డు గ్రహీత నందమూరి బాలకృష్ణ 65వ జన్మదిన వేడుకలు తిరుమలలోని అఖిలాండం వద్ద ఘనంగా జరిగింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్ వర్మ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా 650 కొబ్బరికాయలు పగలగొట్టి, 6.5 కిలోల కర్పూరంతో హారతి ఇచ్చారు. ఈ వేడుకల్లో రుపేష్ వర్మ, సుబ్బుపాల్గొన్నారు.

## జూలై 4న వస్తున్న తమ్ముడు




ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రెస్టీజియస్ మూవీ 'తమ్ముడు'. ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న 'తమ్ముడు' సినిమా వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ చేశారు. ఈ నెల 11న సాయంత్రం 5 గంటలకు 'తమ్ముడు' సినిమా ట్రైలర్ విడుదల చేయబోతున్నట్లు నిర్మాత దిల్ రాజు తెలిపారు. 'తమ్ముడు' మూవీ ట్రైలర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ వీడియో ఫన్నీగా డిజైన్ చేశారు. తాను గట్టిగా అడిగినందు వల్లే ఈ చిత్ర రిలీజ్ డేట్ ను ప్రకటించారని, ట్రైలర్ రిలీజ్ చేయమని అడిగితే చేస్తారని హీరోయిన్ వర్ష బొల్లమ్మ చెప్పగా, తాను అడిగితేనే మూవీ రిలీజ్ డేట్ చెప్పారని లయ అంటుంది. వీళ్లిద్దరితో పోటీ పడుతూ స్వసిక విజయన్, సప్తమి గౌడ, బేబి శ్రీరామ్ దీత్య తాము చెప్పడం వల్లే 'తమ్ముడు' మూవీ రిలీజ్ డేట్ ను ప్రకటించారని అంటారు. ఇలా వీళ్లు గొడవ పడుతుండగా, దర్శకుడు శ్రీరామ్ వేణు వచ్చి 'మీ డౌట్స్ అన్నీ క్లారిఫై కావాలంటే ట్రైలర్ చూడండి.' అని చెప్తాడు. ట్రైలర్ అనౌన్స్ మెంట్ ఇలా సరికొత్తగా డిజైన్ చేయడం మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థతో హీరో నితిన్, దర్శకుడు శ్రీరామ్ వేణుకు మంచి అనుబంధం ఉంది. హీరో నితిన్ దిల్, శ్రీనివాస కళ్యాణం వంటి మూవీస్ చేయగా..దర్శకుడు శ్రీరామ్ వేణు నాని హీరోగా ఎంసీఏ, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా వకీల్ సాబ్ వంటి సూపర్ హిట్ చిత్రాలు రూపొందించారు. ఇప్పుడు ఈ ముగ్గురి కాంబినేషన్ లో 'తమ్ముడు' సినిమా వస్తుండటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రేక్షకులకు మర్చిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ను 'తమ్ముడు' సినిమాతో అందించబోతున్నారు. ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ కేవీ గుహన్, మ్యూజిక్ అజనీష్ లోకనాథ్.

## 13 నుంచి నాలుగు 'డీడీ నెక్స్ట్ లెవల్' స్ట్రీమింగ్



పాపులర్ హారర్ కామెడీ 'డెవిల్స్ డబుల్' ఇది 'డీడీ నెక్స్ట్ లెవల్'గా అందరికీ సుపరిచితమైన సంగతి తెలిసిందే. 'దిల్లుకు దుడ్డు'లో ఫ్రాంచైజీలో నాలుగో భాగం ఎక్స్‌క్లుజివ్‌గా తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో కేవలం జీ5లో మాత్రమే స్ట్రీమింగ్‌కు సిద్ధంగా ఉంది. క్రియేటివ్ రైటర్, డైరెక్టర్ ఎస్.ప్రేమ్ ఆనంద్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. హాస్యాన్ని అద్భుతంగా పండించి ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తటంలో తనదైన ప్రత్యేకతను సంపాదించుకున్న సంతానం ఇందులో ప్రధాన పాత్రలో నటించారు. ఇంకా సెల్వ రాఘవన్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, గీతికా తివారి తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. ది షో పీపుల్, నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ ఈ మూవీ సహ నిర్మాతలుగా వ్యవహరించారు. జీ తెలుగు, తమిళ, మలయాళ భాషల బిజినెస్ హెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సౌత్‌మార్కెటింగ్ లాయిడ్ సి.జేవియర్ మాట్లాడుతూ అత్యుత్తమ సినిమాలను మా ప్రేక్షకులకు అందించటాన్ని మేము గర్వంగా భావిస్తాం. జూన్13 నుంచి జీ5లో స్ట్రీమింగ్ 'డీడీ నెక్స్ట్ లెవల్ కానుంది.




## 13న కన్నప్ప ట్రైలర్ రిలీజ్

మంచు విష్ణు టైటిల్ పాత్రను పోషిస్తూ భారీ బడ్జెట్‌తో నిర్మించిన కన్నప్ప సినిమా ట్రైలర్ ఈనెల 13న విడుదల చేయనున్నారు. మోహన్ బాబు, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ వంటి భారీ తారాగణం నటించారు. 24ఫ్రేమ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. భారీ గ్రాఫిక్స్ తో ఈ సినిమాను నిర్మించామని హీరో, నిర్మాత విష్ణు చెప్పారు. అన్ని పనులు పూర్తి చేసి ఈనెల 27న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.



## కొత్త లవ్ స్టోరీతో ఆనంద్ దేవరకొండ

ఆనంద్ దేవరకొండ హీరోగా ఓ కొత్త లవ్ స్టోరీ తెరకెక్కుతోంది. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సారిక స్టూడియోస్, ఫార్చ్యూన్ 4 సినిమాస్, సితార ఎంటర్టైన్మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వైష్ణవి హీరోయిన్‌గా నటిస్తుంది.

## 'నిశ్శబ్ద' టీజర్ రిలీజ్

మనోజ్ కుమార్, ఆశిత రెడ్డి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'నిశ్శబ్ద'. ఈ చిత్రాన్ని శ్రీ రిషి సాయి ప్రొడక్షన్ బ్యానర్‌పై శ్రీనివాస్, ఎం.సంధ్యారాణి నిర్మిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రమణమూర్తి తంగెళ్ల పల్లి రూపొందిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'నిశ్శబ్ద' సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు నిర్మాత శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర టీజర్ ను హైదరాబాద్‌లో ఘనంగా రిలీజ్ చేశారు. అనంతరం చిత్రబృందం కేక్ కట్ చేసి నిర్మాత శ్రీనివాస్ బర్త్ డే సెలబ్రేషన్స్ జరిపారు. ఈ కార్యక్రమంలో యువ హీరోలు కృష్ణ, సంజయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నిర్మాత శ్రీనివాస్ మాట్లాడుతూ నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నా. 'నిశ్శబ్ద' టీజర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నా అని చెప్పారు. నిర్మాత ఎం. సంధ్యారాణి మాట్లాడుతూ మా 'నిశ్శబ్ద' సినిమా టీజర్ లాంఛ్ కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. ఒక డిఫరెంట్ హారర్ థ్రిల్లర్ మూవీగా మా సినిమా మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు ప్లాన్ చేస్తున్నాం. మా సంస్థ నుంచి మరిన్ని మంచి చిత్రాలు రాబోతున్నాయి. అన్నారు.



## ఆయిల్ ఫెడ్‌సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆయిల్ ఫెడ్‌సంస్థ ఆర్థికంగా బలోపేతంచేయడంతో పాటు రైతులు లాభాలను గడించేలా నిబద్ధతతో పని చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను అదేశించారు. హైదరాబాద్‌లోని పరిశ్రమల భవన్ లోని తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్ జంగా రాఘవ రెడ్డిఅధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయిల్ ఫెడ్ సంస్థ పనితీరుపై అధికారులతో మంత్రి సమిక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో నిర్మిస్తున్న ఆయిల్ పాం ఫ్యాక్టరీ పనులు జూలై నాటికి పూర్తి చేయాలన్నారు. ఆయిల్ పాం నర్సరీలను నిరంతరం పర్యవేక్షించడం ద్వారా నర్సరీ స్థాయిలోనే నాణ్యమైన మొక్కలను గుర్తించాలన్నారు. రైతులకు అంతర్ పంటల విషయంలో సరైన అవగాహన కల్పించాలని అందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల సహాకారం తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పాం పంట ను పొత్సహించడంతో పాటు విస్తీర్ణం పెంచాలని రాష్ట్రంలో 5 లక్షల ఎకరాల సాగు లక్ష్యంగా ఆయిల్ ఫెడ్ సంస్థ పనిచేయాలన్నారు. వచ్చే దశబ్ధానికి అన్ని విభాగాలలో సరిపడ నూతన సాంకేతిక గల ఉద్యోగులను నియమించాలని ఇందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సంస్థ ద్వారా ఆయిల్ ఫెడ్ ఉత్పత్తులు, ఉప ఉత్పత్తులను కూడా మార్కెటింగ్ చేసి ఆర్థికంగా బలోపేతం చేసుకుని సంస్థను ప్రగతి పథంలో నడిపించాలని మంత్రి తుమ్మల సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఈడి ప్రశాంత్ కుమార్, ఓఎస్‌డి కిరణ్ కుమార్, జనరల్ మెనేజర్ సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్ మెనేజర్ శ్రీకాంత్ రెడ్డి, హెచ్ ఆర్ మెనేజర్ సత్యనారాయణ తదిరులు పాల్గొన్నారు.



## బిసి కమిషన్‌లో రెండవ రోజూ.. బహిరంగ విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ బిసి కులాల జాబితా నుండి తొలగించిన 26 కులాలను తిరిగి చేర్చుకోవాలని వచ్చిన విజ్ఞప్తులపై తెలంగాణ బిసి కమిషన్‌లో రెండవరోజు ఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు బహిరంగ విచారణ నిర్వహించారు. బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటి డైరెక్టర్ యు.శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ జి.సతీష్ కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి.లక్ష్మి నారాయణ పాల్గొన్నారు. బహిరంగ విచారణలో 56 ప్రతినిధుల బృందాలను కమిషన్ విచారించింది. గవర, తూర్పుకాపు (గాజులకాపు), శెట్టిబలిజ, నాగవంశం, కొప్పుల వెలమ సంఘాల వారు కమిషన్ ముందు హాజరై తమ కులాలను తెలంగాణ బిసి జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ ఎం.పి. పాక వెంకట సత్యనారాయణ, కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ శెట్టిబలిజ కులం తరపున వాదనలు వినిపించారు. మరోవైపు తెలంగాణ బిసిఎ గ్రూపునకు చెందిన పలు కులాల ప్రతినిధులు తొలగించిన 26 కులాలను తిరిగి చేర్చుకోవద్దని కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ బహిరంగ విచారణ కమిషన్ కార్యాలయంలో బుధవారం కూడా జరుగుతుందని బిసి కమిషన్ అధికారులు తెలిపారు.

## సినిమా సిటీకి హైదరాబాద్‌ను రాజధానిగా తీర్చిదిద్దాలి

పూర్తి ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయండి
14న గద్దర్ సినిమా అవార్డులు అంగరంగ వైభవంగా నిర్వహించాలి
డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



ప్రజాపక్షం/హైదరాబాద్: సినిమా సిటీకి హైదరాబాద్ నగరాన్ని రాజధానిగా మార్చేందుకు అవసరమైన పూర్తి వివరాలతో కూడిన ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయాలని డిప్యూటీ సిఎం, మంత్రుల సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క సమాచార శాఖ కమిషనర్, ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. మంత్రులు, సబ్ కమిటీ సభ్యులైన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చించారు. హైదరాబాదును సినిమా సిటీగా అభివృద్ధి చేసి, దేశ, విదేశాల నుంచి సినిమా రంగ ప్రముఖులను ఆకర్షించడమే ప్రభుత్వ లక్ష్యం అని డిప్యూటీ సిఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సినిమా షూటింగ్ చేయాలంటే పోలీసు శాఖ, అగ్నిమాపక శాఖ, మున్సిపల్ శాఖ వంటి వివిధ శాఖల నుంచి విడివిడిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంది, ఫలితంగా సినీ పరిశ్రమ నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు, ఈ సమస్యను పరిష్కరించాలని పెట్టాలని సబ్ కమిటీ నిర్ణయించింది. వివిధ శాఖల నుంచి ఇవ్వాల్సిన అనుమతులను ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ లో ఒక అధికారిని నియమించి వారి ద్వారా అన్ని శాఖల నుంచి అనుమతులు త్వరితగతన ఇప్పించేలా సింగిల్ విండో పద్ధతిని ఏర్పాటు చేయాలని డిప్యూటీ సిఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రాంతాల్లో షూటింగులు జరగడం మూలంగా పర్యాటక రంగం అభివృద్ధికి అవకాశం ఉందని తెలిపారు. సినిమా థియేటర్లలో క్యాంటీన్ల ద్వారా విక్రయిస్తున్న తినుబండారాలు ఇతర వస్తువులు అత్యధిక రేట్లకు విక్రయిస్తున్నారు సామాన్యులు ఇబ్బందులకు గురవుతున్నారు ఈ నేపథ్యంలో ధరలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఫిలిండెవలప్మెంట్ కార్పొరేషన్‌కు గతంలో రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాలు మంజూరు చేసింది, ప్రస్తుతం ఆ భూమి పరిస్థితి వాటి వివరాలను వచ్చే సమావేశం నాటికి తీసుకు రావాలని సబ్ కమిటీ అధికారులను ఆదేశించారు. సినీ కార్మికుల కోసం నిర్మించిన చిత్రపురి కాలనీ పై ఏర్పాటుచేసిన ఆర్‌సిఎస్ కమిటీని వచ్చే సమావేశానికి పిలిపించాలని సూచించారు. 14న ఏర్పాటు చేస్తున్న తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్స్ ఫంక్షన్‌ను న భూతో.. న భవిష్యత్తు అన్నట్టుగా నిర్వహించాలని డిప్యూటీ సిఎం సూచించారు. ఈ కార్యక్రమానికి తెలుగు సినీ రంగ ప్రముఖుల అందరిని ఆహ్వానించాలని, తెలుగు సినిమాతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సినీ నటులను గుర్తించి ఆహ్వానించాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు.

సమావేశంలో ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు, హోం శాఖ స్పెషల్ సిఎస్ రవి గుప్తా, సమాచార శాఖ కమిషనర్ హరీష్, ఎఫ్డిసి డైరెక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పేదలపై పెను భారం (మొదటి పేజీ తరువాయి)

(మొదటి పేజీ తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలక ప్రభుత్వాలు కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ ప్రజలపై చార్జీల భారం మోపుతుతోందన్నారు. చార్జీల పెంపుపై ప్రభుత్వ, టిజిఎస్ ఆర్‌టిసి పునరాలోచాలన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుండి విద్యార్థులకు ఉచిత బస్ పాసులు ఇవ్వాలని శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవడంతో పాటు విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆర్‌టిసి యాజమాన్యం నెలకు రూ.400 ఉన్న బస్‌పాస్ చార్జీని ఏకంగా రూ.600కు, 3 నెలల ప్యాకేజీని రూ.1200 నుంచి రూ.1800 పెంచడంతో రాష్ట్రంలోని 10లక్షలకు పైగా పేద,మధ్యతరగతి, గ్రామీణ ప్రాంత విద్యార్థులపై పెనుభారం పడుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇప్పటికే ఇవ్వాల్సిన స్కాలర్‌షిపులు, ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో ఇప్పటికే ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను మరింత భారం మోపుతూ బస్ పాస్ చార్జీలను పెంచడం సరికాదన్నారు.

**తెలంగాణ జాగృతి, బిఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ధర్నా**

ఆర్‌టిసి బస్‌పాస్ చార్జీల పెంపును నిరసిస్తూ తెలంగాణ జాగృతి, బిఆర్‌ఎస్ విద్యార్థి విభాగం పోటాపోటీ ధర్నాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని బస్‌భవన్ వద్ద ముందుగా బిఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ధర్నా నిర్వహించగా, ఆ తర్వాత తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బస్‌పాస్ చార్జీల పెంపును ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత ధర్నా నిర్వహించారు. బస్‌భవన్ గేటు ముందు బైఠాయించారు. దీంతో పోలీసులు ఆమెతో పాటు జాగృతి నాయకులను అదుపులోనికి తీసుకుని కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం ఆమెను విడుదల చేశారు. అంతకు ముందు బిఆర్‌ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ సహా పలువురు బస్ భవన్ ముందు ధర్నా నిర్వహించారు. వారు గేటు దాటి బస్‌భవన్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోనికి తీసుకున్నారు.

**బస్ పాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోండి: కవిత**

పెంచిన బస్‌పాస్ ధరలను వెంటనే ఉప సంహరించుకోవాలని కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్ పాస్ ధరలను పెంచి ప్రజలపై ప్రభుత్వం పెనుభారాన్ని మోపిందని మండిపడ్డారు. బస్‌పాస్‌ల పెంపుతో ఒక్క ప్రయాణికునిపైన నెలకు దాదాపు రూ300లకు పైగా భారం పడుతుందని కవిత వివరించారు.

**ఎఐడిఎస్‌ఓ ఖండన**




బస్ పాస్ ఛార్జీల పెంచడాన్ని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజషన్ (ఎఐడిఎస్‌ఓ) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఇప్పటికే అనేక ఆర్థిక సమస్యలతో చదువును నెట్టుకొస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావాన్ని చూపనుందని పేర్కొంది. విద్యార్థుల బస్ పాస్ ఛార్జీల పెంపుకు వ్యతిరేకంగా ఎఐడిఎస్‌ఓ రూపొందించిన వాల్ పోస్టర్‌ను సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు బి.రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. నితీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.నాగరాజు విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల మంది విద్యార్థులపై, నగరవ్యాప్తంగా 2.5 లక్షల మంది ప్రజలపై ప్రభావం చూపించే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## వామ్మో జూన్ (మొదటి పేజీ తరువాయి)

పెరిగిన ఫీజులను చూసి తల్లిదండ్రులు భయపడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో ఎల్‌కెజి విద్యార్థులకు సుమారు రూ. 10వేల నుండి రూ. 20వేల దాకా వసూలు చేస్తున్నారు. కార్పోరేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు మొదట చెల్లించాల్సి ఉంటుంది. తమ పిల్లలకు ఏది తక్కువ కాకూడదనే భావనతో తల్లిదండ్రులు వస్తువులు ఎంత ఖరీదైనా సరే కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో షూ, పుస్తకాలు, బ్యాగులు ఇలా అన్ని రకాల వస్తువుల ధరలు పెరగడం తల్లిదండ్రులకు భారంగా మారింది. ఇంకా పుస్తకాల ధర చూస్తే మతి పోవాల్సిందే. ఎల్‌కెజి, యుకెజి పిల్లలకు వెయ్యి రూపాయలకు తగ్గకుండా నోటు పుస్తకాలు అవుతున్నాయి. ఇవ్వన్ని చూసి తల్లిదండ్రులు ఇప్పుడే లెక్కలు వేసుకుంటున్నారు. జూన్ నెల వచ్చిందంటే రైతులపైన పెట్టుబడి భారం ఉంటుంది. ఈ సమయంలో వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయి. ఇప్పటికే తొలకరి వర్షాలు కురవడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలు చేయడంతో పాటు దుక్కుల ఖర్చులు ఉంటాయి. మొత్తంగా ఈ సీజన్ ప్రారంభంలో ఎకరాకు కనీసం రూ. 20వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. చేతిలో చిల్లిగవ్వ లేకుండా సాగు ప్రారంభించిన రైతులు పెట్టుబడుల కోసం వెతుకులాటలో ఉన్నారు. బ్యాంకులను, వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మరో వైపు విత్తనాలు, ఎరువుల ధరలు ఈ ఏడాది అమాంతం పెరగడంతో రైతులకు మరింత భారం కానుంది.

## మళ్లీ కులగణన (మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. కర్ణాటకలో పరిస్థితులపై సవివరమైన, ఫలవంతమైన చర్చ జరిగిందన్నారు. తాము చర్చించిన ప్రధాన అంశాల్లో కులగణన ఒకటి అన్నారు. ఈ అం శంపై జూన్ 12న కర్ణాటక క్యాబినెట్ ప్రత్యేక సమావేశమై చర్చిస్తుందని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన కులగణన విధానాన్ని తాము సూత్రప్రాయంగా ఏకీభవిస్తున్నప్పటికీ.. లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కొన్ని వర్గాల్లో ఆందోళనలు ఉన్నాయన్నారు. గతంలో చేపట్టిన కుల గణన సమాచారం దాదాపు పదేళ్ల క్రితానిది గనక నిర్ణీత కాలపరిమితి (60–80రోజుల)లోగా తిరిగి కులగణన చేపట్టే అంశా న్ని పరిశీలించాలని కర్ణాటక సిఎంకు పార్టీ సూచించిందన్నారు. దీనిపై సిఎం సిద్ధరామయ్య మరిన్ని వివరాలను అందిస్తారని చెప్పారు. అలాగే, ఈ భేటీలో కర్ణాటకలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన విషాద ఘటనపైనా చర్చించినట్లు వేణుగోపాల్ తెలిపారు. తొక్కిసలాట ఘటన, తదనంతర పరిణామాలను కాంగ్రెస్ అగ్రనేతలకు కర్ణాటక సిఎం, పిసిసి చీఫ్ వివరించారని తెలిపారు. ప్రతి ఒక్కరి ప్రాణాన్ని తమ పార్టీ ఎంతో విలువైనదిగా భావిస్తుందన్న కెసి వేణుగోపాల్... ఈ దురదృష్టకర ఘటనలో ఏం జరిగిందో స్పష్టంగా తెలుసుకొనేందుకు ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించిందన్నారు. ప్రజానుకూల వైఖరితో తమ పార్టీ ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కర్ణాటకను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కర్ణాటక పట్ల కేంద్ర ప్రభుత్వం తీరు ఆమోద యోగ్యం కాదన్నారు. 2015లో కర్ణాటక వెనుకబడినవర్గాల కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతృత్వంలో కులగణన చేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాశ్ హెగ్డే నేతృత్వంలో పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి గతేడాది సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే. కులగణన, ఆర్థిక, సామాజిక సమీక్షపై రూపొందించిన ఈ నివేదికను కర్ణాటక సర్కారు గతంలో ఆమోదించింది. నిపుణులు రూపొందించిన ఈ నివేదికపై భిన్నాభిప్రాయాలు, పలు వర్గాల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ తాజా నిర్ణయం కీలక ప్రాధాన్యం సంతరించుకుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com